ముహూర్తం

శ్రీ వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, శుక్లపక్షం. తిథి: సప్తమి సా.6.35. వారం: గురువారం. నక్షత్రం: ఉత్తరాభాద్ర రా.తె.5.35. అమృతకాలం: రా.12.27 నుంచి 2.14. వర్జ్యం: మ.1.35 నుంచి 3.21. దుర్ముహూర్తం: ఉ.10.46 నుంచి 11.34, మరల మ.3.24 నుంచి 4.22. రాహుకాలం: మ.1.30 నుంచి 3.00. యమగండం: ఉ.6.00. సూర్యోదయం: 6.46, సూర్యాస్తమయం: సా.5.54.

Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!



సంపుటి: 64 • సంచిక: 345 • గురువారం 2 జనవరి 2020 • విజయవాడ * పేజీలు: 10+12 • వెల: 5.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Tirupati | Visakhapatnam | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad



జన నేత... జన వరాలు

శుభాల నెల... మేళ్లు భళా!

• ఆర్టీసీ విలీనంతో ప్రారంభం • నేటి నుంచి రైతు భరోసా చివరి విడత పంపిణీ • ఇసుక డోర్ డెలివరీ • రేపటి నుంచి కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు • 4 నుంచి 9 వరకూ పాఠశాల మార్పులపై అవగాహన • 9న అమ్మ ఒడి • ఉద్యోగ క్యాలెండర్ ఏర్పాటుకు ఆదేశాలు • జనవరిలో జనాలకు సీఎం జగన్ వరాల జల్లు

అమరావతి, ఆంధ్రప్రభ: కొత్త ఏడాదిలో తొలి మాసమైన జనవరిలో ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రప్రజలకు అనేక వరాలు ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా జనవరి మొదటి రోజున ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనంచేసి 52 వేల కుటుంబాలకు ఉద్యోగ భద్రత కల్పించారు. అక్కడి నుండి జనవరి మాసంలో ఏమేమి చేయాలో క్యాలెండర్ తయారుచేసుకుని ఏఏ కార్యక్రమాన్ని ఏఏ రోజు అమలు చేయాలో అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. జనవరి 2వ తేదీన రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలుచేస్తున్న వైయస్సార్ రైతు భరోసా - కిసాన్ సమ్మాన్

➪ 3వ పేజీలో...

3 రాజధానులు మంచిదే!



• సీఎం ఆలోచనలకు అనుగుణంగానే హైపవర్ నివేదిక • హైకోర్టు, సచివాలయాలతో పది శాతం ప్రజలకే అవసరం • మరోసారి సంచలన వ్యాఖ్యలు చేసిన మంత్రి పెద్దిరెడ్డి

అమరావతి, ఆంధ్రప్రభ: నవ్యాంధ్ర రాజధాని అమరావతి మార్పుపై నిరసన సెగలు వెల్లువెత్తుతుండగా.. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆలోచనలకనుగుణంగానే హైపవర్ నివేదిక ఉండబోతోందని లీకిచ్చారు. ఆర్టీసిని ప్రభుత్వంలో

➪ 3వ పేజీలో...

తాగి ఊగారు!



• డిసెంబర్ 31 ఎఫెక్ట్
• రూ.105 కోట్ల మద్యం అమ్మకాలు
• కృష్ణా జిల్లా టాప్
• శ్రీకాకుళం లాస్ట్

3

గగన్‌యాన్‌కు నలుగురు



• చంద్రయాన్-3 నుంచి గగన్‌యాన్ దాకా..
• 2020 లో 25 ప్రయోగాలు
• కొత్త ఏడాది లక్ష్యాలను వెల్లడించిన ఇస్రో

3



చిచ్చుపెట్టి చోద్యమా!

• అమరావతిపై ఎందుకింత కడుపుమంట • ఏ పోరాటానికైనా సిద్ధం కావాలి • రైతులకు పిలుపునిచ్చిన తెదేపా అధినేత • పాలన చేతకాకపోతే రాజీనామా చెయ్! • సీఎం జగన్‌పై మాజీ సీఎం చంద్రబాబు ధ్వజం

3లో

కేబుల్ బిల్ రూ.160 లోపే!

• టారిఫ్‌ను సవరించిన ట్రాయ్
• మార్చి నుంచి అమలు

6లో

రాయితీ లేని సిలిండర్ రూ.19 పెంపు

6లో



సీఎం జగన్‌కు డీజీపీ శుభాకాంక్షలు

అమరావతి ఆంధ్రప్రభ : నూతన సంవత్సర సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి ఏపి డీజీపీ గౌతమ్‌సవాంగ్ శుభాకాంక్షలు తెలిపారు. తాడేపల్లి లోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో జగన్‌ను బుధవారం నాడు కలిసిన డీజీపీ సవాంగ్ ఆయనకు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలను చిరునవ్వుతో పలకరించండి

కొత్త సంవత్సరం వేడుకల్లో డీజీపీ సవాంగ్

అమరావతి ఆంధ్రప్రభ : పోలీసులను సాయం కోరి వచ్చే ప్రజలను చిరునవ్వుతో పలుకరించాలని, వారి పనులను సక్రమంగా చేసి పంపించాలని డిజిపి దామోదర గౌతమ్ సవాంగ్ అన్నారు. మంగళగిరి డిజిపి కార్యాలయంలో కొత్త సంవత్సర వేడుకలను బుధవారం నాడు ఉత్సాహపూరిత వాతావరణంలో జరుపుకున్నారు. తొలుత డిజిపి సవాంగ్ కేకు కట్ చేసి కొత్త సంవత్సర వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిజిపి సవాంగ్ మాట్లాడుతు ప్రజల కోసం మనం చేస్తున్న సేవలను ఏ మాదిరిగా చేస్తున్నామన్నది సిబ్బంది ఆత్మవిమర్శ చేసుకోవాలని అన్నారు. సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోందని, వీక్లీఆఫ్ పద్దతి ప్రవేశ పెట్టడం, ఆరోగ్య శిబిరాల నిర్వహణ, బ్యాంకు ఖాతాల ద్వారా ఉచిత భీమా సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. విజయవాడ పోలీసు కమిషనర్ ద్వారకా తిరుమలరావు, ఏడిజిపి హరీష్‌కుమార్ గుప్త, పోలీసు రిక్రూట్‌మెంట్ ఛైర్మన్ అమిత్‌గార్గ్, లాఅండ్ ఆర్డర్ ఏడిజిపి రవిశంకర్ అయ్యన్నార్, ఐజిలు శ్రీధరరావు, మహేష్‌చంద్ర లడ్డా, డిఐజి పాలరాజు, ఏఐజి ఎస్వీ రాజశేఖరబాబు తదితరులు కూడా హాజరయ్యారు.

టీఎస్ ఈఎస్ఐ స్కామ్‌లో కొనసాగుతున్న అరెస్టులు

- మరో ఇద్దరిని అరెస్ట్ చేసిన ఏసీబీ
- 22కు చేరిన నిందితుల సంఖ్య
- ఇప్పటికే 200 కోట్ల వరకు స్కామ్ జరిగినట్లు గుర్తించిన ఏసీబీ

ఆంధ్రప్రభ, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాలలో సంచలనం రేపిన ఈఎస్ఐ కుంభకోణంలో కొత్త కోణం దిగ్ర్భమకు గురిచేస్తోంది. ఇప్పటికే 200 కోట్ల రూపాయల మేర అవినీతి జరిగినట్లు బావిస్తుండగా నిందితులు అరెస్టు అవుతున్న కొద్దీ కొత్త విషయాలు వెలుగులోకి వచ్చి ఆశ్చర్యపరుస్తున్నాయి. తాజాగా బుధవారం ఇద్దరు నిందితులను ఏసీబీ అరెస్టు చేసింది. వీరిచ్చిన సమచారం ప్రకారం, తెల్లరక్తకణాలను గుర్తించి, వాటి సంఖ్యను గణించే మిషన్ల పేరుతోను, వాటికి అనుబంధంగా పనిచేసే మరో రెండు యంత్రాల పేరుతో దాదాపు రూ. 12 కోట్ల రూపాయల మేర స్వాహా చేసినట్లు తేలింది. ఈఎస్ఐ మాజీ డైరక్టర్ దేవికారాణి, జాయింట్ డైరక్టర్ పద్మసహా 22 మందిని ఏసీబీ అరెస్ట్ చేసింది. మొత్తం మీద, మందులు, పరికరాలు, సర్జరీకి ఉపయోగించే సామాగ్ర సహా ఎక్కడ దొరికితే అక్కడ ఈ అవినీతి సిబ్బంది దోపిడీకి పాల్పడిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం బాబ్జి, వెంకటేశ్ అనే నిందితులను అరెస్ట్‌చేశారు. కంచర్ల శ్రీహరిబాబు అలియాస్ బాబ్జి ఓమిని మెడి అనే ఏజెన్సీ పేరుతో... తెల్లరక్తకణాల సంఖ్యను గుర్తించే మెషిన్లను తయారు చేసి, ఈఎస్ఐకు అధిక రేట్లకు విక్రయించి, అలా అక్రమంగా బిల్లులు పొంది సొమ్ము చేసుకున్నారు. అసలు రూ. 11, 800 మాత్రమే ఉన్నా.. తెల్లరక్త కణాలను గుర్తించే మెషిన్‌ను 36 వేలకు ఒక్కో మిషన్‌ను విక్రయించారు. దాదాపు ఒక్కో మిషన్‌పై 17,600 రుపాయాలను అక్రమంగా డైరెక్టర్ ప్రమేయంతో ఈఎస్ఐ నిధులను పక్కదారి పట్టించారు. అలా గడిచిన ఏడాదిలో లెజెండ్ ఎంటర్ ప్రైజెస్ పేరుతో 4, 500 మిషన్లను సప్లై చేసి కోటి 77 లక్షల 75 వేలు అక్రమంగా సొమ్ము చేసుకున్నారు. రెండు మిషన్లకు కలిపి ఈఎస్ఐ నుంచి ఒక్క ఏడాదిలోనే రూ. 12 కోట్ల 84 లక్షల 96 వేల సొమ్మును అక్రమంగా దారి మళ్లించారు. ఇందుకు మరో నిందితుడు వెంకటేష్ పూర్తి సహకారాన్ని అందించారు. వీరిద్దరిని ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఏసీబీ అధికారులు చెబుతున్నారు. కాగా ప్రస్తుతం ఏసీబీ అరెస్ట చేసిన ఓమిని కంపెనీ ఛైర్మన్ శ్రీహరిబాబుకు సంబంధించిన ఆస్తులపై ఇప్పటికే ఏసీబీ అధికారులు దృష్టి సారించారు. రూ.99 కోట్ల షేర్‌తో పాటు రూ.30 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఏసీబీ ఇప్పటికే గుర్తించింది. శ్రీహరిబాబును ఏసీబీ అధికారులు రెండు రోజుల క్రితమే అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, అధికారికంగా బుధవారం అరెస్ట్‌ను ప్రకటించారు. ఇదిలా ఉంటే మాజీ డైరెక్టర్ దేవికారాణిపై మనీ లాండరింగ్ కేసును ఈడీ నమోదు చేసింది. అధికారంలో ఉండగా ఆమె పెద్ద మొత్తంలో షెల్ కంపెనీలు ఏర్పాటు చేసినట్లుగా ఈడీ పక్కా ఆధారాలు సేకరించింది.

ఓపెన్ వర్సిటీగా గురజాడ ?

- ప్రతిపాదనలు సిద్ధం
- వచ్చే విద్యాసంవత్సరానికి ఏర్పాటు?

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో పూర్తిస్థాయి ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. ప్రతి రాష్ట్రంలో ఒక ఓపెన్ యూనివర్సిటీ ఉండాలని కేంద్ర ప్రభుత్వం మార్గదర్శ కాల్లో ఉంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పూర్తి స్థాయిలో దూరవిద్య నందిస్తోంది. విభజనానంతర ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనేక యూని వర్సిటీలు దూరవిద్యలో అనేక కోర్సులను అందిస్తున్నప్పటికీ కేంద్రం మార్గదర్శకాల ప్రకారం పూర్తిస్థాయి ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు కావాల్సి ఉంది. విభజన చట్టంలోని పదో షెడ్యూల్ ప్రకారం కూడా రాష్ట్రంలో ఓపెన్ యూనివర్సిటీ ఇప్పటికే ఏర్పాటు కావాల్సి ఉంది. అయితే ఒక ఓపెన్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలంటే అందుకు కావాల్సిన భూసమీకరణ, భవన నిర్మాణాలు, వైస్ చాన్స్లర్ స్థాయి నుంచి సిబ్బంది వరకు అనేక నియామకాలు జరపాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న విశ్వవిద్యాలయాల్లో ఒక దానిని పూర్తిస్థాయి ఓపెన్ యూనివర్సిటీగా మారుస్తారనే అభిప్రాయాలున్నాయి.

జీఈఆర్ పెంపే లక్ష్యంగా..

రాష్ట్రంలో పూర్తి స్థాయి ఓపెన్ యూనివర్సిటీని ఏర్పాటు చేయ డం ద్వారా గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో(జీఈఆర్)ను గణనీయం గా పెంచాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. అక్షరాస్యతపై కేంద్రం అన్ని రాష్ట్రాల్లో నిర్వహించిన సర్వే ప్రకారం క రాడా మన రాష్ట్రం వెనుకబడి ఉన్న విషయం తెలిసిందే. ఈ నేప థ్యంలో ఓపెన్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తే.. వివిధ కారణాల వల్ల చదువుకోలేని వారు, మధ్యలో చదువును ఆపేసిన వారికి మరింత ఊతం అందించి నట్లుగా ఉంటుందని



ఉన్నతవిద్యా మండలి అధికారులు భావిస్తున్నా రు. ఇప్పటికే రాష్ట్రంలోని పలు వర్సిటీలు దూరవిద్యలో అనేక కోర్సులు అందిస్తున్నప్పటికీ.. అవి యూనివర్సి టీలకు అనుబంధంగా మాత్రమే కొనసాగు తున్నాయి. అందువల్ల వర్సిటీ ల పరిధిలో స్టడీ సెంటర్ల ద్వారా అడ్మిషన్లు జరుగుతున్నాయి. అదే పూర్తిస్థాయిలో దూర విద్య కోసం ఒక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసినట్ల యితే జీఈఆర్ శాతాన్ని గణనీయంగా పెంచే అవకాశాలుంటాయని ఉన్నతాధికారులు చెబుతున్నారు. అయితే సాంకేతికంగా ఓపెన్ యూనివర్సిటీ ఏదైనా రాష్ట్రస్థాయి యూని వర్సిటీ ఉన్న ప్రాంతంలో ఉంటే.. అన్ని రకాలుగా అనుకూలంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ఉస్మానియా యూని వర్సిటీ ఉండగా.. అదే జిల్లాలో డా. బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ని ఏర్పాటు చేయడం జరిగింది. అదే విధంగా చూస్తే.. విశాఖపట్నం లో ఆంధ్రా యూనివర్సిటీ ఉండ గా.. అదే జిల్లాలో ఉన్న గురజాడ అప్పారావు యూనివర్సిటీని ఓపెన్ యూనివర్సిటీ గా మారిస్తే బాగుంటుందని ప్రతిపాదనలు రూపొందించినట్లు సమాచారం. ఈ అంశంపై ఇప్పటికే ఉన్నతస్థాయిలో చర్చ లు జరిగినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గురజాడ అప్పారావు విశ్వవిద్యాలయాన్నే అదే పేరుతో ఓపెన్ యూనివర్సిటీగా మార్పు చేసే అవకా శాలు కనిపిస్తున్నాయి. ప్రభు త్వం కనుక త్వరలో నిర్ణయం తీసు కుంటే వచ్చే విద్యాసంవ త్సరానికి పూర్తిస్థాయి ఓపెన్ యూనివర్సిటీ అందుబాటులోకి రానుంది.

ప్రభుత్వ పరిశీలనలో ఉంది: ఉన్నతవిద్యామండలి ఛైర్మన్ ప్రొ. కె. హేమచంద్రారెడ్డి

రాష్ట్రంలో పూర్తిస్థాయి ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె. హేమచంద్రారెడ్డి తెలిపారు. అయితే ఏ యూనివర్సిటీని ఓపెన్ యూనివర్సిటీగా చేయాలన్నది ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని అన్నారు. ప్రభుత్వ లక్ష్యం ప్రకారం ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న జీఈఆర్ నిష్పత్తి 35 శాతాన్ని.. 50 నుంచి 70 శాతానికి తీసుకెళ్లాలంటే ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా సాధించడం సాధ్యమేనని ఆయన చెప్పారు.

కష్టాల్లో ఉన్నా చెల్లింపులు చేస్తున్నాం

విద్యుత్ శాఖా మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర విద్యుత్ రంగం తీవ్ర సంక్షోభంలో ఉన్నప్పటికీ రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేసేందుకు కట్టుబడి ఉందని ఇంధన, అటవీ, పర్యావరణ శాఖా మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి చెప్పారు. ఈమేరకు బుధవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. ఒక వైపు రైతులకు ఉచిత విద్యుత్ అందించడంతోపాటు మరోవైపు 24/7 విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఇదిలా ఉండగా గత 18 నెలలుగా పెండింగ్‌లో ఉన్న సాంప్రదాయేతర విద్యుత్ కంపెనీలకు ఈ పరిస్థితుల్లో కూడా ప్రభుత్వ సహాయంతో డిస్కంలు బకాయిలను చెల్లిస్తున్నాయని తెలిపారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం సాంప్రదాయేత ఇంధన డెవలపర్లకు 2019 డిసెంబరులో రూ. 1,212.28 కోట్ల మేర డిస్కంలు చెల్లింపులు జరిపాయన్నారు. వాస్తవానికి గత ఏడాది సెప్టెంబరు 21 వరకు పవన విద్యుత్ సంస్థలకు రూ. 1,896.87 కోట్లు, 44 సోలార్ జనరేటర్లకు రూ. 359.10 కోట్లు వెరసి రూ. 2,255.97 కోట్ల మేర చెల్లించాల్సి ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలోనే గత 18 నెలలుగా పేరుకుపోయిన సాంప్రదాయేతర ఇంధన జనరేటర్లకు చెల్లింపులు ఏర్పాటుచేసేందుకు తమ ఆర్థిక పరిస్థితిని కూడా లెక్కచేయకుండా డిస్కంలు అవసరమైన చర్యలు ప్రారంభించాయన్నారు. ఇందుకోసం ఐరిడా, పీఎఫ్‌సీ, ఏపీపీఎఫ్‌సీ, ఎస్‌బీఐ, ఆంధ్ర బ్యాంకు వంటి అనేక బ్యాంకుల నుండి యుటిలిటీస్ రుణాలను సేకరిస్తోందని, కానీ, పునరుత్పాదక ఇంధన బకాయిలను చెల్లించడంలో రాష్ట్రప్రభుత్వం పూర్తి సహకారాన్ని అందించిందని తెలిపారు.

దీంతో ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్, ఐఆర్ఈడీఏ నుండి రుణం పొంది పునరుత్పాదక ఇంధన డెవలపర్ల బకాయిలను తీర్చేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా డిసెంబరు 12న సోలార్, విండ్ డెవలపర్‌లకు డిస్కంలు రూ. 8.82 కోట్లు, 18న రూ. 205.89 కోట్లు, 19న రూ.119 కోట్లు, డిసెంబరు 31న రూ. 868.57 కోట్లు వంతున చెల్లింపులు చేశాయన్నారు. పునరుత్పాదక ఇంధన కొనుగోళ్లు అధిక ధరలకు చేపట్టడం వలన డిస్కంలు దివాళాతీసే పరిస్థితికి చేరుకున్నాయని మంత్రి బాలినేని చెప్పారు. వీటికి చెల్లింపులు అనివార్యం కావడంతో కొంత ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదురైనట్లు వివరించారు. డిస్కంలు రుణ పరిమితి దాటినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితిని గమనించి రుణాలు పొందేందుకు వెసులుబాటు కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడంతో పునరుత్పాదక ఇంధన బకాయిలను చెల్లించే వీలుకలిగిందన్నారు. విద్యుత్ రంగం అనేక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ వ్యవసాయానికి 9 గంటల విద్యుత్‌ను, ప్రజలకు 24/7 విద్యుత్‌ను అందిస్తోందని చెప్పారు. రాబోయే రోజుల్లో డిస్కంలను బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు. ఇందుకోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో కట్టుబడి పనిచేస్తుందని చెప్పారు.



ఆర్టీసీ కార్మికులు నష్టపోకుండా చూడాలి

కార్మిక పరిషత్ నేతలకు చంద్రబాబు సూచన

అమరావతి, ఆంధ్రప్రభ: ఆర్టీసీ విలీనంలో కార్మికులు, ఉద్యోగులు నష్టపోకుండా చూడాలని మాజీ ముఖ్యమంత్రి, తెదేపా జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆర్టీసీ కార్మిక పరిషత్ నేతలకు సూచించారు. ఆర్టీసీ కార్మికులు, సంస్థకు ఇబ్బందులు ఎదురైతే తేదేపా అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఏపీఎస్‌ఆర్టీసీ కార్మిక పరిషత్ ముద్రించిన 2020 క్యాలెండర్‌ను చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి 43శాతం, కొత్త బస్సుల కొనుగోలుకు 25శాతం తెదేపా ప్రభుత్వంలో కేటాయించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వరహాల నాయుడు మాజీ సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు చెపుతూ ప్రతి ఏటా ఆనవాయితీగా క్యాలెండర్ ఆవిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావ్, విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శ్రీనివాస్(నాని), ఆర్టీసీ మాజీ ఛైర్మన్ వర్ల రామయ్య, కార్మిక పరిషత్ నేతలు ఎస్‌వి శేషగిరి, వై.శ్రీనివాసరావు, కె.సురేంద్ర, వై.రమేష్, ఎస్.ప్రభాకర్, వై.విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కొత్త సంవత్సర వేడుకల్లో అపశృతులు

- రోడ్డు ప్రమాదాల్లో 12 మంది మృతి
- మొత్తం డ్రంకెన్ డ్రైవ్ కేసులు 794
- అత్యధికం విశాఖలో 287 కేసులు నమోదు

అమరావతి ఆంధ్రప్రభ: కొత్తసంవత్సర వేళలో రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో అపశృతులు దొర్లాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు జరిగిన వేర్వేరు సంఘటనల్లో పలువురు మృతి చెందగా కొందరు తీవ్రంగా గాయపడ్డారు. మద్యం మత్తులో వాహనాలు డ్రైవ్ చేయరాదని, జాగ్రత్తలు పాటించాలని కొన్ని రోజులుగా పోలీసులు సూచనలు చేస్తున్నా మద్యం మత్తులో డ్రైవ్ చేస్తు జరిగిన ప్రమాదాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 12 మంది మృతి చెందారు. 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. విశాఖలో ఒకరు, తూర్పుగోదావరి జిల్లాలో ముగ్గురు, పశ్చిమ గోదావరిలో ఒకరు, గుంటూరు జిల్లాలో ఇద్దరు, ప్రకాశం, కడప, అనంతపురం జిల్లాల్లో ఒక్కొక్కరు, చిత్తూరు జిల్లాలో ఇద్దరు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారు. నెల్లూరు జిల్లాలో సముద్ర స్నానాలకు వెళ్లిన ముగ్గురు మృత్యువాత పడ్డారు.





వాకాడు మండలం తూపిలిపాలెం బీచ్‌లో తెల్లవారు జామున సముద్రంలో స్నానం చేస్తుండగా అలల తాకిడికి ముగ్గురు గల్లంతయ్యారు. అనంతరం వారి మృతదేహాలను మిగతా స్నేహితులు వెలికి తీశారు.

మృతి చెందిన వారిని సోనియా, సోను, మధుగా గుర్తించారు. యువతులు తిరుపతికి చెందిన వారు కాగా మధు జీవకోన ప్రాంతానికి చెందిన వాడని పోలీసులు తెలిపారు. మిగతా స్నేహితులు మృతదేహాలను కారులో తీసుకు వెళ్తుండగా స్థానికులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయగా వాకాడు పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. విశాఖ. తూర్పు గోదావరి. కర్నూలు, కడప జిల్లాల్లో ఎక్కువ మంది ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడ్డారు. ఇక రాష్ట్రంలో మొత్తం 794 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. ఇందులో అత్యధికంగా విశాఖ జిల్లాలోనే 287 కేసులు నమోదయ్యాయి. తర్వాతి స్థానంలో గుంటూరులో 83, విజయనగరంలో 78, శ్రీకాకుళం జిల్లాలో 50, విజయవాడలో 55 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి.

ప్రభుత్వ సహకారం ఉద్యోగులకు అవసరం

- ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వరు

అమరావతి,ఆంధ్రప్రభ: ఉద్యోగులకు ప్రభుత్వం అన్ని విషయాల్లో సహాయ సహకారాలు అందించాలని ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. విజయవాడ రాజ్ భవన్‌లో గవర్నర్ విశ్వభూషన్ హరిచందన్‌ను బుధవారం కలిసి నూతన సంవత్సర శుభాకాం క్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంతి ఉద్యోగుల పక్షాన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడు తూ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందవలసిన సౌకర్యాల విషయంలో గవర్నర్ సహాయం కూడా అందించాలని కోరారు. ప్రతి సంవత్సరం జరుగుతున్న విధంగానే ఈ రోజు కూడా నూతన సంవత్సర వేడుకలు ఆనందోత్సహాలతో జరుపుకున్నామన్నారు. రాబోయే 2020 సంవత్సరంలో ఏపీ జేఏసీ అమరావతి సానుకూల దృక్పదంతో ముందుకు సాగుతుందన్నారు. ప్రభుత్వంతో సత్సంబంధాలు కలిగి ఉద్యోగులకు రావలసిన రాయితీలు పొందుతా మని అదేవిధంగా రాజీపడకుండా ఉద్యోగుల సమస్యలు ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ అమరావతి సిటీ యూనియన్ క్యాలెండర్ ను ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ ఫణి పేర్రాజు ఆవిష్కరించారు. ఈ కార్య క్రమంలో ఏపీ జేఏసీ అమరావతి సెక్రటరీ జనరల్ ఫణి పేర్రాజు, కోశాధికారి మురళీకృష్ణనాయుడు, కో ఛైర్మన్లు కొండయ్య జనకుల శ్రీనివాసరావు, కృష్ణాజిల్లా ఛైర్మన్ డి ఈశ్వర్, గుంటూరు జిల్లా ఛైర్మన్ కె సంగీతరావు, సిటీ యూనిట్ ఛైర్మన్ కె కళాధర్, మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ శ్యామల, వైఎస్ ఛైర్మన్ సుల్తానా పూర్ణిమ తదితర నాయకులు ఉద్యోగులు పాల్గొన్నారు.

విహారంలో విషాదం!

- నూతన సంవత్సర వేళ నెల్లూరు జిల్లా తూపిలిపాళెం తీరంలో ముగ్గురి మృత్యువాత
- సముద్రంలో స్నానం చేస్తూ మునిగిపోయిన ఇద్దరు యువతులు, ఓ యువకుడు

ప్రభన్యూస్ ప్రతినిధి, నెల్లూరు : వారంతా 20, 21 సంవత్సరాల వయసు గల వారే. నూతన సంవత్సర వేళ సముద్ర స్నానం చేద్దామని తిరుపతి నుంచి నెల్లూరు జిల్లా తూపిలిపాళెంకు వచ్చి సముద్రంలో మృత్యువాత పడ్డారు. వివరాల్లోకెళితే.. చిత్తూరు జిల్లా తిరుపతి పట్టణానికి చెందిన లీలామహల్ సెంటర్లో నివసిస్తున్న 3వ సంవత్సరం ఇంజనీరింగ్, 2వ సంవత్సరం డిగ్రీ చదువుతున్న సోనియా, సోనూలు జీవకోన ప్రాంతానికి చెంది ట్రాన్స్‌కోలో టెంపరరీ డ్రైవర్‌గా పనిచేస్తున్న రవికుమార్, రాహుల్ ద్రావిడ్ (అలియాస్ మధు), క్యాబ్ డ్రైవర్ చంద్రశేఖర్‌లు కలిసి నూతన సంవత్సర వేడుకలను ఆనందంగా, ఆహ్లాదంగా జరుపుకునేందుకు మంగళవారం సాయంత్రం 6.30 గంటల సమయంలో తిరుపతి నుంచి ఏపీ బీవై-1144 నెంబరు గల కారును మాట్లాడుకుని కారు డ్రైవర్ బాబాజీ స్నేహితుడు కావడంతో అందరూ కలిసి రాత్రి 10.30 గంటల సమయంలో నెల్లూరు జిల్లా తూపిలిపాళెం బీచ్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో సముద్రతీరం వద్ద డ్యూటీలో ఉన్న మెరైన్ కానిస్టేబుల్, పోలీసు సిబ్బంది తీరం వద్ద ఉండొద్దని హెచ్చరించడంతో వారు వెనుదిరిగారు.

అనంతరం వారు వచ్చిన కారును తూపిలిపాళెం గ్రామంలో ఒక మారుమూల ఉంచి అర్థరాత్రి 12 గంటల సమయంలో పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేడుకలు జరుపుకున్నారు. అనంతరం బుధవారం ఉదయం 6 గంటల సమయంలో తిరిగి తీర ప్రాంతానికి చేరుకున్న వారు సముద్ర స్నానం చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే సముద్ర తీరంలో ఉన్న మత్స్యకారులు సముద్రంలో అలల అలజడి అధికంగా ఉందని, లోపలకు వెళ్లొద్దని వారిని హెచ్చరించారు. అయితే వారు ఎంత చెప్పినా వినకుండా సోనియా, సోనూ, రాహుల్ ద్రావిడ్‌లు సముద్రంలోకి దిగారు. అలల తాకిడికి ఆ ముగ్గురు సముద్రంలో మునిగిపోతుండడంతో చంద్రశేఖర్ వారిని కాపాడేందుకు సముద్రంలోకి వెళ్లి తాను కూడా మునిగిపోతూ కాపాడమంటూ కేకలు పెట్టాడు. దీంతో సమీపంలో ఉన్న మత్స్యకారులు చంద్రశేఖర్‌ను ప్రాణాపాయం నుండి కాపాడారు. అదేవిధంగా



సముద్రంలో కొట్టుమిట్టాడుతున్న ముగ్గురిని కాపాడేందుకు మరపడవ సహాయంతో లోనికి వెళ్లిన మత్స్యకారులు ఆ ముగ్గురిని తీరానికి చేర్చారు. వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వెంటనే హాస్పిటల్‌కు తరలించాలనే ఉద్దేశ్యంతో వారు తెచ్చిన కారులోనే హాస్పిటల్‌కు తీసుకువెళ్లాలని కోరగా కారు డ్రైవర్ బాబాజీ, చంద్రశేఖర్‌లు భయపడి కారుతో సహా తిరుపతికి తరలించాలని పోతుండగా వాకాడు ఎస్సై భోజ్యానాయక్ తన సిబ్బందితో వారిని వెంటాడి నాయుడుపేట వద్ద పట్టుకున్నారు. వెంటనే నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే ముగ్గురు మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. దీంతో మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బాలిరెడ్డిపాళెంకు తరలించడం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



గతంలోనే తీర ప్రాంత ప్రమాదాలపై హెచ్చరించిన ఆంధ్రప్రభ

కాగా ఆంధ్రప్రభ గతంలోనే నెల్లూరు జిల్లా తీర ప్రాంతంలో జరుగుతున్న ప్రమాదాలపై మృత్యు తీరాలు అనే కథనాన్ని 2019 డిసెంబరు 6వ తేదీన ప్రచురించడం జరిగింది. మద్యం వ్యసనంలో, అవగాహనా లోపంతో యువత సముద్రపు లోతులను అంచనా వేయలేక ప్రమాదాలకు గురౌతున్నారని, విహారం విషాదంగా మారుతోందని సమగ్రంగా తన కథనంలో ప్రచురించడం జరిగింది. అంతేకాకుండా పోలీసులు ఎన్ని పటిష్ట చర్యలు తీసుకున్నప్పటికీ యువత దుందుడుకుతనంతో ప్రమాదాలకు లోనౌతున్నారని కూడా స్పష్టంగా చెప్పడం జరిగింది. ఈ నేపథ్యంలో బుధవారం తూపిలిపాళెం తీరంలో ముగ్గురు మృత్యువాత పడడం కలచివేస్తోంది.



నూతన సంవత్సరం సందర్భంగా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న కమిషనర్ విజయకుమార్‌రెడ్డి. అదనపు కమిషనర్ శ్రీనివాస్, అధికారులు, తదితర సిబ్బంది

3 రాజధానులు మంచిదే!

(మొదటిపేజీ తరువాయి)

విలీనం చేసిన సందర్భంగా స్థానిక అలిపిరి బస్‌డిపో ఆవరణలో బుధవారం సాయంత్రం జరిగిన ఆత్మీయ సన్మాన సభలో ఆయన ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామితో పాటు పాల్గొన్నారు. ఆ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, మూడు రాజధా నుల వల్ల అభివృద్ధి వికేంద్రీకరణ జరుగుతుందని అన్నారు. రాజధానిలోని హైకోర్టు, సచివాలయంలో కేవలం పదిశాతం ప్రజలకు మాత్రమే పనులుంటాయని వ్యాఖ్యానించారు. అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న వారే ముఖ్యమంత్రి జగన్ తీసు కొచ్చిన ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర రాజధానిని ప్రకటించలేదని విమర్శిం చారు. తొలుత నూజివీడు, తర్వాత గుంటూరు అని పుకార్లు సృష్టించి కాలం వెళ్లదీశారని విమర్శలు గుప్పించారు. అంతేకాకుండా అమరావతి పరిధిలోని తెలుగుదేశం పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, వారి బంధువులు భూములు కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్లు చేసుకు న్నాకే రాజధానిని ప్రకటించారని మంత్రి పెద్దిరెడ్డి ఆరో పించారు. గడిచిన ఐదేళ్లలో అమరావతి నిర్మాణానికి రూ. ఐదు వేల కోట్లు ఖర్చు చేశారని, ఒక రాజధాని నిర్మాణానికి లక్షా ఐదు వేల కోట్లు అవసరమైనప్పుడు ఇలాంటి పరిస్థితుల్లో ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. అమరావతి రాజధానా? లేక గ్రామమా అని నిలదీ శారు. ఇలా అయితే



రాజకీయాలకు సంబంధించి ఉమ్మడి రాష్ట్రంలో 90 శాతం ముఖ్యమంత్రులు రాయ లసీమ ప్రాంతం నుంచి వచ్చిన వారేనని, అయితే వారెవరూ అభివృద్ధి వికేంద్రీకరణపై దృష్టిసారించకపోవ డంతో ఈ సమస్య ఏర్పడిందని అన్నారు. తాజాగా.. ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న నిర్ణయంతో అభివృద్ధి వికేంద్రీకరణ జరిగి, రాష్ట్రా నికి మేలు జరుగుతుందని మంత్రి పెద్దిరెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. రాయల సీమలో హైకోర్టు ఉంటే ఉత్తరాంధ్ర వారికి కొంత ఇబ్బంది ఉంటుందని, అదే విధంగా విశాఖలో సచివాలయం ఉంటే.. రాయలసీమ వారికి అదే పరిస్థితి ఉంటుందని చెప్పుకొచ్చారు.

గత ప్రభుత్వం రాజ ధానిపై తీవ్రమైన కాలయాపన చేసిందని, ఆనాడు ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన చంద్రబాబు ఆరు నెలల వరకు రాజధాని నిర్మాణానికి వందేళ్ల సమయం పడు తుందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగన్ ఆలోచనలకనుగుణంగా కమిటీ నివేదిక ఉంటుందని, దీనిపై ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి ఒక నిర్ణయం తీసు కోవడం జరుగుతుందని తెలిపారు. కర్నూలులో హైకోర్టు రావడాన్ని సీమ ప్రజలు స్వాగతించి, ముఖ్యమంత్రి జగన్‌కు థాంక్స్ చెప్పాలని అన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో భాగంగా చిత్తూరు జిల్లా సదుంలో ఆర్టీసి కార్మిక సంఘాల విజ్ఞప్తికి స్పందించి తాము అధికారంలో రాగానే ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేస్తూ ఇచ్చిన మాటకు కట్టుబడి అధికారంలోకి వచ్చిన ఆరేడు నెలల్లోనే ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేసారన్నారు.

అనుభవం కాదు... సంకల్పం కావాలి

• ఆర్టీసీ కార్మికుల విలీనంపై సంబురాలు • విజయవాడలో సీఎంకు కృతజ్ఞతా సభ • పాదయాత్ర హామీలను అమలు చేస్తాం • ఓపీఎస్‌కు కట్టుబడి ఉన్నాం • అర్హులైన రిటైర్డు కార్మికులకు తెల్ల రేషన్ కార్డులు: మంత్రి పేర్ని నాని



అమరావతి, ఆంధ్రప్రభ: 'అనుభవం కంటే సంకల్పబలం ముఖ్యం. సంకల్ప బలంతో ఏదైనా సాధించొచ్చని నిరూపించిన వ్యక్తి ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డి. ఇందుకు నిదర్శనమే ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయడం. చరిత్రలో ఇది లిఖించదగిన విషయం. సీపీఎస్‌ను రద్దు చేసి పాత విధానంలో పెన్షన్ అమలు హామీకు కట్టుబడి ఉన్నాం. అధిక రేట్లు వసూలు చేసే ప్రైవేటు ట్రావెల్స్‌కు రాష్ట్రంలోకి వచ్చే అవకాశం లేదు' అంటూ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడంపై ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డికి విజయవాడలో బుధవారం 'కృతజ్ఞతా సభ' నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి పేర్ని నాని మాట్లాడుతూ పాదయాత్రలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన విలీన హామీకి కట్టుబడి ఉన్నామని చెప్పారు. 40ఏళ్ల అనుభవమున్న చంద్రబాబు ఆర్టీసీ విలీనం అసాధ్యమంటే అధికారంలోకి వచ్చిన జగన్మోహన రెడ్డి రెండొందల రోజుల్లోనే చేసి చూపించారన్నారు. అవరోధాలను అధిగమించి ప్రయాణికులను నమ్మకంగా గమ్యం చేర్చే ఆర్టీసీ డ్రైవర్ లాగే జగన్మోహన రెడ్డి సైతం ఉద్యోగుల హామీలను సంపూర్ణంగా అమలు చేస్తారన్నారు. ఇందులో సీఎంపై ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని సూచించారు. విలీనంపై అభ్యంతరాలను తోసిరాజంటూ నష్టాల్లో ఉన్నప్పటికీ సీఎం సాహసోపేత నిర్ణయం తీసుకున్నారంటూ ఆయన ప్రశంసించారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం దేశ చరిత్రలోనే లిఖించదగిన రోజన్నారు. గత ప్రభుత్వంలో రైతు రుణాలను బేషరతుగా మాఫీ చేస్తామని చెప్పి అమలు చేయని విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఆర్టీసీని జాతీయం పేరిట ఉద్యోగులను భయ భ్రాంతులకు గురి చేసిన విషయం ఉందని చెపుతూ ఎప్పుడు మూతపడుతుందోననే అపోహలు కార్మికుల్లో నెలకొన్న విషయం వాస్తవమా? కాదా? అంటూ ప్రశ్నించారు. సీఎం జగన్ వచ్చిన తర్వాత విలీనం ద్వారా కార్మికుల్లో నెలకొన్న అపోహలను తొలగించారని చెప్పారు. తొలి మంత్రివర్గ సమావేశంలోనే విలీనంపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. తమకు సీఎం నిర్ణయం సముచితం కాదేమో అనుకున్నప్పటికీ ఒక్క సీఎం మాత్రమే విలీనం జరుగుతుందన్న విశ్వాసంతో ఉన్నారన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు జీపీఎఫ్, సీసీఎస్, పదవీ విరమణ సొమ్మును గత ప్రభుత్వం ఇవ్వలేదంటూ తొందరలోనే వీటిని చెల్లిస్తామన్నారు. మంచిపని చేయడంలో లోపాలను వెతకకుండా ఆచరణ సాధ్యమైన విధానంలో ప్రభుత్వం అడుగులు వేస్తుందన్న విషయాన్ని గుర్తించాలని కోరారు. రాజ్యాంగపరంగా కోర్టులు, చట్టాలు ఉంటాయని పేర్కొంటూ వాటిని అధిగమించి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. రానున్న ఆరు మాసాల్లో ఆర్టీసీని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కార్మికులు కృషి చేయాలని చెప్పారు. రూ.10వేల లోపు పెన్షన్ పొందుతున్న పదవీ విరమణ ఉద్యోగుల్లో అర్హులు ఉంటే పేదలకు అందించే రేషను కార్డు సహా అన్ని ప్రయోజనాలు అందిస్తామన్నారు. పండుగలు, పర్వదినాల్లో రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల నుంచి అధిక మొత్తాలను వసూలు చేసే ప్రైవేటు ట్రావెల్స్ రాష్ట్రంలోకి వస్తే చర్యలు తప్పవన్నారు. తొలుత ఆర్టీసీని అప్పుల నుంచి గట్టెక్కించి ప్రైవేటు ట్రావెల్స్‌పై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆర్థిక ఇబ్బందులున్న ఎన్నికల మెనిఫెస్టో అమలుకు ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని దేవదాయశాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. తొలి మంత్రివర్గ సమావేశంలోనే ఆర్టీసీ విలీనంపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. దేశంలో ఏ ఒక్క కార్పొరేషన్‌ను ప్రభుత్వంలో విలీనం చేసిన సందర్భాలు లేవని రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఎంటీ కృష్ణబాబు అన్నారు. దేశ చరిత్రలో ఇదే కేసు స్టడీగా ఉండబోతోందన్నారు. ఉద్యోగులకు రావాల్సిన 2013 బకాయిలు చెల్లిస్తున్నామని చెపుతూ 2017 బకాయిలు తొందరలోనే చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్టీసీ కార్మికుల జీవితకల నెరవేరిందని కార్మిక సంఘాల నేతలు పేర్కొన్నారు. కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రికి తాము రుణపడి ఉంటామని యూనియన్ నేతలు సుబ్బారావు, శ్రీనివాసరావు, జిలానీ భాషా, రవి కుమార్, కొండలరావు, రమేష్, ప్రభాకర్ తదితరులు అభిప్రాయపడ్డారు. ఆర్టీసీని ముందుకు తీసుకెళ్లి బలోపేతం చేసే బాధ్యతను కార్మికులం తీసుకుంటామని వారు పేర్కొన్నారు. విలీనం చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



గగన్‌యాన్‌కు నలుగురు

• చంద్రయాన్-3 నుంచి గగన్‌యాన్ దాకా..
• 2020 సంవత్సరంలో 25 ప్రయోగాలు
• కొత్త ఏడాది లక్ష్యాలను వెల్లడించిన ఇస్రో

బెంగళూరు: చంద్రయాన్-3 ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వ ఆమోదం లభించిందని ఇస్రో ఛైర్మన్ శివన్ తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, ఈ ఏడాది ఇస్రో చేపట్టబోయే ప్రాజెక్టులను వివరించారు. 2019లో అద్భుత విజయాల పరంపరను 2020లోనూ కొనసాగిస్తామని చెప్పారు. ఇందులో, చంద్రయాన్-3తోపాటు గగన్‌యాన్ ప్రాజెక్టు కీలకంగా ఉన్నాయని చెప్పారు. చంద్రయాన్ -3 ప్రయోగ ప్రక్రియ పనులు మొదలయ్యాయని, దీనిని 2021లో చంద్రుడిపైకి పంపుతామని అన్నారు. ఈ ప్రాజెక్టు వ్యయం రూ.250 తో పాటు 365 కోట్లు అవుతుందని తెలిపారు. రెండవ అంతరిక్ష కేంద్రం కోసం భూసేకరణ జరుగుతోందని, తమిళనాడులోని తూత్తుకుడిలో స్పేస్‌పోర్ట్ ఉంటుందని శివన్ చెప్పారు. చంద్రయాన్-2తో గొప్ప పురోగతి సాధించాం. విక్రమ్ ల్యాండర్ విజయవంతంగా చంద్రుడి ఉపరితలంపై దిగలేకపోయినా, ఆర్బిటర్ మాత్రం చురుగ్గా పనిచేస్తున్నది. చంద్రుడి డేటాను మరో ఏడేళ్ల పాటు ఆ ఆర్బిటర్ అందిస్తుంది. ఈ ఏడాది గగన్‌యాన్ ప్రాజెక్టును కూడా చేపట్టనున్నాం. గగన్‌యాన్ ప్రాజెక్టు కోసం వైమానిక దళం నుంచి నలుగురు ఎంపికయ్యారని, వారంతా రష్యాలో జనవరి మూడవ వారం నుంచి శిక్షణ పొందుతారని చెప్పారు. శ్రీహరికోటలో పబ్లిక్ వ్యూయింగ్ గ్యాలరీని కూడా ఏర్పాటు చేశామన్నారు. 2020 కోసం 25 ప్రయోగాలకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. 2019లో పూర్తి చేయలేని మిషన్లు ఈ ఏడాది మార్చి నాటికి పూర్తవుతాయి. 2020-21 బడ్జెట్‌లో రూ.14 వేల కోట్లు కేటాయించాలని కేంద్రాన్ని ఇస్రో కోరిందని చెప్పారు.

గగన్‌యాన్‌కు నలుగురి ఎంపిక

భారత్ త్వరలో చేపట్టబోయే గగన్‌యాన్ మిషన్ కోసం నలుగురు వ్యోమగాములను గుర్తించామని శివన్ తెలిపారు. జనవరి మూడవ వారం నుంచి వీరికి రష్యాలో శిక్షణ ప్రారంభం అవుతుందన్నారు. గగన్యాన్ అనేది భారతీయ మానవ అంతరిక్ష ప్రయాణ కార్యక్రమం. 2022 నాటికి కనీసం ఏడు రోజులు వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపించడానికి ఉద్దేశించింది. గగన్‌యాన్ అనేక వ్యవస్థలను పరీక్షించాల్సిన అవసరం ఉంది. ఈ సంవత్సరం సిబ్బంది శిక్షణ ప్రధాన కార్యకలాపంగా ఉంటుందని అన్నారు.

చిచ్చుపెట్టి చోద్యమా?

• అమరావతిపై ఎందుకింత కడుపుమంట • కుల మత, ప్రాంతీయ విద్వేషాల చిచ్చు • ఏ పోరాటానికైనా సిద్ధం కావాలి • రైతులకు పిలుపు నిచ్చిన తెదేపా అధినేత • పాలన చేతకాకపోతే రాజీనామా చెయ్! • సీఎం జగన్‌పై మాజీ సీఎం చంద్రబాబు ధ్వజం



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని దొంగలంతా కలిసి రాజధానిని నిర్ణయిస్తారా? ఖైదీ నంబర్ 6093. రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయి.. సిగ్గులేని పెత్తనం చేస్తున్నాడని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధ్వజమెత్తారు. కులమత, ప్రాంతీయ విద్వేషాలను సృష్టిస్తూ.. ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆయన మండిపడ్డారు. బుధవారం నవ్యాంధ్ర రాజధాని అమరావతి పరిధిలోని ఎర్రబాలెం, మందడం, కృష్ణాయపాలెంలో సతీసమేతంగా పర్యటించిన చంద్రబాబు రైతుల దీక్షలకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావి తరాల భవిష్యత్తు కోసం ఎవరూ ఊహించని విధంగా.. నవ్యాంధ్ర అభివృద్ధికి ఆనాడు శ్రీకారం చుట్టామని, ఇప్పుడు దాన్ని చంపేసేందుకు వైకాపా కుట్రలు చేస్తోందని నిప్పులు చెరిగారు. ప్రపంచానికే ఆదర్శంగా అమరావతి ఉండాలని కలలు కన్నానని, అయితే ఈ ప్రభుత్వం దాన్ని కుప్పకూల్చిందని ధ్వజమెత్తారు. అమరావతి ప్రాంత అభివృద్ధిపై ముఖ్యమంత్రి జగన్‌కు ఎందుకింత కడుపుమంట అని చంద్రబాబు ప్రశ్నించారు. ఆది నుంచి అమరావతిని అడ్డుకునేందుకు అనేక ప్రయత్నాలు చేశారని, అయితే న్యాయస్థానాలు, గ్రీన్ ట్రిబ్యునల్ కూడా ఇది సురక్షిత ప్రాంతమేనని ధ్రువీకరించాయన్నారు. ఇప్పుడు పోర్చుగీసులో ఫోర్జరీ కేసులోవిచారణ ఎదుర్కొంటున్న బోస్టన్ కమిటీ రాజధానిని నిర్ణయిస్తుందా, ఇంతకన్నా దారుణం ఏదైనా ఉంటుందా అని దుయ్యబట్టారు. ముగిసిపోయిన సమస్యను కొత్తగా తెరపైకి తెచ్చి ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టారని మండిపడ్డారు. విశాఖ అంటే తనకు ఎనలేని ప్రేమ అని, అందుకే ఆనాడు హుద్‌హుద్ సమయంలో ఎంతోమంది వారించినా.. అక్కడే ఉండి పరిస్థితిని చక్కదిద్ది వచ్చానన్నారు. అయితే.. ఆనాడు వైఎస్ విజయమ్మను విశాఖ ప్రజలు ఓడించారని, అందుకే హుద్‌హుద్ వారిని ముంచేసిందని వైకాపా నేతలు పైశాచికానందం పొందారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. నీతి, నిజాయితీకి మారుపేరు విశాఖ వాసులని, ఇప్పుడు జరుగుతున్న దోపిడీని చూసి ఆందోళన చెందుతున్నారని అన్నారు. విశాఖకు తీసుకొచ్చిన పెట్టుబడులను, కంపెనీలను వెళ్లగొట్టారని ప్రభుత్వంపై ఆందోళన వ్యక్తం చేశారు. అమరావతి ప్రజలకు న్యాయం చేయాలని కోరుకునే మంచితనం విశాఖ వాసుల్లో ఉందని, సీఎం జగన్‌కు నీతి నిజాయితీ ఏమాత్రం లేదని అన్నారు. ఈ రెండూ విశాఖవాసులకు మెండుగా ఉన్నాయని అన్నారు. రాజధాని రైతులు ఏ తప్పు చేశారని, 17 రోజులుగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, దీనికి కారకులు మీరు కాదా అంటూ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. అమరావతిని తరలించేశక్తి ఎవరికీ లేదని, ఈ తరలింపునకు వ్యతిరేకంగా ఐక్యపోరాటం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఆనాడు శివరామకృష్ణన్ కమిటీ అమరావతి, విశాఖ, దొనకొండలను పరిశీలించిందని వెల్లడించారు. మొత్తం 4 వేల 728 మంది అభిప్రాయాలు సేకరిస్తే.. 2191 మంది అమరావతి రాజధానిగా ఉండాలని మొగ్గు చూపారన్నారు. దొనకొండకు కేవలం 116 ఓట్లు మాత్రమే వచ్చాయని, విశాఖకు 507 ఓట్లు, మిగిలిన ఓట్లన్నీ అమరావతికే పడ్డాయని చెప్పుకొచ్చారు. దీంతో అన్ని చోట్ల నుంచి పవిత్ర నదీజలాలు, మట్టిని తీసుకొచ్చి ఒకశక్తిమంతమైన పీఠంగా అమరావతికి ప్రధాని మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన చేశామని అన్నారు. తాను కట్టిన సచివాలయం నుంచే జగన్ పాలన చేస్తూ.. తననే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ తండ్రి వైఎస్సార్ తనకు ఎనలేని గౌరవం ఇచ్చేవారని, అయితే జగన్‌కు కనీస సభ్యత, సంస్కారం కూడా లేవని అన్నారు.



మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు అమరావతిలో పర్యటించిన ఆయన సతీమణి భువనేశ్వరి రైతులు, మహిళల దీక్షకు మద్దతు తెలిపారు. అంతేకాకుండా తన చేతికి ఉన్న బంగారు గాజులను అమరావతి ఉద్యమానికి విరాళంగా ఇచ్చారు. కృష్ణాయపాలెం, ఎర్రబాలెం, మందడంలో మహిళల దీక్షకు సంఘీభావం తెలిపిన ఆమె వారి యోగక్షేమాలను విచారించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాటి మహిళగా వారి బాధను అర్థం చేసుకోగలనని అన్నారు. ఆనాడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు రాష్ట్రం గురించే ప్రతి నిమిషం ఆలోచించేవారని, ఆయన ఆరోగ్యం గురించి తాము ఆందోళన చెందేవారిమని తెలిపారు. కుటుంబాన్ని ఏమాత్రం పట్టించుకోలేదని, ప్రజల తర్వాతే మీరని చెప్పేవారన్నారు. అమరావతి రైతుల నమ్మకాన్ని చంద్రబాబు వమ్ము చేయరని, తమ కుటుంబం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. మహిళలు ఆది పరాశక్తి అని, వారు తలుచుకుంటే ఏదైనా సాధించగలరని అన్నారు. ఉమ్మడి పోరాటంతో అమరావతిని పరిరక్షించుకుందామని పిలుపునిచ్చారు.

నాడు ముద్దులు.. నేడు గుద్దులా..

ఎన్నికల ముందు ఊరూరా తిరిగి ప్రజలకు ముద్దులు పెట్టిన జగన్.. ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యాక అదే ప్రజలను గుద్దులు గుద్దుతున్నాడని చంద్రబాబు ధ్వజమెత్తారు. రాజధాని ప్రాంతంలో పర్యటనకు వచ్చిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను అడ్డుకుంటారా.. ఆయన పొలంలోంచి తిరగాలా అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి కాన్వాయ్‌కు దారులు లేవా.. డమ్మీ కాన్వాయ్ పంపాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. నడిచే దారిలో ముళ్లకంచెలు, పోలీసు బలగాలతో అడ్డుకట్టలు వేస్తారా అంటూ మండిపడ్డారు. ఆనాడు తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జగన్ పాదయాత్రను ఈ విధంగా అడ్డుకుంటే అసలు సాగేదా అంటూ నిలదీశారు. ఎన్ని ఆటంకాలు, అడ్డంకులు సృష్టించినా ప్రజల అండతో ముందుకు వెళతామని, వారే తమ భద్రత అని స్పష్టం చేశారు. జగన్ ఏమైనా ఆకాశం నుంచి ఊడిపడ్డాడా? ఎందుకీ పిరికితనం అంటూ ప్రశ్నించారు. రైతులను అరెస్ట్ చేసి అక్రమ సెక్షన్లు బనాయించి, న్యాయస్థానంతో చీవాట్లు తిన్నా బుద్ధి రాలేదన్నారు. పోలీసులు చట్టాన్ని అతిక్రమించొద్దని, తప్పు చేస్తే ఎవరూ అడ్డు పడరని హితవు పలికారు. రోడ్డెక్కి ఎంతో ఆందోళ చేస్తున్న ఆడబిడ్డలను పెయిడ్ ఆర్టిస్టులంటారా అంటూ ధ్వజమెత్తారు. ఇన్‌సైడ్ ట్రేడింగ్ అని అసత్యప్రచారం చేస్తున్న వైకాపా నేతలు దీన్ని తేల్చాలని, దీనిపై ఏ విచారణకైనా తాము సిద్ధంగా ఉన్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. గడచిన ఏడు నెలల్లో జగన్ ముఖ్యమంత్రిగా ఒక్క మంచిపనైనా చేశారా అని ప్రశ్నించారు. ఈ ఏడు నెలల్లో రాజధానిపై ఐదు కమిటీలు వేశారని, ఇలాంటి ముఖ్యమంత్రిని ఎక్కడైనా చూశారా అని ప్రజలను ప్రశ్నించారు. తాను 1978 నుంచి 11 మంది ముఖ్యమంత్రులను చూశానని, కానీ ఇలాంటి వ్యక్తిని తన జీవితంలో చూడలేదని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

బీహార్ కంటే దారుణం

రాష్ట్రంలో ఇదే పరిస్థితి కొనసాగితే బిహార్ కన్నా దారుణంగా తయారవుతుందని ప్రజలు తెలిసో, తెలియకో నిప్పుల కుంపటిని తలపై పెట్టుకున్నారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. జగన్‌కు ఎందుకు ఓట్లేశామా అని ప్రజలు చెప్పులతో కొట్టుకుని బాధ పడుతున్నారని, ఆయనకు బుద్ధి చెప్పే సమయం దగ్గర్లోనే ఉందన్నారు. జగన్ అంత పిరికివాడు ఎవరూ లేరని, ప్రజలు తిరుగుబాటు చేస్తే తోక ముడవక తప్పదని అన్నారు. రైతులు, ప్రజలు, మహిళలు అమరావతి కోసం ఏ పోరాటానికైనా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

రాజధాని తరలింపు అంత తేలిక కాదు

రాజధాని తరలింపు అంశం ముఖ్యమంత్రి జగన్ భావించినంత తేలిక కాదని, అమరావతి కోసం పోరాటం చేసేందుకు ఐదు కోట్ల మంది ప్రజలు సిద్ధంగా ఉన్నారని చంద్రబాబు స్పష్టం చేశారు. అసలు రాజధానిని తరలించే అధికారం జగన్‌కు ఎక్కడిదని, ఏ ముఖ్యమంత్రైనా ఇలా రాజధానులు మార్చారా అంటూ ధ్వజమెత్తారు. హైకోర్టు, సుప్రీంకోర్టు, కేంద్రం దీనికి అంగీకరించాల్సి ఉంటుందని తెలిపారు. ఇవన్నీ లేకుండా ఏదో ఒక సాకుతో తరలించడం కుదరదని స్పష్టం చేశారు. అమరావతి ఇక్కడే ఉంటుందన్నారు. ఒక సామాజికవర్గాన్ని అశక్తపరిచేలా చేస్తూ.. ప్రజలను ఎందుకు రెచ్చగొడుతున్నారని నిలదీశారు. ఇప్పుడు నిధులు లేవని కొత్త సాకు చెబుతున్నారని, సంపద సృష్టి జరగాలని, అది చేతగానప్పుడు ఈ పదవులెందుకని ముఖ్యమంత్రి జగన్‌పై విమర్శలు గుప్పించారు. డబ్బులు చెట్లకు కాయవని, సంపదను సముపార్జించడం, సృష్టించడం రాకపోతే రాజీనామా చేయాలని జగన్‌ను ఉద్దేశించి చంద్రబాబు వ్యాఖ్యానించారు.

నందమూరి రామకృష్ణ కన్నీటి పర్యంతం

స్వర్గీయ ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ చంద్రబాబుతో కలిసి అమరావతిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత రైతులు, మహిళల దుస్థితిని చూసి ఆవేదన చెంది కన్నీటి పర్యంతమయ్యారు.

తాగి ఊగారు!

• డిసెంబర్ 31 ఎఫెక్ట్ • రూ.105 కోట్ల మద్యం అమ్మకాలు
• కృష్ణా జిల్లా టాప్ • శ్రీకాకుళం లాస్ట్



అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌లో నూతన ఏడాది ఆగమనం వేళ మందుబాబులు తాగి ఊగారు. ఏడాది చివరి రోజైన డిసెంబర్ 31వ తేదీ ఒక్క రోజే రూ.105.03కోట్ల మేర మద్యం అమ్మకాలు జరిగినట్లు ఎక్సైజు అధికారులు పేర్కొంటున్నారు. ఏడాది చివరి రెండు రోజుల్లో రూ.229.37 కోట్ల మద్యం అమ్ముడైంది. రెండు రోజుల మద్యం అమ్మకాల్లో కృష్ణాజిల్లా రూ.30.61 కోట్లతో మొదటి స్థానంలో ఉండగా..రూ.8.61 కోట్ల అమ్మకాలతో శ్రీకాకుళం జిల్లా చివరి స్థానంలో ఉంది. గత ఏడాది ఎన్నికల ముందు నూతన సంవత్సర వేడుకలు రావడంతో డిసెంబర్ 31వ తేదీ రూ.118 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. గతేడాదితో పోల్చితే రూ.13 కోట్లు ఆదాయం తగ్గినట్లు అధికారులు చెపుతున్నారు. ఇందుకు షాపుల సంఖ్య తగ్గింపు కారణమై ఉండొచ్చని భావిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 820 బార్ అండ్ రెస్టారెంట్లు ఉండగా, 3500 ప్రభుత్వ మద్యం షాపులు ఉన్నాయి. రాష్ట్రంలోని బార్ అండ్ రెస్టారెంట్లు, షాపుల్లో డిసెంబర్ 30, 31 తేదీల్లో రెండు రోజుల పాటు రూ.229.37 కోట్ల విలువైన రెండు లక్షల, 92వేల, 989 కేసుల మద్యం, లక్షా 12వేల 217 కేసుల బీర్లు బేవరేజెస్ కార్పొరేషన్ డిపోల నుంచి కొనుగోలు చేసి విక్రయించారు. డిసెంబర్31వ తేదీ రూ.105.03కోట్ల విలువైన లక్షా 32వేల 860 కేసుల మద్యం, 51వేల 112 కేసుల బీర్లు అమ్మకాలు జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ అమలులో భాగంగా షాపులను ఏపీ బేవరేజెస్ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తోంది. దశలవారీ మద్య నిషేధం విధించే చర్యల్లో భాగంగా షాపుల సంఖ్యను 4380 నుంచి 3500కు తగ్గించింది. ఇదే సమయంలో మద్యం ధరలను భారీగా పెంచారు. షాపులకు, బార్ అండ్ రెస్టారెంట్లకు మధ్య ఎమ్మార్పీ రేట్లలో వ్యత్యాసం భారీగా ఉంది. బార్లలో రేట్లు అధికంగా ఉండటంతో మద్యపాన ప్రియులు షాపుల్లో కొనుగోలుకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.

జిల్లాల వారీగా...

జిల్లాల వారీగా ఏడాది ఆఖరి రెండు రోజుల మద్యం అమ్మకాలను పరిశీలిస్తే కృష్ణాజిల్లా అమ్మకాల్లో మొదటి స్థానంలో ఉండగా, శ్రీకాకుళం జిల్లా ఆఖరి స్థానంలో ఉంది. అనంతపురం జిల్లాలో రూ.15.3 కోట్లు, చిత్తూరు రూ.17.9 కోట్లు, తూర్పు గోదావరి రూ.22.73కోట్లు, గుంటూరు రూ.22.16 కోట్లు, కడప రూ.12.06కోట్లు, కృష్ణా రూ.30.06 కోట్లు, కర్నూలు రూ.15.65కోట్లు, నెల్లూరు 13.59 కోట్లు, ప్రకాశం రూ.13.26 కోట్లు, శ్రీకాకుళం రూ.8.62 కోట్లు, విశాఖపట్టణం రూ.28.67 కోట్లు, విజయనగరం రూ11.18 కోట్లు, పశ్చిమగోదావరి రూ.17.57 కోట్ల మేర అమ్మకాలు జరిగాయి.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

గురువారం 2 జనవరి 2020

సుడిగుండంలో శరణార్థులు!

శరణు కోరి వచ్చే వారు శరణార్థులు. శరణార్థులు అన్ని దేశాల్లో ఉంటారు. వారిని కుల, మత, ప్రాంత ప్రాతిపదికగా విభజించడం మానవతా ప్రమాణాలకే విరుద్ధం. కానీ, ఇప్పుడు దేశంలో సీఏఏ, ఎన్ఆర్సీ, ఎన్పీఆర్‌ల పేరిట కొనసాగుతున్న వివాదాల వల్ల శరణార్థులు రాజకీయాల సుడిగుండంలో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. పౌరసత్వ చట్టం సవరణ (సీఏఏ)కి వ్యతిరేకంగా దేశంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న ఆందోళనల వల్ల ఇప్పటికే వెయ్యి కోట్ల రూపాయిల విలువైన ఆస్తులు ధ్వంసమయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లో ఆస్తులను విధ్వంసం చేసిన వారి నుంచి పరిహారాన్ని వసూలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. అసోంలో పౌరపట్టిక (ఎన్ఆర్సీ)తో ప్రారంభమైన ఆందోళనలు, పౌరసత్వ చట్టం సవరణ వల్ల దేశవ్యాప్తంగా అలుముకున్నాయి. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షా ఎన్ని వివరణలు ఇచ్చినా, ఎన్ని విజ్ఞప్తులు చేసినా పరిస్థితిలో మార్పు రావడం లేదు. మోడీ ప్రభుత్వం మొదటి టరమ్‌లో వెయ్యి, ఐదొందల రూపాయిల నోట్లను రద్దు చేసినప్పుడు ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తం అయినా, అవి హింసాత్మకంగా పరిణమించలేదు. ఆస్తుల ధ్వంసానికి దారి తీయలేదు. బ్యాంకుల ఏటీఎంల వద్ద క్యూలలో నిలబడలేక మాత్రమే వృద్ధులు ప్రాణాలు విడిచిన సంఘటనలు చోటుచేసుకోగా, ఇప్పుడు సీఏఏకి వ్యతిరేకంగా సాగుతున్న ఆందోళనల్లో దాదాపు వంద మంది మరణించారు. ప్రభుత్వం అనాలోచితంగా ఈ నిర్ణయం తీసుకుందని మేధావులు, విద్యావంతులు విమర్శిస్తున్నారు. ఈ ఉద్యమం మరింత ఉధృతం కాకుండా ఇప్పుడు నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ (ఎన్పీఆర్) ని తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం యత్నాలు సాగిస్తోంది. ఎన్పీఆర్ ఇప్పటికే అమలులో ఉన్న జనగణన లాంటిదేనని ప్రభుత్వం పదేపదే వివరణ ఇస్తోంది. దీనివల్ల ఏ ఒక్కరి పౌరసత్వం రద్దు కాదని హామీ ఇస్తోంది. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ దీనిపై వ్యక్తం చేస్తున్న అనుమానాలనే ఇతర ప్రతిపక్షాలూ వ్యక్తం చేస్తున్నాయి. ఎన్ఆర్సీకి బదులు కేంద్రం ఎన్పీఆర్‌ను తేవాలనుకుంటోందన్న కాంగ్రెస్ అభిప్రాయంతో ప్రతిపక్షాలు ఏకీభవిస్తున్నాయి. ఎన్పీఆర్‌కు దాదాపు నాలుగు వేల కోట్ల రూపాయిలను కేంద్ర మంత్రివర్గం కేటాయించింది. పౌరుల నివాసం, చిరునామా, తండ్రి పేరు, పుట్టిన ఊరు, మొదలైన వివరాలతో పాటు ఇతర వివరాలను అందజేయాలని ప్రభుత్వం స్పష్టం చేయడంతో పౌరుల వ్యక్తిగత విషయాల గోప్యతకు భంగం కలుగుతుందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎన్పీఆర్‌ను ఎప్పుడు ఎలా ప్రారంభిస్తారో ప్రకటించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. అయితే, ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఇస్తున్న వివరణల్లో స్పష్టత లేక పోవడం వల్ల ప్రతిపక్షాల అనుమానాలు నివృత్తి కావడం లేదు. ఎన్ఆర్సీ గురించి అసలు చర్చించలేదని ప్రధానమంత్రి స్పష్టం చేసిన తర్వాత అమిత్‌షా అంతకుముందు చెప్పింది అబద్ధమని తేలింది. పొంతన లేని ప్రకటనలతో ప్రధాని, హోం మంత్రి జనాన్ని గందరగోళ పరుస్తున్నారు. ఎన్పీఆర్ విషయంలో కూడా ప్రభుత్వం చేస్తున్న ప్రకటనల్లో పొంతన లేదు. ఎన్పీఆర్‌ను అమలు జరపబోమని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ ముందే ప్రకటించగా, దీనిని తమ రాష్ట్రంలో అమలు జేయడం లేదని కేరళ అసెంబ్లీ ఏకంగా తీర్మానమే చేసేసింది.

ఈ వేడి ఇంకా చల్లారక ముందే భారత సైనికదళాల ప్రధానాధికారిగా నిన్న పదవీ విరమణ చేసి, రక్షణశాఖ మహాదళాధిపతిగా ప్రమాణం చేసిన జనరల్ బిపిన్ రావత్ ప్రకటన రాజకీయ పార్టీల్లో ఆగ్రహావేశాలను రగుల్కొల్పింది. హింసను ప్రోత్సహించేవారు నాయకులు కాదంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు పరిధి దాటినవేనన్న విమర్శలు వచ్చాయి. ఆయన ఒక సైనికాధికారిగా కాకుండా రాజకీయ నాయకునిగా మాట్లాడారని ప్రతిపక్షాలకు చెందినవారే కాకుండా, విద్యార్థులు, యువకులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అయితే, ఆయన హింసను వ్యతిరేకించారే తప్ప ఎవరినీ ఉద్దేశించి అనలేదని రక్షణ శాఖ వివరణ ఇచ్చింది.

ప్రస్తుత పరిస్థితి ఒక్క రోజులో ఉత్పన్నమైనది కాదు. ప్రజల్లో గూడుకట్టుకున్న అసంతృప్తి ఒక్కసారిగా అగ్ని పర్వతంలా బద్దలైంది. ఎన్నికల్లో బీజేపీ సీట్లూ, అధికారం సంపాదించడానికి ప్రతిపక్షాల్లో అనైక్యత కారణం. నాయకత్వ సమస్యపైనే ప్రతిపక్షాలు ఏకతాటిపైకి రాలేకపోతున్నాయి. మోడీ అనుసరిస్తున్న విధానాల పట్ల అసంతృప్తి ఉంది. మాయావతి, మమతా బెనర్జీ వంటి వారు తమ ఆగ్రహాన్ని బయటకు వెళ్ళగక్కుతున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ముఖ్యమైన ఏ నిర్ణయం తీసుకున్నా ముందుగా తమను సంప్రదించడం లేదన్న గుర్రు ప్రతిపక్ష నాయకులందరిలోనూ ఉంది. అయితే, ఆయనను ఎదుర్కొనే సత్తా లేకపోవడంవల్ల వారంతా తమ ఆగ్రహాన్ని సమయం వచ్చినప్పుడు వ్యక్తం చేయాలనుకున్నారు. ఇప్పుడు సీఏఏకి వ్యతిరేకంగా సాగుతున్న ఆందోళనకు మద్దతు ఇస్తున్నారు. ఎన్పీఆర్ గురించి గతంలో ప్రభుత్వంలోని పెద్దలు చేసిన ప్రకటనలను ఉదాహరణగా చూపుతూ ఎన్పీఆర్ పేరిట దొడ్డిదారిన ఎన్ఆర్సీని ప్రవేశ పెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సీఏఏకి వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్నా అవి కట్టుతప్పడం లేదు. ఉత్తరప్రదేశ్‌లో ఈ ఆందోళన హింసాత్మకంగా పరిణమించడానికి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రకటనలే కారణం. ఆయన ఆహార్యంలో, ప్రసంగాల్లో, ప్రకటనల్లో హిందుత్వ వాదం స్పష్టంగా కనిపిస్తోంది. అంతేకాక, ఆయన రాజకీయాల్లో ప్రవేశానికి ముందు హిందూవాహిని అనే సంస్థను నిర్వహించడం వల్ల ఆయన ఏం మాట్లాడినా మతపరమైన ప్రయోజనం కోసమేనని ప్రతిపక్షాలు సహజంగా ఆరోపిస్తున్నాయి. అసోం, త్రిపురలలో ముఖ్యమంత్రులు కూడా గతంలో సంఘ్ పరివార్ సంస్థలతో సంబంధాలు ఉన్న వారు కావడం వల్ల తమ రాష్ట్రాల్లో హిందూ ఓటుబ్యాంకును కాపాడుకునేందుకే వారు ఎన్ఆర్సీని సమర్థిస్తున్నారన్న ప్రతిపక్షాల ఆరోపణను తేలిగ్గా కొట్టివేయలేం. అయితే, అక్రమంగా ప్రవేశించిన విదేశీయులను వెనక్కి పంపించి వేయడంలో మతపరమైన విభజన చేయకుండా, అందరినీ వెనక్కి పంపాలన్నది ప్రతిపక్షాల వాదన. 1950లో నెహ్రూ, లియాఖత్‌ల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం తమ దేశాల్లో మైనారిటీలైన హిందువులు, జైనులు, బౌద్ధుల హక్కులను ఆయా దేశాల ప్రభుత్వాలు పరిరక్షించలేదు. కనుక వారంతా శరణార్థులుగా భారత్ వచ్చి జీవనం సాగిస్తున్నారనీ, అలాంటివారి కోసమే పౌరసత్వ సవరణ చట్టం, పౌరపట్టిక వంటివి తెచ్చినట్టు హోం మంత్రి అమిత్ షా చెబుతున్నారు. సరిహద్దు రాష్ట్రాల్లోకి పొరుగు దేశాల నుంచి అక్రమంగా వలసవచ్చిన వారిని ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవడమన్నది కాంగ్రెస్‌తో మొదలైంది. ఆ తర్వాత మార్క్సిస్టు పార్టీ, అటు పిమ్మట తృణమూల్ కాంగ్రెస్ దీనికి అలవాటు పడ్డాయి. అదే రీతిలో శరణార్థులుగా వచ్చి ఇక్కడ వలసవాదులుగా ఉంటున్న పొరుగుదేశాల హిందూ మైనారిటీలకు పౌరసత్వం ఇవ్వడం ద్వారా తమ ఓటు బ్యాంకు పెంచుకోవాలని కమల నాథులు ఎన్ఆర్సీ, సీఏఏ, ఎన్పీఆర్ తెచ్చారన్నది బహిరంగ రహస్యం. రాజకీయాల సుడిగుండంలో చిక్కుకోవడంతో అసలైన శరణార్థులకు న్యాయం జరగడం లేదు. రాజకీయాలకు అతీతంగా పరిష్కారం కావల్సిన సమస్యను అన్ని పార్టీలూ రావణ కాష్టం చేస్తున్నాయి.

విదేశాల్లో వైద్యవిద్య.. అసలు పరీక్ష!



విదేశాల్లో ఎంబీబీఎస్ కోర్సులను తక్కువ ఖర్చుతో పూర్తి చేయవచ్చన్న యాడ్స్ (వ్యాపార ప్రకటనలు) చూడగానే ఆకర్షితులయ్యే భావి మెడికోలకు ఇది చేదు వార్తే. లక్షలాది రూపాయిలు ఖర్చు చేసి విదేశాల్లో ఎంబీబీఎస్ పట్టా సంపాదించుకుని వచ్చే వారు మన దేశంలో ప్రాక్టీస్ ప్రారంభించాలంటే, స్వదేశంలో మళ్ళీ పరీక్ష రాయాలి. అందులో పాసైతేనే ఇక్కడ ప్రాక్టీసు ప్రారంభించేందుకు అనుమతి ఇస్తారు. ఈ పరీక్ష పేరు ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామినేషన్ (ఎఫ్ఎంజి ఈ). ఈ పరీక్షకు హాజరయ్యే విదేశీ వైద్యుల్లో 84 శాతం మంది స్క్రీనింగ్ పరీక్షల్లో ఫెయిల్ అవుతున్నారు. విదేశాల్లో వేలకు వేలు డాలర్లు ఖర్చు చేసి డాక్టర్ పట్టా పొందినవారి పరిస్థితి ఎటూ కాకుండా అవుతోంది. పైగా విదేశాల్లో ఎంబీబీఎస్ కోర్సులు చదవడం అంటే మాటలు కాదు. ఆయా యూనివర్శిటీలు అడ్వర్‌టైజ్‌మెంట్లలో చేసే ఆకర్షణీయమైన ప్రకటనలకూ అక్కడి పరిస్థితులకూ చాలా తేడా ఉంటుంది. ఫీజులు తక్కువని ప్రకటించినప్పటికీ ఏవేవో కార్యక్రమాల పేరిట విడిగా పెద్దమొత్తాల్లో వసూలు చేస్తారు.

మన దేశంలో వైద్య కళాశాలల సంఖ్య పెరిగినప్పటికీ అడ్మిషన్లలో పోటీ పెరగడంవల్ల సీట్లు చాలడం లేదు. ఎంబీబీఎస్ పాసైతే సొంతంగా ప్రాక్టీసు చేసుకోవచ్చనీ, ఎవరి కింద పనిచేయాల్సిన అవసరం లేకుండా స్వతంత్ర జీవనం సాగించేందుకు వైద్యవృత్తి ఎంతో సానుకూలమైనదని చాలా మంది భావిస్తారు. అలాగే, తమ కుటుంబంలో పూర్వపు తరం వారు డాక్టర్లుగా మంచి పేరు ప్రతిష్ఠలను సంపాదించి ఉంటే, వారి సంప్రదాయాన్ని నిలబెట్టడానికి వైద్యవిద్యను అభ్యసించేవారు మరికొందరు ఉంటారు. డాక్టర్లు, ఇంజనీర్లకు ఎంత కట్నం ఇచ్చైనా సరే అల్లుళ్ళుగా చేసుకోవాలనే కుటుంబాలు చాలా ఉంటాయి. వైద్యవృత్తి మీద ఆసక్తితో, ప్రజాసేవ చేయాలన్న కాంక్షతో ఈ కోర్సులను ఎంచుకునే వారు మరి కొందరు ఉంటారు. వృత్తివిద్యా కోర్సులకు ప్రభుత్వాలు ఇస్తున్న ప్రోత్సాహాన్ని ఉపయోగించుకోవాలన్న ఉద్దేశ్యంతో కూడా వైద్యవిద్యా కోర్సులలో ప్రవేశించడం ఓ ఆనవాయితీ. కారణంఏదైనా, వైద్య విద్యాకోర్సులకు గిరాకీ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో స్వదేశంలోని మెడికల్ కాలేజీల్లో సీట్లు సంపాదించుకోలేని వారు విదేశాల్లోని వైద్య కళాశాలల్లో చదివేందుకు ఆసక్తి చూపుతున్నారు. గతంలో వార్తాపత్రికల్లో మాత్రమే విదేశీ వైద్య విద్యగురించి ప్రకటనలు వెలువడేవి. ఎలక్ట్రానిక్ ప్రసార సాధనాలు వచ్చిన తర్వాత ఇందుకు సంబంధించిన యాడ్స్ మాత్రమే కాకుండా విదేశాల్లో చదువుకుని వచ్చినవారి అనుభవాల గురించి ప్రత్యేక కార్యక్రమాలు ప్రసారం అవుతున్నాయి. అలాగే, గోష్ఠులు ప్రసారం అవుతున్నాయి. ఇలాంటి కార్యక్రమాలన్నీ వృత్తి విద్యా కోర్సుల పట్ల ఆసక్తిని పెంచుతున్నాయి. ఇవి కాకుండా కెరీర్ గైడెన్స్ పేరిట మ్యాగజైన్లు, పక్ష, మాస పత్రికలు లెక్కకు మిక్కిలిగా వెలువడుతూ వైద్యవిద్య పట్ల ఆసక్తిని పెంచుతున్నాయి. ఆబ్జెక్టివ్ టైపులో ప్రశ్నలు, సమాధానాలతో గైడ్‌లు వెలువడుతున్నాయి. ఇవి కూడా విదేశీ వైద్య విద్య పట్ల ఆసక్తిని పెంచుతున్నాయి. స్వదేశంలో ప్రైవేటు వైద్య కళాశాలల్లో సీటు సంపాదించడానికి భారీఎత్తున డొనేషన్ల కట్టాలి. అలాగే, పలుకుబడి కలిగినవారి నుంచి సిఫార్సు లేఖలు సంపాదించాలి. ఈ బాధలు పడలేక విదేశీ వైద్యవిద్యా కోర్సుల పట్ల మన వారు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. విదేశీ వైద్య కళాశాలల్లో సీట్లకోసం సంబంధిత యూనివర్శిటీల్లో తమ పేర్లను నమోదు చేయించుకుంటున్నారు. ఈ కాలేజీల్లో ప్రవేశ పరీక్షల్లో విజయం సాధించేందుకు కోచింగ్ సెంటర్లలో తర్ఫీదు పొందుతున్నారు. ఇందుకు చేసే ఖర్చు మళ్ళీ వేరు. ఇక్కడ కోచింగ్‌లకూ, అక్కడ వైద్యవిద్యాభ్యాసానికి లక్షల్లో ఖర్చు చేసిన అక్కడ పట్టా పొందిన తర్వాత కూడా స్వదేశంలో ప్రాక్టీసు చేయడం కోసం అర్హత పరీక్షలకు వైద్య పట్టభద్రులు హాజరు కావల్సి వస్తోంది. అర్హత పరీక్షల్లో వడపోత ఎక్కువగా ఉంటుంది స్క్రీనింగ్ పేరిట జరిపే ఈ పరీక్షల్లో 84 శాతం మంది వైద్యపట్టభద్రులు ఫెయిల్ అవుతున్నారు. వైద్యశాస్త్రంలో పట్టా సంపాదించడానికి అడుగడుగునా పరీక్షలను ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేషన్ ఎగ్జామినేషన్‌ను నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తుంది. ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, యునైటెడ్ కింగ్‌డమ్ అమెరికాలలో వైద్య పట్టభద్రులు, పీజీ పట్టాలు పొందిన వారు ఇక్కడి పరీక్షల్లో ఉత్తీర్ణులైతేనే ప్రాక్టీస్ ప్రారంభించేందుకు అర్హులు. విదేశాల్లో వైద్య విద్యలో ఉత్తీర్ణులైన వారు ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాలేక, ప్రాక్టీసుకు లైసెన్సులు పొందలేకపోతున్న మాటనిజమేనని ఇటీవల శీతాకాల సమావేశాల్లో ప్రభుత్వం అంగీకరించింది. విదేశాల్లో వైద్యవిద్యా సంస్థలు ప్రమాణాలకు తగిన విధంగా విద్యను అందించలేకపోతున్నాయనీ, అందుకే, అక్కడ ఉత్తీర్ణులైన వారు ఇక్కడ ఫెయిల్ అవుతున్నారని ప్రభుత్వం ఇచ్చిన సమాధానంలో పేర్కొంది. 2012 నుంచి 2018 వరకూ విదేశాల్లోని యూనివర్సిటీల్లో 97,639 మంది వైద్యవిద్యలో పట్టాలు సంపాదించగా, వీరిలో 16,097 మంది మాత్రమే అంటే 16 శాతం మంది మాత్రమే స్వదేశంలో ప్రాక్టీసు చేసేందుకు లైసెన్స్‌లు సంపాదించగలిగారు. విదేశాల్లో వైద్య పట్టా సంపాదించిన వారిలో చాలామంది రష్యా, చైనా యూనివర్శిటీలకు చెందినవారు. వీరంతా ఇక్కడ జరిగిన అర్హత పరీక్షలకు హాజరు కాగా, కొద్ది మంది మాత్రమే పాసైనారు.

2012 నుంచి 2018 మధ్య చైనాలోని యూనివర్శిటీల నుంచి వైద్యవిద్యలో పట్టభద్రులైన 32,139 మందిలో 4,609 మంది మాత్రమే అర్హత పరీక్షల్లో పాసైనారు. అలాగే, రష్యా యూనివర్శిటీల నుంచి పట్టాలు పొందిన 17వేల 674 మందిలో 2,606 మంది అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. వైద్యవిద్యకు సంబంధించి చైనా యూనివర్శిటీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. ఆ తర్వాత రష్యా, ఉక్రెయిన్, నేపాల్, కజికిస్థాన్ యూనివర్శిటీలలో వైద్యవిద్య కోసం ఎక్కువ ప్రాధాన్యంఇస్తారు. ఈ ఐదు యూనివర్సిటీల్లో 76,425మంది 2012-2018 మధ్య వైద్యపట్టభద్రులు అవగా, వీరిలో 78.27 శాతంమంది అర్హత పరీక్షల్లో పాసైనారు. వీరిలో కూడా 15 శాతం మంది మాత్రమే స్క్రీనింగ్ టెస్ట్‌లో పాసైనారు.

ఫ్రాన్స్, కెన్యా, సెయింట్ మార్టినమ్‌లలో వైద్యవిద్య అభ్యసించినవారిలోవందశాతం మంది ఉత్తీర్ణులయ్యారు. మారిషస్‌లో వైద్యవిద్యనభ్యసించిన వారిలో ఎక్కువ మంది ఉత్తీర్ణులు కాలేదు. రొమేనియాలో 336 మందిపట్టభద్రులు కాగా, వీరిలో9.82 శాతం మంది అర్హత పరీక్షల్లో పాసైనారు. అజర్‌బైజాన్‌లో ఈ పరీక్షల్లో విజయం సాధించిన భారతీయ విద్యార్థులకు మూడో దేశంగా నిలిచింది. విదేశాల్లో ఎంబీబీఎస్ కోర్సుల విషయంలో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. విదేశీ యూనివర్సిటీల్లో వైద్యవిద్యాకోర్సులలో ఉత్తీర్ణులైనవారిలో చాలామంది స్వదేశంలో అర్హత పరీక్షల్లో లైసెన్స్‌కోసం ఎదురు చూస్తున్నారని మెడికల్ కౌన్సిల్ పేర్కొంది. విదేశీ యూనివర్శిటీల్లో ప్రమాణాలు లేకపోవడమే కారణం. అందుకే, విదేశీ యూనివర్శిటీలను ఎంచుకునే విషయంలో విద్యార్థులు తగిన సలహాలు తీసుకోవాలనీ, ఎంసీఐ సూచించింది. మొత్తం మీద విదేశాల్లో వైద్యవిద్య నభ్యసించే వారు అక్కడి పరిస్థితులు, ప్రమాణాల గురించి తెలుసుకుని నిర్ణయం తీసుకోవాలని ఎంసీఐ పేర్కొంది. ఇందుకు సంబంధించి కొన్ని మార్గదర్శకాలను ఎంసీఐ విడుదల చేసింది.

- తేజోస్మయ్

ఉద్యమించినా తగ్గని నేరాలు

రెండేళ్ల క్రితం ప్రపంచవ్యాప్తంగా జరిగిన మీటూ ఉద్యమం ద్వారా, మహిళలపై వివక్ష ప్రత్యక్షసాక్షుల ద్వారా వెలుగులోకి వచ్చింది. అక్టోబర్ 15, 2017న బాలీవుడ్‌లో ప్రారంభమైన మీటూ ఉద్యమం అతి తక్కువ సమయం లోనే ప్రపంచ దేశాలన్నింటికీ వ్యాపించింది. రంగాలతో సంబంధం లేకుండా లైంగిక వేధింపులకు గురైన అనేక మంది బాధిత మహిళలు కామాంధుల చిట్టాను బయటపెట్టారు. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించి న ఈ ఉద్యమం మహిళల్లో చైతన్యం రగిలించింది. ఇంతటి ప్రభావం చూపిన మీటూ ఉద్యమం తర్వాత కూడా మహిళలపై లైంగిక నేరాలు తగ్గలేదు. 14 శాతం ఎక్కువయ్యాయని ఓ అధ్యయనం పేర్కొంది. ఈ మేరకు సోషల్ సైన్స్ రీసెర్చ్ నెట్‌వర్క్(ఎస్ఎస్ఆర్ఎన్)లో అధ్యయనం ప్రచురితమైంది. ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో-ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) దేశాల్లో ఈ మేరకు లైంగిక నేరాలు అధికమయ్యాయని రిపోర్ట్ వివరించింది. మీటూ ఉద్యమంలో భాగంగా వెల్లడైన లైంగిక ఆరోపణలపై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరపలేదని, చాలా తక్కువ కేసుల్లో మాత్రమే విచారణ పూర్తయిందని అధ్యయనం వివరిం చింది. అమెరికాలోని యేల్ యూనివర్సిటీకి చెందిన రో లెవీ, మార్టిన్ మాట్సన్ ఈ అధ్యయనం నిర్వహించారు. ఓఈసీడీలోని 24 దేశాల్లో 81 శాతం జనాభాను పరిగణలోకి వచ్చేలా సమాచారాన్ని సేకరించారు.

మీటూ ఉద్యమం ప్రారంభమైన మూడు నెలల వ్యవధిలో 13 ఓఈసీడీ దేశాల్లో దాదాపు 11,598 లైంగిక కేసులు నమోదయినట్టు అధ్యయనకారులు అంచనా వేశారు. ఆయా దేశాల్లో మీటూ ఉద్యమం అత్యంత చైతన్యవంతంగా జరిగిందని రిపోర్ట్ వివరించింది. మీటూ ఉద్యమం తర్వాత లైంగిక నేరాలను అంచనా వేసేందుకు అధ్యయనకారు లు జాగ్రత్తలు తీసుకున్నారు. పలు విధానాల ద్వారా ఒకటికి రెండు సార్లు నమూనాలను సేకరించారు. ముఖ్యంగా మహిళా బాధితుల నుం చి వివరాలను సేకరించా రు. లైంగిక వేధింపులను మీడియా వేదికగా వెల్ల డించిన బాధితుల నుంచి ఎక్కువగా సమాచారాన్ని రాబట్టారు. అధికంగా అమెరికా లో బాధితులపై దృష్టి పెట్టారు. మహిళలపై లైంగిక దాడులు, లైంగిక వేధింపులు అధిక స్థాయిలో జరిగినట్టు గణాంకాలతో సహా అధ్యయనంలో తేటతెల్లమైంది.




సామాజిక ఉద్యమాలు వ్యక్తుల వ్యక్తిగత నిర్ణయాలు ప్రభావం చూపుతున్నాయని, అర్థవంతమైన నిర్ణయాల ను తీసుకునేలా మార్పులకు ఉద్యమాలు కారణమవుతు న్నాయని అధ్యయనంలో తేలింది. సామాజిక ఉద్యమా లు సమాజంలో విలువలపై భారీగా, సుదీర్ఘకాలంపాటు ప్రభావం చూపుతున్నాయని, దీంతో అనేక మంది నిర్ణయాలు తీసుకునే విషయాల్లో అర్థవంతమైన మార్పులు చేసుకుంటున్నాయని పేర్కొంది. ప్రచారం ఎక్కువైతే వ్యక్తిగత ప్రవర్తన, నిర్ణయాలు తీసుకునే విధానంలో మార్పులు వస్తాయని అధ్యయనకారులు వెల్ల డించారు. ఇదిలావుండగా మీటూ ఉద్యమంలో తొలి సారిగా హాలీవుడ్‌లో ప్రారంభమైంది. నిర్మాత హార్వే వెయిన్‌స్టెయిన్ లైంగికంగా వేధించారని నటి అలీస్సా మిలనో ట్విట్ట ర్ వేదికగా వెల్లడించారు. మీటూ అనే ట్యాగ్‌తో సోషల్ మీడియాలో ఈ విషయాన్ని వెల్లడించారు. తనలాగే లైంగిక వేధింపులకు గురయినవారు వేధించిన వ్యక్తుల పేర్లను వెల్లడించాలని ఆమె కోరారు. మీటూ ఉద్యమంతో లైంగిక దుష్ప్రవర్తనపై భారత్‌తో సహా అనేక దేశాల్లో మహిళలకు అవగాహన కలిగిన విషయం తెలిసిందే.

- పి. సుదర్శన్

అంతరించిపోతున్న భాషలు

మిగతా జీవజాలంతో పోలిస్తే, మనిషి ప్రత్యేకతల్లో మాట్లాడగలడం ఒకటి. అదీ తనదైన ప్రత్యేక భాషలో. ప్రపంచవ్యాప్తంగా ఉన్న విజ్ఞానాన్ని తెలుసుకోవడం, ఒంటబట్టించుకున్న జ్ఞానాన్ని, తన అనుభవాన్ని, సంస్కృతిని, సంప్రదాయాన్ని తరువాతి తరానికి అందించడానికీ ఉపకరించేది భాషే. ఆ విధంగా గతానికి, వర్తమానానికి, భవిష్యత్తుకు వారధిగా మారింది భాషే. పరిణామ క్రమంలో కొత్తకొత్త పరిజ్ఞానం అందుబాటులోకి వస్తున్న కొద్దీ భాష వృద్ధి చెందుతుంది. 'సొంత' భాషల ప్రత్యేకతా హెచ్చుతుంది, ప్రాధాన్యతా పెరుగుతుంది. ఒక సమాజం లేదా సమూహ అస్తిత్వానికీ అది ఆధారంగా ఉంటుంది. ఆ విధంగా భాషకు అపారమైన విలువ ఉంటుంది. కాబట్టే, భాష వినిమయ వస్తువుగా, డబ్బుకంటే ఎక్కువ విలువను సంతరించుకొన్నది. అయితే, దేశీయ భాషల వాడుక విధానంలో తలెత్తే క్లిష్టమైన పరిస్థితి వాటి వినియోగదారులను నేరుగా ప్రభావితం చేయడం వలన స్థానిక భాషలు కనుమరుగయ్యే పరిస్థితి ఉంది. దానితో స్థానిక భాషలు భయంకరమైన రేటులో కనుమరుగవుతున్నాయి. అంతరించిపోతున్న ఈ భాషలలో చాలా మట్టుకు దేశీయ ప్రజలు ఉపయోగిస్తున్న స్థానిక భాషలే ఉండడం ఆందోళన కలిగించే విషయం. ఐక్యరాజ్య సమితి 2019ని అంతర్జాతీయ దేశీయభాషల సంవత్సరంగా ప్రకటించిన విషయం తెలిసిందే.

ప్రపంచం మొత్తమ్మీద 2019 చివరి నాటికి 2,680 భాషలు అంతరించిపోతున్న భాషల జాబితాలో ఉన్నట్లు ఐక్యరాజ్య సమితి భాషా విభాగపు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రజలు ఇతర ప్రాంతాలకు ఉపాధి నిమిత్తం వలసలు పోతూండడం వల్ల వారు తమ భాషలకు దూరమవుతున్నారు. ఇలాంటి మరికొన్ని కారణాంశాల వల్ల స్థానిక భాషలు అదృశ్యమయ్యే స్థాయికి గానీ లేదా బలహీనపడే ప్రమాదకర స్థాయికి గానీ చేరుతున్నవని ప్రపంచ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. స్వదేశీ భాషలు సరైన స్థాయిలో మనుగడ కొనసాగించాలంటే, ప్రజా విధానాలలో అవసరమైన మార్పులు చోటు చేసుకోవాలి. దేశీయ భాషలకు ప్రచారం కల్పించాలి. భాషల మనుగడ అనేది భాషా వినియోగదారుల శ్రేయస్సు, రాజకీయ ప్రభావం, స్థానిక భాషలు మాట్లాడే సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది.




ఈ భాషా విధానాలు దేశీయ ప్రజలను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా శక్తిమంతం చేసే సామాజిక విధానాలతో పరిపూర్ణం చేయాలి. తద్వారా వారు తమ భాష, సంస్కృతిని వదులుకోకుండా, ఆర్థిక అవసరాల కోసం వలస పోకుండా జీవనోపాధిని సుస్థిరం చేసుకోగలుగుతారు. భారత్‌లాంటి దేశాల్లో రాజకీయ ప్రభావాల కారణంగా సామాజిక విధానాలు పరిపూర్ణం కాకుండా ఉండడం వల్ల ప్రజలు వలసలు పోతూ, స్వదేశీ భాషలు కనుమరుగు కావడానికి కారణమవుతున్నారు. స్వదేశీ భాషలు మాట్లాడే వారిపై విదేశీ భాషలపై ఆధారపడిన వారు వివక్షాపూరితంగా వ్యవహరించడం వల్ల కూడా స్థానిక భాషలు అంతరించిపోతున్నాయి.

తల్లిదండ్రులు, పెద్దలు తమ పిల్లలకు స్వదేశీ భాషలను నేర్పించే విషయంలో శ్రద్ధ వహించకపోవడమే కాకుండా, పరాయి భాషపై మోజు పెంచే విధంగా వ్యవహరిస్తూ, స్వదేశీ భాషలను చిన్న చూపు చూస్తున్నారు. రాజకీయాలు, చట్టం, న్యాయం, సాంస్కృతిక పద్ధతులు, విద్య, ఉద్యోగాలు, సమాచార మార్పిడి, సామాజిక జీవితం, స్థిరమైన అభివృద్ధిలో విస్తృత భాగస్వామ్యం కల్పించకపోవడం వంటి పరిస్థితులూ దేశీయ భాషలు అంతరించిపోవడానికి కారణాలుగా ఉన్నాయి. ఈ పరిస్థితులను గమనించి ప్రజలు, ప్రభుత్వాలు తగు విధంగా ప్రవర్తనలు, విధానాలు సరిదిద్దుకుంటేనే మాతృ భాషలను రక్షించుకోగలుగుతాం.

- పోలుమాటి రాంబాబు

అభ్యుదయమే ఇతివృత్తం

తెలుగు సాహిత్యంలో పాటకు తెలంగాణా, విమర్శకు రాయలసీమ, కథకు ఉత్తరాంధ్రలను పుట్టినిల్లుగా పేర్కొనవచ్చు. గురజాడ నుంచి గంటేడ వరకు అనేక మంది లబ్దప్రతిష్టులైన కథకులు ఉత్తరాంధ్ర నేలతల్లిపై పుట్టినవారే. వారిలో చా.సోగా ప్రఖ్యాతి నొందిన చాగంటి సోమయాజులు ప్రముఖులు. శ్రీకాకుళంలో పుట్టిన ఆయన బాల్యమంతా నాగావళి తీరం ఒడ్డున, ఉన్నత విద్యాభ్యాసం విజయనగరం లోనూ సాగింది. ఓ ప్రత్యేకమైన శైలిలో తన కథలను తెలుగు సాహితీసీమకు విశేషంగా అందించారు చా.సో. సామాజిక ఇతి వృత్తాలను వస్తువుగా చేసుకొని కథలు రాయడంలో ఆయనను మించినవారు లేరు. పేద, మధ్యతరగతి, అణగారిన, పీడిత ప్రజల సుఖ దుఃఖాలను, కష్టనష్టాలను ఉన్నది ఉన్నట్టుగా ఆయా కథలలో చిత్రీకరించేవారు. కథావస్తువు, సన్నివేశం, నడక, పాత్రోచిత సంభాషణ ఇలా అన్నింటిలోనూ చా.సో ప్రత్యేకత కొట్టొచ్చినట్లు కనిపించేది. డబ్బు మనిషిని ఏ విధంగా అవినీతి మయం చేస్తుందో, మానవీయ విలువలను ఏ విధంగా నాశనం చేస్తుందో, పెత్తందారి సమాజంలో మనుషులు ఆ డబ్బుకు ఏ విధంగా కక్కుర్తిపడి ప్రవర్తిస్తారో! దానికోసం ఎటువంటి అఘాయిత్యం చేయడానికైనా వెనుకాడని బూర్జువా వర్గ ప్రవర్తన, అనే విషయాలను సునిశితంగా పరిశీలించి తన కథలలో ఇమిడ్చి వివిధ రకాల పాత్రలను సృష్టించడంలో చా.సోకు సాటిరారు వేరెవ్వరు. మనుషుల మధ్య నైతిక విలువలు పతనం కావడం, అవినీతి విపరీతంగా పేరుకు పోవడం, మానవీయ సంబంధాలు మంటగలిసిపోవడం, పెత్తందారీ పోకడలు పెచ్చురిల్లి పోవడాన్ని గమనించిన చాసో, ఆనాటి దుర్నీతిని, దుష్ట సాంప్రదాయాలని ఎండగడుతూ రచనలు చేశారు. సంస్కరణ దిశగా తన కథలలో వివిధ సన్నివేశాలను సృజియిస్తూ, సామాజిక చైతన్యం తీసుకు రావడానికి ఓ కవిగా తన వంతు ప్రయత్నం చేశారు. అందువల్లే అతని కథలు ఎక్కువగా హిందీ, కన్నడం, మలయాళం, ఉర్దూ, రష్యన్ భాషలో అనువదించబడ్డాయి. ''చా.సో కథలు ఎక్కువగా బుద్ధిని తాకుతాయి. కొన్నిచోట్ల కథ హృదయద ఘ్నంగానే ఉంటుందని'' చా.సో గారాలపట్టి, సాహితీ వారసురాలైన చాగంటి తులసి అంటారు. ఆమె ఇటీవల తన తండ్రి కథలను ఐదింటిని నాటికలుగా రాసి ప్రచురించారు. ముఖ్యంగా ''ఎందుకు పారేస్తాను నాన్నా, జంక్షన్లో బడ్డీ, వాయులీనం, కుంకుడాకు మరియు వజ్రహస్తం'' అనే ఐదు కథలను ఎంపిక చేసుకొని వాటికి ఆమె దృశ్యరూపం ఇచ్చారు.



చా.సోకి నివాళి

మద్రాస్ రాష్ట్రంలో 'అరసం' వ్యవస్థాపనలో ముఖ్యభూమిక వహించిన వారు ఆరుద్ర. ఆయనకు చేదోడు వాదోడుగా ఉంటూ అరసంను రాష్ట్ర వ్యాప్తంగా స్థాపించడంలో కీలకపాత్ర పోషించిన వ్యక్తి చా.సో. చదలవాడ పిచ్చయ్యతో కలిసి అరసం తొలి సభను తెనాలిలో దిగ్విజయంగా నిర్వహించడానికి ఎంతో కృషి చేశారు. మిత్రులైన శ్రీశ్రీ, శ్రీరంగం నారాయణబాబు, ఆచార్య రోణంకి అప్పలస్వామి వారిని చా.సో ఎంతో ప్రభావితం చేశారు. 1995 నుండి చా.సో కుటుంబ సభ్యులు విజయనగరంలో 'చా.సో స్ఫూర్తి' పేరున ట్రస్ట్ నెలకొల్పి ప్రతీయేటా అతని జయంతి రోజున అభ్యుదయ సృజనాత్మక సాహిత్యానికి నిబద్ధతతో కృషిచేస్తున్న వర్ధమాన అభ్యుదయ రచయితలకు 'చా.సో స్ఫూర్తి సాహితీ పురస్కారాన్ని' అందిస్తున్నారు. అరసం సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో చాగంటి తులసి 'రంగంటే ఇష్టం' సాహితీ వ్యాస సంకలనం పుస్తకావిష్కరణ చా.సో వర్ధంతి సందర్భంగా నేడు విజయనగరం గురజాడ గ్రంథాలయంలో నిర్వహిస్తుండటం ఓ విశేషం.

- పిల్లా తిరుపతిరావు
7095184846

చైనాతో సరిహద్దు సమస్యలకు త్వరలో

శాశ్వత పరిష్కారం



- దేశ రక్షణ కోసం సర్వసన్నద్ధం
- పాక్, చైనా రెండింటికీ సమప్రాధాన్యం
- ఆర్మీ నూతన చీఫ్ జనరల్ నరవణె

న్యూఢిల్లీ: చైనా సరిహద్దులో భారత బలగాలు మరింత అప్రమత్తంగా ఉండాలని, సవాళ్లను ఎదుర్కొనేందుకు సామర్థ్యాన్ని పెంచుకోవాలని ఆర్మీ చీఫ్ జనరల్ ముకుంద్ నరవణె సూచించారు. అదే సమయంలో, రెండు దేశాల మధ్య నెలకొన్న దశాబ్దాల నాటి సరిహద్దు సమస్యలకు త్వరలో శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకచిహ్నం వద్ద అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం సైనిక గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా నరవణే మాట్లాడుతూ, రెండు ప్రధాన దేశాలతో భారత్ సరిహద్దులు పంచుకుంటోందని, రెండు దేశాలు సమాన ప్రాధాన్యతను కలిగివున్నాయని చెప్పారు. గతంలో పశ్చిమ ప్రాంతంవైపే దృష్టిసారించామని, ఉత్తర ప్రాంతం కూడా అంతే ప్రాధాన్యత కలిగి ఉందన్న సంగతి గుర్తించాలని అన్నారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ స్వాధీనంపై రాజకీయ నేతలు తరచూ చేస్తున్న ప్రకటనలపై స్పందిస్తూ అన్ని సవాళ్లు, వ్యూహాలపై సైన్యం విశ్లేషిస్తుందని, ఇది నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. సరిహద్దు సమస్యలు ఇంకా అపరిష్కృతంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో శాంతియుత వాతావరణం నెలకొనేలా చూడటం అవసరం. కాలానుగుణంగా ఈ వివాదాలకు ఫుల్‌స్టాప్ పడుతుందని ఆశిస్తున్నామని చెప్పారు. సేనల ఆధునీకరణ ప్రణాళికలకు కీలక ప్రాధాన్యత ఇస్తామని చెప్పుకొచ్చారు. సవాళ్లకు అనుగుణంగా దీర్ఘకాల వ్యూహాలతో ముందుకెళతామని, సేనలకు ఎదురయ్యే సవాళ్లలో మార్పులకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తామని అన్నారు.

దేశాన్ని శత్రుమూకల నుంచి రక్షించడం కోసం త్రివిధ దళాలు సిద్ధంగా ఉన్నాయని భారత ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ ముకుంద్ నరవణే స్పష్టం చేశారు. ఆర్మీ చీఫ్‌గా విధులను నిర్వర్తించడానికి తనకు ధైర్యం, బలం చేకూర్చాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను. మానవ హక్కులను గౌరవించడానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతామని అన్నారు. దేశ భద్రతకు సంబంధించి అన్ని వేళలా సర్వసన్నద్ధంగా ఉండడమే తమ తొలి ప్రాధాన్యమని నరవణే స్పష్టం చేశారు

రాజకీయాలకు దూరం

- ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తాం
- త్రివిధ దళాల ఏకీకరణకు కృషి
- సైనిక ఆర్థిక వనరులపై దృష్టిసారిస్తాం
- బాధ్యతల స్వీకరణ అనంతరం సీడీఎస్ రావత్ వెల్లడి



న్యూఢిల్లీ: భారతదేశ తొలి చీఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్)గా మాజీ ఆర్మీ చీఫ్ బిపిన్‌రావత్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తనపై వచ్చిన రాజకీయ విమర్శలకు వివరణ ఇచ్చారు. సైనిక బలగాలు రాజకీయాలకు ఎంతో దూరంగా ఉంటాయని, కానీ, అధికారంలోని ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ పనిచేస్తారని స్పష్టంచేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పౌరసవరణ చట్టానికి వ్యతిరేకంగా చెలరేగుతున్న ఆందోళనలపై కొద్దిరోజుల కిందట ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. ప్రజలను తప్పుదోవపట్టించేవారు ఎప్పటికీ నాయకులు కాలేరంటూ గత గురువారం రావత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇక సీడీఎస్‌గా తన కర్తవ్యాన్ని అంకితభావంతో నిర్వర్తిస్తానని చెప్పారు. సైన్యం, నావికాదళం, వైమానిక దళం జట్టుగా కలిసి పనిచేస్తాయని చెప్పారు. త్రివిధ దళాలకు చెందిన మంచి ఆర్థిక వనరులపై దృష్టి కేంద్రీకరిస్తామని అన్నారు. మూడు దళాల మధ్య శిక్షణను ఏవిధంగా ఏకీకరణ చేయాలన్నదానిపై చర్చిస్తామని తెలిపారు. ఇతర అదనపు బాధ్యతలు అప్పగించినా సమర్థవంతంగా నిర్వహిస్తామని స్పష్టంచేశారు. త్రివిధ దళాల మధ్య సమన్వయం, వనరుల ఏకీకరణే లక్ష్యమని రావత్ పేర్కొన్నారు. సీడీఎస్ తన సొంత మార్గదర్శకత్వంలో సాయుధ బలగాలను ముందుకు నడిపించరని, ఏకీకరణ అవసరమని అన్నారు. థియేటర్ కమాండర్స్ ఏర్పాటుపై స్పందిస్తూ, ఇందుకు పాశ్చాత్య విధానాలను అధ్యయనం చేస్తున్నామని, పరస్పరం ఒకరినొకరు అర్థంచేసుకునేలా త్రివిధ దళాల మధ్య సమన్వయానికి థియేటర్ కమాండర్స్ కృషిచేస్తారని అన్నారు. నియంత్రణరేఖ వద్ద కాల్పుల నివారణ చర్యలపై వ్యాఖ్యానించేందుకు నిరాకరించారు. సైనిక వ్యూహాలను బహిర్గతం చేయలేమని చెప్పారు. మూడు బలగాలకు మధ్య తటస్థంగా ఉంటానని అన్నారు.

శిరోభారం తగ్గింది!

41 ఏళ్లుగా ధరిస్తున్న గుర్ఖా టోపీని పక్కనబెట్టినందున, ఇప్పుడు నా తల తేలిగ్గా అనిపిస్తున్నదంటూ రావత్ చమత్కరించారు. నేను ధరించిన ఈ పీక్ క్యాప్.. తటస్థంగా ఉన్నానని తెలియజేస్తుంది. మూడు దళాలకు సీడీఎస్ తటస్థంగా ఉంటాడు. అందువల్ల ఇప్పుడు నాకు శిరోభారం తగ్గినట్లు అనిపిస్తోంది.

సీడీఎస్‌కు వ్యతిరేకం కాదు: కాంగ్రెస్

దేశ భద్రత కోణంలో తీసుకునే ఎలాంటి చర్యనైనా తమ పార్టీ సమర్థిస్తుందని కాంగ్రెస్ స్పష్టంచేసింది. సీడీఎస్ ఏర్పాటు తప్పటడుగు అంటూ అధిర్‌రంజన్ చౌదరి, మనీష్ తివారి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు భిన్నంగా పార్టీ అధికారిక ప్రకటన చేసింది. మాటల కంటే చేతలు పెద్దగా ఉండాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సష్మితాదేవ్ అన్నారు. సీడీఎస్ ఏమేరకు మేలు చేస్తుందో వేచిచూడాలన్నారు.

యుద్ధ సవాళ్లకు సీడీఎస్ పరిష్కారం: మోడీ



త్రిదళాధిపతి (చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్) ఏర్పాటును ఓ సమగ్రమైన సంస్కరణగా ప్రధాని మోడీ అభివర్ణించారు. తొలిసారి సీడీఎస్‌ను ఏర్పాటు చేసిన నేపథ్యంలో మోడీ ఆధునిక యుద్ధాల్లో ఎదురవుతున్న సమస్యలకు సీడీఎస్‌తో పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన సైనికులకు ఆయన నివాళి అర్పించారు. సీడీఎస్ బిపిన్ రావత్‌ను అత్యద్భుత అధికారి అంటూ ప్రశంసించారు. సైనిక దళాల ఆధునీకరణ బాధ్యతలు సీడీఎస్‌పై ఉంటాయన్నారు. కాగా, హోంశాఖ మంత్రి అమిత్‌షా సీడీఎస్ ఏర్పాటును చారిత్రక ఘట్టంగా పేర్కొన్నారు. త్రిదళాలను సమర్థను పెంచడంతోపాటు, వారి సంక్షేమానికి మోడీ ప్రభుత్వం కృషిచేస్తోం దన్నారు. ఈ మేరకు బుధవారం వరుస ట్వీట్లు చేశారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సీడీఎస్ ఏర్పాటు డిమాండ్‌ను నరేంద్ర మోడీ నెరవేర్చారని చెప్పారు.

ఫాస్టాగ్ స్కానర్లు పనిచేయకుంటే..

టోల్ ఫీజు కట్టక్కర్లేదు!



న్యూఢిల్లీ: టోల్‌ప్లాజాల వద్ద కొత్తగా అమల్లోకి వచ్చిన ఫాస్టాగ్ విధానం సరిగా పనిచేయడం లేదా? మీ వాహనం మీదున్న ఫాస్టాగ్ బార్‌కోడ్ స్కానింగ్ కావడం లేదా? అయితే మీరు టోల్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. ఎలాంటి రుసం చెల్లించకుండానే ముందుకు సాగిపోవచ్చు. ఫాస్టాగ్ రహిత వాహనాలు నిబంధనలకు విరుద్ధంగా ఇతర వరుస క్రమంలోకి ప్రవేశిస్తే, రెట్టింపు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఇదే సమయంలో, టోల్‌ప్లాజా వద్ద స్కానర్లు పనిచేయకుంటే, ఫాస్టాగ్ వాహనదారులు ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని నేషనల్ హైవే టోల్‌ప్లాజా ఫీజుల రూల్స్ స్పష్టం చేస్తున్నాయి. స్కానర్లు సరిగా పనిచేయనప్పుడు, సదరు వాహనదారుడికి తప్పకుండా జీరో చెల్లింపు రసీదును జారీచేయాలని నిబంధనలు చెబుతున్నాయి. ఫాస్టాగ్ అనేది ఎలక్ట్రానిక్ టోల్ ఫీజు వసూలు పరికరం. ఇది స్టికర్ రూపంలో ఉంటుంది. వాహనం ఎడమవైపు విండ్‌స్క్రీన్‌పై అతికించబడి వుంటుంది. ఉపయోగంలో ఉన్న ఫాస్టాగ్ స్టిక్కర్ ద్వారా టోల్‌ప్లాజాల వద్ద డ్రైవర్ వాహనాన్ని ఆపకుండానే సాఫీగా ప్రయాణం చేయవచ్చు. ఎలక్ట్రానిక్ టోల్ విధానం అమల్లోకి తీసుకురావడం ద్వారా, జాతీయ రహదారులపై ట్రాఫిక్ రద్దీని నివారించాలన్నది కేంద్ర ప్రభుత్వ యోచన. జనవరి 15నుంచి దేశంలోని అన్ని టోల్‌ప్లాజాల వద్ద ఈ విధానం పూర్తిస్థాయిలో అమల్లోకి రానుంది. ప్రతి వాహనం ఫాస్టాగ్‌ను కలిగివుండటం తప్పనిసరి చేస్తూ జాతీయ రహదారుల ప్రాధికారసంస్థ ఇటీవల కొత్త రూల్స్ తీసుకొచ్చింది. టోల్‌ప్లాజాల వద్ద అందుబాటులో ఉన్న వాహనశ్రేణి వరుసల్లో 75 శాతం ఫాస్టాగ్ వాహనాలకు, 25 శాతం ఫాస్టాగ్ రహిత వాహనాలకు కేటాయించడం జరిగింది. ఈ విధానంలో ఫాస్టాగ్ రహిత వాహనాలు ఫాస్టాగ్ లేన్లగుండా వెళితే రెట్టింపు ఫీజు చెల్లించేలా కఠిన నిబంధనలు తీసుకొచ్చారు.

సమాజంలో ఆర్యవైశ్యుల పాత్ర కీలకం



- ప్రభుత్వ కార్యక్రమాల అమల్లో సంపూర్ణ భాగస్వామ్యం
- కేసీఆర్ ప్రభుత్వంలో వైశ్య సామాజిక వర్గానికి సముచిత స్థానం
- ఉప్పల్ భగాయత్‌లో వైశ్య భవన్‌కు స్థలం కేటాయింపు అభినందనీయం
- ఐవీఎఫ్ కార్యక్రమంలో మాజీ సీఎం కె.రోశయ్య
- మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన ఉప్పల శ్రీనివాస్ సన్మానం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సామాజిక చైతన్యంలో, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యుల పాత్ర ఎంతో ప్రశంసనీయమని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ డాక్టర్ కొణిజేటి రోశయ్య అన్నారు. రాజకీయ వ్యాపార, వాణిజ్య రంగాల్లో అందెవేసిన చేయిగా ఉన్న వైశ్యులు రాష్ట్రాభివృద్ధిలో కీలక భాగస్వామ్యం పంచుకుంటున్నారని ఆయన సంతృప్తి వ్యక్తంచే శారు. బుధవారం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) తెలంగాణ అధ్యక్షుడిగా వరుసగా మూడోసారి ఉప్పల శ్రీనివాస్ గుప్త ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి రోశయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ఎన్నికకు సంబంధించిన ధృవీకరణ పత్రాన్ని ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత కొన్నేళ్లుగా తెలంగాణ ప్రభుత్వంలోనూ ఆర్యవైశ్యులకు సముచిత ప్రాధాన్యత లభిస్తోందన్నారు. జనాభా ప్రాతిపదికన సంఖ్య తక్కువే అయినా సామాజిక చైతన్యం, భాగస్వామ్యం అగ్రస్థానంలో ఉంటారని పేర్కొన్నారు. ఈ ఒరవడిని కొనసాగిస్తూ 2020 సంవత్సరంలో మరింత భాగస్వామ్యం పెంచుకునే దిశగా కృషి చేయాలని డాక్టర్ రోశయ్య పిలుపునిచ్చారు. ఉప్పల్ భగాయత్‌లో ఆర్య వైశ్యుల అభ్యున్నతి కోసం తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఐదు ఎకరాల భూమి కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. పేద ఆర్య వైశ్యుల అభివృద్ధికి పాటు పడుతున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తను ప్రతి ఒక్కరూ కొనియాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో తమవంతు భాగస్వామ్యం పోషించినపుడే సమాజంలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలకు ఉదార స్వభావంతో విరాళాలు ఇచ్చే ప్రతి ఒక్కరికీ ఆయన శుభాభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మాజీ సీఎం డాక్టర్ కె.రోశయ్య కేక్ కట్ చేశారు. ఐవీఎఫ్ నేతలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆనందోత్సాహాలు పంచుకున్నారు. 32 జిల్లాల నుంచి సుమారు 600 మంది ఐవీఫ్ సభ్యులు హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ సెంట్రల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గంజి రాజమౌళి గుప్త, ఐవీఎఫ్ చీఫ్ అడ్వయిజర్ మూస్తాల సత్తయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పబ్బ చంద్రశేఖర్, రాష్ట్ర మీడియా కమిటీ చైర్మన్ రఘు గంగిశెట్టి, పొలిటికల్ కమిటీ చైర్మన్ బచ్చు శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ జీన్నం వేణు, కో-ఆర్డినేటర్ కూర నాగరాజు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు టీఎల్ సుజాత తదితరులు ఉన్నారు.



ముఖ్యమంత్రి అభ్యర్థిపై

మల్లగుల్లాలు

- గతానుభవాలతో కొత్త వ్యూహాలు
- ఢిల్లీ పీఠంపై కమలనాథుల కసరత్తులు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: సార్వత్రిక ఎన్నికలు మినహా ఈ మధ్య జరిగిన అనేక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో వరుస ఓటములు చవిచూస్తున్న భారతీయ జనతా పార్టీ, దేశ రాజధాని ఢిల్లీలో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు గెలుపే లక్ష్యంగా సిద్ధమవుతోంది. ఈ ఎన్నికల్లోనైనా గెలపొంది పరువు నిలబెట్టుకోవాలని కమలనాథులు కలలుగంటున్నారు. తిరుగులేని మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి పాలన సాగించిన కేజ్రీవాల్‌ను ఓడించాలంటే అంతకంటే బలమైన, ప్రజల్లో క్రేజ్ ఉన్న నేత కోసం అన్వేషణ మొదలుపెట్టింది. ఈ క్రమంలో బీజేపీ అధినాయకత్వం కసరత్తు తీవ్రతరం చేసింది. గత అనుభవాలు నేర్పిన గుణపాఠాల నేపథ్యంలో ఈసారి సీఎం అభ్యర్థి విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. దీంతో సీఎం అభ్యర్థి ఎంపిక ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. నిజానికి జనవరి మొదటి వారంలోనే సీఎం అభ్యర్థి పేరును ప్రకటించాలని అనుకున్నప్పటికీ, అభ్యర్థి ఎంపిక సవాలుగా మారడంతో ఏ నిర్ణయం తీసుకోలేకపోతోంది. సీఎం అభ్యర్థిగా ఎవరినీ ప్రకటించకపోయినా, అసెంబ్లీ ఎన్నికలు మాత్రం ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు మనోజ్ తివారీ నేతృత్వంలోనే జరుగుతాయని కేంద్ర నాయకత్వం స్పష్టం చేసింది. ఓవైపు సీఎం అభ్యర్థి ఎంపిక కసరత్తు కొనసాగిస్తూనే, మరోవైపు గెలుపు వ్యూహాలు రచిస్తోంది.

అడ్డుగోడగా మారిన కేజ్రీ 'వాల్'

ఢిల్లీ ముఖ్యమంత్రిగా వరుసగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన అరవింద్ కేజ్రీవాల్ అనేక పరిమితులు, అవరోధాల మధ్య ఐదేళ్ల పాటు ప్రభుత్వాన్ని సుస్థిరంగా నడిపారు. పాలనలో తనదైన ముద్ర వేసుకుంటూ ఓటు బ్యాంకును సుస్థిరం చేసుకున్నారు. సామాన్యులను పట్టి పీడించే కార్పొరేట్ విద్య, వైద్యం దోపిడీ బారి నుంచి కాపాడేలా కేజ్రీవాల్ అనేక విప్లవాత్మక చర్యలు చేపట్టారు. ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో బోధనను మెరుగుపర్చడంతో పాటు మౌలిక వసతులు, ఆధునిక వసతులు సైతం కల్పించారు. మొహల్లా క్లినిక్‌ల పేరుతో బస్తీ దవాఖానాలను బస్తీల్లో నివసించే నిరుపేద వర్గాల దగ్గరకు తీసుకెళ్లారు. దీంతో చిన్న చిన్న రోగాలు, అస్వస్థతలకు ప్రభుత్వ పెద్దాసుపత్రుల వద్ద పనులు మానుకుని క్యూ లైన్లలో నిలబడాల్సిన పరిస్థితి నుంచి వారిని బయటపడేశారు. అప్పటికప్పుడే వైద్య పరీక్షలు, ల్యాబ్ టెస్టులు, మందుల పంపిణీ జరగడంతో సామాన్యులు ముఖ్యమంత్రికి మంచి మార్కులు వేస్తున్నారు. వీటికి తోడు ఫక్తు ఎన్నికల పథకాలను కొన్నింటిని తీసుకొచ్చారు. ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌కు చెందిన బస్సుల్లో మహిళలకు ప్రయాణాన్ని ఉచితం చేయడంతో పాటు విద్యుత్తు బిల్లుల భారాన్ని కూడా సామాన్యులపై పూర్తిగా తొలగించే పథకాలు తీసుకొచ్చారు. 200 యూనిట్ల వరకు విద్యుత్తు బిల్లుపై పూర్తిగా రాయితీ ప్రకటిస్తూ, 200 నుంచి 400 యూనిట్ల వరకు వినియోగించేవారికి 50శాతం రాయితీ అందజేస్తున్నారు. నెలకు 20వేల లీటర్ల వరకు నీటిని ఉచితంగా వాడుకునేలా మొదటి నుంచి అమలు చేస్తున్నారు. ఇవన్నీ పోలింగ్ రోజు క్యూలైన్లో నిలబడి ఓటు వేసే ప్రతి ఒక్కరూ లబ్ధి పొందే పథకాలే కావడంతో ప్రజల్లో కేజ్రీపై క్రేజ్ మరింత పెరిగి బీజేపీ అవకాశాలకు అడ్డుగోడగా నిలిచారు. రాజకీయంగా చూసినా తొలుత ప్రతి చిన్న విషయానికీ కేంద్రంతో ఘర్షణకు దిగుతూ పేచీకోరు ముద్ర వేసుకున్న కేజ్రీవాల్, మున్సిపల్ ఎన్నికల తర్వాత ఆత్మపరిశీలన చేసుకుని వ్యూహాన్ని మార్చుకున్నారు. సైలెంట్‌గా తన పని తాను చేసుకుంటూ ఓటర్ల మన్నన పొందే కార్యక్రమాలపై దృష్టి కేంద్రీకరించారు.

అక్రమ కాలనీలే ఆధారం

అధికారానికి అడ్డుగోడగా మారిన కేజ్రీవాల్‌ను ఎదుర్కోడానికి భారతీయ జనతా పార్టీ సాహసమే చేయాల్సి వచ్చింది. ఢిల్లీ నగరంలోని 1,731 అక్రమ కాలనీలను రెగ్యులరైజ్ చేసేందుకు ఏకంగా పార్లమెంటులో ఓ చట్టాన్నే తీసుకొచ్చింది. ఆయా కాలనీల్లో భవనాలు నిర్మించుకుని కొన్ని ఏళ్లుగా నివసిస్తున్నవారికి ఇప్పుడు వాటిపై యాజమాన్య హక్కులు రానున్నాయి. ఇంతకాలం పాటు అక్రమ కాలనీల్లో ఇళ్లను పవర్ ఆఫ్ అటార్నీతో కొనుగోళ్లు, అమ్మకాలు జరుపుకోవడం మినహా ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ జరిగేది కాదు. అక్రమ కాలనీలు కావడంతో బ్యాంకు రుణాలు కూడా మంజూరయ్యేవి కాదు. ఇప్పుడు బీజేపీ సర్కారు తీసుకొచ్చిన బిల్లుతో లక్షలాది మందికి లబ్ధి చేకూరుతుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. అందుకే ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో బీజేపీ ఏర్పాటు చేసిన తొలి సభలోనే కాలనీలను రెగ్యులరైజ్ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపేలా ఫ్లెక్సీలు, పోస్టర్లు, కార్యక్రమాలు రూపొందించారు. అయితే ఇది నిజంగా బీజేపీకి ఓట్ల వర్షం కురిపిస్తుందా అన్నది సందేహాస్పదమే. ఎందుకంటే ఈ చట్టం కేవలం ప్రాపర్టీ మీద యాజమాన్య హక్కులు మాత్రమే కల్పిస్తుంది తప్ప రెగ్యులరైజ్ చేయడం లేదని ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపిస్తోంది. అక్రమ కాలనీలు రెగ్యులరైజ్ అవుతాయని చెబుతూ బీజేపీ నేతలు ప్రజల్ని మభ్యపెడుతున్నారని ఆరోపిస్తోంది. ఈ పరిస్థితుల్లో అక్రమకాలనీ వాసులు ఎంతమేర బీజేపీ వెంట నిలుస్తారన్నది కమలనాథులకే అంతుచిక్కడం లేదు.

బెడిసికొట్టి బేడీ వ్యూహం

అయోమయంలో నాయకత్వం

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అగ్రనాయకత్వం ముఖ్యమంత్రి అభ్యర్థి విషయంలో ప్రయోగాత్మకంగా ఓ వ్యూహాన్ని అమలు చేసి దారుణంగా విఫలమైంది. ఆ సమయానికి కేజ్రీవాల్ కొద్ది నెలలు మాత్రమే ముఖ్యమంత్రిగా పనిచేశారు. పైగా ఆ కొద్ది కాలంలో చాలీచాలని మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి రావడం, కేంద్రంతో తగాదాలతో పాలనపై తన ముద్ర ఇంకా వేయకపోగా, వివాదాలతోనే కాలం గడచిపోయింది. సివిల్ సర్వీసెస్‌లో ఐఆర్ఎస్ అధికారిగా పనిచేసి, మధ్యలోనే వదిలేసి రాజకీయాల్లోకి వచ్చిన కేజ్రీవాల్‌ను ఢీకొట్టేందుకు బీజేపీ సివిల్ సర్వీసెస్‌లో ఐపీఎస్ అధికారిగా పనిచేసి పదవీ విరమణ చేసిన కిరణ్ బేడీని ముఖ్యమంత్రిగా అభ్యర్థిగా ప్రకటించి బ్రహ్మాస్త్రం ప్రయోగించామనుకుంది. ఫైర్‌బ్రాండ్ లేడీ ఆఫీసర్‌గా అప్పటికే కిరణ్ బేడీకి ఉన్న క్రేజ్, బ్యూరోక్రాట్‌గా సుదీర్ఘానుభవం పనికొస్తాయని, నాటి కాంగ్రెస్ మాజీ ముఖ్యమంత్రి షీలాదీక్షిత్‌కు పోటీగా మహిళా ఓట్లను కూడా రాబట్టుకోవచ్చునని బీజేపీ నాయకత్వం వ్యూహాలు రచించింది. అయితే ఈ ఆలోచనను ప్రజలు ఎంతమేర ఆమోదించారన్నది పక్కనపెడితే పార్టీలోని నాయకత్వం మాత్రం అసలు ఆమోదించలేకపోయింది.

మొదటి నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న క్యాడర్, నాయకత్వం తమను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ బయటి వ్యక్తులను తీసుకొచ్చి ముఖ్యమంత్రి అభ్యర్థి అని ప్రకటించేసరికి తట్టుకోలేకపోయింది. దాంతో సహజంగానే సహాయ నిరాకరణ ఎదురై, అధినేతలు ఆశించిన ఫలితం రాకపోగా ఘోర పరాభవం చవిచూడాల్సి వచ్చింది. దీంతో ఈసారి సీఎం అభ్యర్థి ఎంపికపై కమలనాథులు మల్లగుల్లాలు పడుతున్నారు. గతానుభవాన్ని దృష్టిలో పెట్టుకుని కేజ్రీవాల్‌ను ఢీకొట్టే స్థాయి నేత కోసం అన్వేషిస్తున్నారు. పైగా పార్టీ నాయకత్వం మొత్తం ఆమోదించేలా ఆ నేత ఉండాలని కూడా భావిస్తున్నారు. ఈ క్రమంలో అన్వేషణ ఇంకా ఓ కొలిక్కి రాలేదు.



చేసిన తప్పే మళ్లీ మళ్లీ

గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల నుంచి మొదలుపెడితే ఇప్పటి వరకు జరిగిన ఏ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీ ప్రదర్శన ఏమాత్రం బాగోలేదు. గుజరాత్‌లో మోదీ పుణ్యమా అని చచ్చీచెడీ బయటపడ్డప్పటికీ, ఆ తర్వాత మధ్యభారతం పూర్తిగా చేజారిపోయింది. చత్తీస్‌ఘడ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో విస్పష్టమైన ఓటమిని చవిచూసిన పార్టీ, మధ్యప్రదేశ్‌లో శివరాజ్ సింగ్ చౌహాన్ ముఖం చూసి ప్రజలు గౌరవప్రదమైన ఓటమిని అందజేశారు. తాజాగా జరిగిన జార్ఖండ్ ఎన్నికల్లోనూ ఓటమిపాలైన తర్వాత అధినాయకత్వం ఆత్మ పరిశీలన ప్రారంభించింది. ఆర్టికల్ 370 రద్దు, త్రిపుల్ తలాఖ్ బిల్లు వంటి సాహసోపేతమైన నిర్ణయాలు రాష్ట్రాల్లో ఓట్లు కురిపించడం లేదని అర్థం చేసుకున్నారు. పౌరసత్వ (సవరణ) చట్టం, ఎన్ఆర్సీ వంటి వివాదాస్పద అంశాలకు దేశభక్తితో ఆమ్ ఆద్మీ పార్టీపై విమర్శలు ప్రారంభించారు. దేశ రాజధానిలో హింసను ప్రేరేపించినందుకు కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు జాతికి క్షమాపణ చెప్పాలని బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి ప్రకాష్ జవదేకర్ డిమాండ్ చేశారు. ఢిల్లీ ప్రజలను ఈ పార్టీలు రెచ్చగొట్టడంతో డిసెంబర్ 15న జరిగిన నిరసనల్లో హింస చెలరేగిందని వ్యాఖ్యానించారు. ఢిల్లీ వంటి ప్రశాంత నగరంలో పౌర చట్టంపై దుష్ప్రచారం చేయడంతో విద్వేష వాతావరణం నెలకొందని, హింసాత్మక ఘటనల్లో వాటిల్లిన ఆస్తి నష్టానికి కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలే బాధ్యత వహించాలని అన్నారు. వీటితో పాటు ఢిల్లీకి సంబంధించి ఆప్ ప్రభుత్వ మున్సిపాలిటీలకు నిధులు విడుదల చేయకుండా వివక్షపూరితంగా వ్యవహరించిందని, హామీల అమలులో కూడా విఫలమైందని కొన్ని విమర్శలు చేసినప్పటికీ, జాతీయాంశాలకే ఎక్కువ ప్రాధాన్యత లభించింది. ఫలితంగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ జాతీయాంశాలైన సీఏఏ, ఎన్నార్సీలే ప్రచారాంశాలుగా మారినట్టయింది.

Andhraprabha business 2020
బిజినెస్ BUSINESS

జీఎస్టీ జోష్



డిసెంబర్ వసూళ్లు రూ.1.03 లక్షల కోట్లు

- వరుసగా రెండో నెల లక్ష కోట్లకుపైగా
- దాఖలైన జీఎస్టీ రిటర్న్‌లు 81.21 లక్షలు
- దేశీయంగా పెరిగిన వినియోగం సుస్పష్టం
- అధికారిక డేటా వెల్లడి

న్యూఢిల్లీ: కొత్త సంవత్సరం మొదటి రోజున తీపి కబురు అందింది. డిసెంబర్ జీఎస్టీ వసూళ్లు ఆశాజనకంగా నమోదయ్యాయి. డిసెంబర్ జీఎస్టీ వసూళ్లు రూ.1.03 లక్షల కోట్లు వసూలయ్యాయి. 9 శాతం మేర పెరిగాయి. దేశీయంగా పెరిగిన కొనుగోళ్లు, వినియోగాన్ని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. నవం బర్ తర్వాత వరుసగా రెండో నెల డిసెంబర్‌లో కూడా జీఎస్టీ వసూళ్లు పెరిగాయి. గతేడాది ఇదే కాలానికి ఈ వసూళ్లు అత్యధికం. డిసెంబర్ 2018లో జీఎస్టీ వసూళ్లు రూ.97,492 కోట్లుగా ఉన్నాయి. నవంబర్ 2019 జీఎస్టీ వసూళ్లు రూ.1,03,492 కోట్లుగా ఉన్నాయి. గత నెల స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.1,03,184 కోట్లలో సీజీఎస్టీ రూ.19,962 కోట్లు, ఎస్‌జీఎస్టీ రూ.26,792 కోట్లు, ఐజీఎస్టీ రూ.48,099 కోట్లు(దిగుమతులపై వసూలైన రూ.21,295 కోట్లు కూడా కలిపి), సెస్ రూ.8,331 కోట్లు (దిగుమతులపై వసూలైన రూ.847 కోట్లు కూడా కలిపి) అని జీఎస్టీ అధికారిక ప్రకటన వెల్లడించింది. ఇదిలావుండగా డిసెం బర్‌లో దేశీయ లావాదేవీల నుంచి జీఎస్టీ ఆదాయం వృద్ధి గతేడాది ఇదే నెలతో పోల్చితే 16 శాతంగా ఉంది. ఇదిలా వుండగా ఈ ఏడాది చివరిసారిగా జులై నెల్లో జీఎస్టీ వసూళ్లు రూ.1 లక్ష కోట్లను దాటింది. డిసెంబర్ నెల జీఎస్టీ వసూళ్లు దేశీయంగా పెరిగిన వినియోగాన్ని స్పష్టం చేస్తున్నాయి. దిగుమతుల నుంచి ఏకీకృత వస్తు సేవల పన్ను(ఐజీఎస్టీ) విషయానికి వస్తే డిసెంబర్ 2019లో మొత్తం ఆదాయం గతేడాది ఇదే నెలతో పోల్చితే 9 శాతం వృద్ధి నమోదయిందని అధికారిక ప్రకటన పేర్కొంది. డిసెంబర్‌లో ఐజీఎస్టీ వస్తువుల దిగుమతిలో 10 శాతం క్షీణత ఉండగా నవంబర్‌లో 13 శాతంగా రుణాత్మక వృద్ధి నమోదయింది.డిసెంబర్ 31, 2019 నాటికి జీఎస్టీఆర్ 3బీ రిటర్నుల దాఖలు మొత్తం 81.21 లక్షలుగా ఉంది. ఐజీఎస్టీ నుంచి సీజీ ఎస్టీ రూ.21,814 కోట్లు, ఎస్‌జీ ఎస్టీ రూ.15,366 కోట్లుగా ఉంది. డిసెంబర్ 2019లో రెగ్యులర్ సెటిల్ మెంట్ తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాల రెవెన్యూలో సీజీ ఎస్టీ రూ.41,776 కోట్లు, ఎస్‌జీ ఎస్టీ రూ.42,158 కోట్లుగా ఉంది.



టార్గెట్ రూ.1 లక్ష కోట్లు

ఇదిలావుండగా ఈ ఆర్థిక సంవత్సరంలోని మిగతా నెలల్లో నెలకు రూ.1 లక్ష కోట్లకుపైగా జీఎస్టీ వసూళ్లు లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించుకుంది. ఈ విషయాన్ని పన్నుల శాఖ అధికారులు వెల్లడించారు. గత నెల్లో జరిగిన ఓ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ సెక్రటరీ అజయ్ భూషణ్ పాండే మాట్లాడుతూ.. లక్షల మేరకు పన్నులు వసూలయ్యేలా చర్యలను తీసుకోవాలని ప్రత్యక్ష, పరోక్ష పన్నుల అధికారులను ఆయన కోరారు. డిసెంబర్‌లో జీఎస్టీ వసూళ్ల పురోగతిపై డెలాయిట్ ఇండియా భాగస్వామి ఎంఎస్ మణి స్పందించారు. జీఎస్టీ వసూళ్లలో పురోభివృద్ధి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో మిగతా నెల్లల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగే అవకాశాలున్నాయి. ద్రవ్యలోటును నియంత్రణలో ఉంచాలంటే ఈ స్థాయిలో వసూళ్లు అవసరమని ఆయన వ్యాఖ్యానించారు. జీఎస్టీ వసూళ్లు పెరగడం, రానున్న నెలల్లో కొత్తగా రిటర్న్‌లు పెరగనుండడంతో జీఎస్టీ వసూళ్లలో క్రమంగా వృద్ధి నమోదయ్యే అవకాశాలున్నాయని ఆయన అంచనా వేశారు. వార్షికంగా జీఎస్టీ వసూళ్ల లక్ష్యాలను అందుకోవడానికి ఇది దోహదం చేస్తాయని ఆయన విశ్లేషించారు. ఇదిలావుండగా డిసెంబర్ 2019 జీఎస్టీ వసూళ్లలో అరుణాచల్ ప్రదేశ్ మంచి పురోగతిని సాధించింది. రెట్టింపు జీఎస్టీ వసూలైంది. గతేడాది 2018 డిసెంబర్‌లో జీఎస్టీ వసూళ్లు రూ.26 కోట్లు ఉండగా ఈ ఏడాది 2019 డిసెంబర్‌లో రూ.58 కోట్ల జీఎస్టీ వసూలైంది. ఆ తర్వాతి స్థానంలో నాగాలాండ్ 88 శాతం పెరుగు దల, మణిపూర్ 64 శాతం పెరుగుదల, మిజోరం 60 శాతం జీఎస్టీ వసూళ్లలో పురోగతి ఉంది. కేంద్రపాలిలత ప్రాంతం లక్షద్వీప్‌లో పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. జీఎస్టీ వసూళ్లలో 78 శాతం క్షీణత ఉంది. జీఎస్టీ వసూళ్లు కేవలం రూ.1 కోటి మాత్రమే నమోదయ్యాయి.



మాల్యా ఆస్తులపై బ్యాంకులకు అధికారం

- విక్రయించి రుణాలు రాబట్టుకోవచ్చు
- ఎస్‌బీఐ నేతృత్వంలోని కన్సార్టియానికి గ్రీన్‌సిగ్నల్
- ముంబై ప్రత్యేక కోర్ట్ ఆదేశాలు
- రూ.6 వేల కోట్లపైగా ఆస్తుల వేలానికి మార్గం సుగుమం
- అభ్యంతరాలపై అప్పీలుకు గడువు

న్యూఢిల్లీ: లండన్‌లో తలదాచుకుంటున్న రుణాల ఎగవేతదారుడు, వ్యాపారవేత్త విజయ్ మాల్యా ఆస్తులను విక్రయించడానికి మార్గంసుగుమం అయింది. రుణాలు ఇచ్చి నష్టపోయిన బ్యాంకులు తిరిగి నష్టాలను పూడ్చుకునేందుకు విజయ్ మాల్యాకు చెందిన ఆస్తులపై ఉన్న అటాచ్‌మెంట్(జప్తు)ను తొలగించింది. మాల్యా ఆస్తులను వినియోగించుకునే అధికారం ఎస్‌బీఐ నేతృత్వంలోని 15 బ్యాంకుల కన్సార్టియంకు అప్పగిస్తూ ముంబైలోని ప్రత్యేక న్యాయస్థానం బుధవారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కోర్ట్ పేర్కొన విజయ్ మాల్యా ఆస్తుల జాబితాలో యూనైటెడ్ బ్రెవరీస్ హోల్డింగ్స్ లిమిటెడ్(యూబీహెచ్‌ఎల్) వంటి సెక్యూరిటీస్, మాల్యాను నేరస్థుడిగా పేర్కొంటూ 2016లో మనీలాండరింగ్ చట్టాల కింద జప్తు చేసిన ఆస్తులను బ్యాంకులు వినియోగించుకోవచ్చని స్పష్టం చేసింది. ఎస్‌బీఐ నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్టియం ప్రత్యేక కోర్ట్‌లో ఇదివరకే పిటిషన్ దాఖలు చేసింది. తమ రుణాలను రాబట్టుకునేందుకు విజయ్ మాల్యాకు చెందిన ఆస్తులను వినియోగించుకునేందుకు అవకాశమివ్వాలంటూ కోరాయి. రూ.6 వేల కోట్ల విలువైన ఆస్తులను రుణాలుగా మార్చు కుంటామని కోర్టును కోరాయి. కన్సార్టియం తరపున సీనియర్ న్యాయవాది రాజీవ్ పాటిల్ వాదనలు వినిపించారు. మాల్యాకు చెందిన చరాస్థుల జప్తును కోర్ట్ తొలగించిందని ఆయన వివరించారు. అయితే జనవరి 18 వరకు ఆదేశాలపై కోర్ట్ స్టే విధించింది. కోర్ట్ ఆదేశాలపై అభ్యంతరం ఉన్న వ్యక్తులు బొంబే హైకోర్ట్‌లో అప్పీలు చేసుకోవచ్చని కోర్ట్ సూచించింది.



విజయ్ మాల్యా తరపున సీనియర్ న్యాయవాది అమిత్ దేశాయ్ వాదనలు వినిపించారు. మాల్యాకు చెందిన ఆస్తులపై ఉన్న జప్తును కోర్ట్ ఎత్తివేసింది. ఈ మేరకు కోర్ట్ ఆదేశాలు జారీ చేసిందని ఆయన వివరించారు. ఆస్తులను ఎస్‌బీఐ అప్పగించాలా లేదా కన్సార్టియంకు అప్పగించాలా అనే విషయం మాకు తెలియదు. మరింత స్పష్టత కోసం కోర్ట్ తీర్పు కాపీ కోసం ఎదురుచూస్తున్నామని ఆయన వివరించారు. ఇదిలావుండగా విజయ్ మాల్యా మనీలాండరింగ్ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. మార్చి 2016లో భారత్ నుంచి పారిపోయాడు. ప్రస్తుతం లండన్‌లో నివాసముంటున్నాడు.

ట్రాన్స్‌కోను మరింత ముందుకు తీసుకెళ్లాలి

సీఎండీ ప్రభాకర్ రావు



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత తక్కువ సమయంలోనే విద్యుత్ రంగం అద్భుతాలు సాధించిందని టీఎస్‌జెన్‌కో, టీఎస్ ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్ రావు అన్నారు. రాష్ట్రం అందరికీ ఆదర్శంగా నిలిచింది. విద్యుత్ లోటు నుంచి మిగులు విద్యుత్ రాష్ట్రంగా మారింది. ఈ విజయ అందరి సంకల్పన మరియు అందరి సహకారం వల్ల సాధ్యమైందని ఆయన ప్రశంసించారు. 24 గంటలు విద్యుత్ సరఫరా సాధించామన్నారు. బుధవారం తన కార్యాలయంలో సంచాలకులు, సిబ్బంది ఆయనకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. సిబ్బంది పని విషయంలో దృఢ సంకల్పం, పూర్తిసహకారం ఇవ్వాలని ఆయన కోరారు. సంస్థను ముందుకు తీసుకెళ్లా లని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఆర్ డైరెక్టర్ అశోక్ కుమార్, హెచ్‌ఆర్ డిప్యూటీ మేనేజర్ ఫైసద్దీన్ ఫిరోజ్, తదితరులు పాల్గొన్నారు.

నుమాయిష్‌లో 2500 స్టాళ్లు

హైదరాబాద్, (గోషా మమల్) ప్రభన్యూస్,: హైదరాబాద్ సంస్కృతిని నుమాయిస్ ప్రతిబింబిస్తుందని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో బుధవారం 80వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన(నుమాయిస్) ను హోంమంత్రితో పాటు మంత్రులు ఈటల రాజేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, నగర మేయర్ బొంతు రామ్మోహన్‌లు జ్యోతి వెలిగించి లాంఛనంగా ప్రారంభించారు. ప్రపంచంలోనే అతిపెద్దైన నుమాయిస్ ప్రతి సంవత్సరం భారీ స్థాయిలో జరుగుతుందని మహమూద్ అలీ అన్నారు. మంత్రి ఈటెల రాజేందర్ మాట్లాడుతూ హైదరాబాద్ నుమాయిస్‌కు గొప్పచరిత్ర ఉందన్నారు.గత సంవత్సరం ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదాన్ని గుణపాఠంగా తీసుకోని మళ్లీ ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా తీసుకున్న చర్యలను వివరించారు.మంత్రి తలసాని మాట్లాడుతూ సొసైటీ సభ్యులు చిత్తశుద్ధి, అంకితభావంతో పని చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర మైనార్టీ ఆర్థిక సంస్థ ఛైర్మన్ అక్బర్ హుస్సేన్, మాజీ విప్, ఎమ్మెల్సీ పి. సుధాకర్ రెడ్డి, ఎగ్జిబిషన్ సొసైటీ సెక్రటరీ డాక్టర్ బి. ప్రశా శంకర్, కోశాధికారి వినయ్ కుమార్, జాయిం ట్ సెక్రటరీ హనుమం తరా వు, శ్రీనివాస రావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు. నుమాయిష్ కోసం ఈసారి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. సీసీ కెమే రా లతో నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. స్టాళ్లలో సిలిండర్లు ఏర్పాటు చేయ కుం డా తనిఖీలు చేశారు.ఫిబ్రవరి 15 వరకూ నుమాయిష్ కొన సాగనుంది.



రాయితీలేని వంటగ్యాస్ ధర పెంపు

న్యూఢిల్లీ: రాయితీ లేని వంట గ్యాస్ ధరలు వరుసగా ఐదోసారి కూడా పెరిగాయి. సిలిండర్ ధరను రూ.19 మేర పెరిగింది. అంటే ప్రస్తుతం రూ.695 గా ఉన్న గ్యాస్ రూ.714కు పెరిగింది. ఈ మేరకు ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. దీంతో గత ఐదు నెలల్లో సబ్సిడీలేని వంట గ్యాస్ ఐదుసార్లు మొత్తం రూ.139.50 మేర పెరి గింది. అంతర్జా తీయ మార్కెట్లలో జెట్ ఇంధనం లేదా ఏవియేషన్ ట్రిబ్యు న్ ఫ్యూయెల్(ఏటీఎఫ్)ధరలు బుధవారం రూ.2.6 శాతం మేర పెరిగాయి.అంతర్జాతీయ మార్కెట్లలో పరిస్థితులు వంటగ్యాస్ ధర పెరుగుదలకు కారణమైంది. ఈ విషయాన్ని ప్రభుత్వరంగ రిటైలర్లు బుధవారం ప్రకటించారు. సెప్టెం బర్ తర్వాత సబ్సిడీలేని వంట గ్యాస్ ధర పెరగడం వరుసగా ఇది ఐదోసారి. ఐదు నెలల్లో రూ.139.50 మేర పెరిగింది. నెలకు ఒక గ్యాస్ చొప్పున 12 నెలలకు 12 గ్యాస్‌లను రూ.495.86 సబ్సిడీపై అందిస్తారు. ఈ పరిధి దాటిన గ్యాస్ తీసు కుంటే రాయితీ లేని జాబితా నుంచి పొందాల్సి ఉంటుంది. ఇదిలావుండగా మరో వైపు ముంబైలో కిరోసిన్ ధర లీటర్‌కు 26 పైసలు మేర పెరిగింది.

ఇక చౌకగా కేబుల్ ప్రసారాలు

- టారిఫ్‌ను సవరించిన ట్రాయ్
- పెరగనున్న ఉచిత చానెళ్ల సంఖ్య
- 100 చానళ్ల ధర రూ.130-160 మధ్యే..!
- కేబుల్ ఆపరేటర్లు కూడా ఆఫర్లు ప్రకటించొచ్చు
- కొత్త టారిఫ్‌పై జనవరి 20లోగా ప్రచారం చేయాలని ఆదేశాలు
- మార్చి 1 నుంచి అమలు



న్యూఢిల్లీ: దేశంలోని కేబుల్ టీవీ వినియోగదారులకు శుభవార్త. అతిత్వరలోనే మరిన్ని టీవీ చానెళ్లను తక్కువ ధరకు వీక్షించబోయే రోజులు సమీపిస్తున్నాయి. ఈ మేరకు టెలికం నియంత్రణ సంస్థ(ట్రాయ్) చర్యలు తీసుకుంది. ఈ మేరకు బుధవారం సరికొత్త టారిఫ్ ఆర్డర్‌ను వెబ్‌సైట్‌లో ప్రచురించింది. ట్రాయ్ తాజా ప్రకటన ప్రకారం.. ఉచితంగా ప్రసారం చేసే చానెళ్ల సంఖ్య పెరగనుంది. చానెళ్లకు చెల్లించాల్సిన ధరలు కూడా గణనీయంగా తగ్గనున్నాయి. ట్రాయ్ నిర్వచనం ప్రకారం ఉచిత చానెళ్ల సంఖ్యను పెంచింది. ఈ చానెళ్లు కేవలం రూ.130-200 మధ్యలోనే వీక్షించ వచ్చు. 100 ఉచిత చానెళ్లు అందించగలిగే కేబుల్ ఆపరేటర్లు నెలకు రూ.130 ధరను నిర్ణ యించవచ్చు. ధర పరిధి రూ.160 దాటడానికి వీల్లేదు. ఉచితంగా అం దించే చానెళ్లు ప్రాంతాల వారీగా మారవొచ్చు.

బ్రాడ్‌కాస్టర్లు అందిస్తున్న పే చానెళ్ల సంఖ్య కూడా పరిమితంగానే ఉండనుంది. ఒక చానెల్‌ను పే చానెల్ జాబితాలో చేర్చడానికి చెల్లించాల్సిన కనీస ధరను రూ.19 నుంచి రూ.12కు తగ్గించింది. దీనర్థం ఇప్పటి వరకూ ఉచితంగా చానెల్‌ను వీక్షించే అవకాశ మిచ్చిన బ్రాడ్‌కాస్టర్లు తమ చానెల్‌ను చెల్లించి వీక్షించే చానెళ్ల జాబితాలో చేర్చాలంటే ధరను రూ. 12కు మించి పెంచడానికి వీల్లేదు.టీవీ చానెళ్ల ధరల విషయంలో కూడా ట్రాయ్ పలు నిబం ధనలను పేర్కొంది. అందించే టీవీ చానెళ్ల జాబి తాలో పే చానెళ్ల ధర బ్రాడ్‌కాస్టర్లతో సమానంగా ఆపరేటర్లు కూడా ప్రమోషనల్ స్కీమ్‌లను ప్రవేశపెట్టవచ్చని వివరించింది. నెట్‌వర్క్ కనెక్షన్లలో డిస్కౌంట్లతోపాటు రిటైల్ ధరలను ఆఫర్లలో భాగంగా పేర్కొనవచ్చునని సూచించింది. లాంగ్ టర్మ్ ప్లాన్లలోనూ ఈ ఆఫర్లను పేర్కొనవచ్చునని వివరించింది. అయితే లాంగ్ టర్మ్ ఆఫర్లు 6 నెలలకు మించ కూడదని వివరించింది.

ఒకే ఇంట్లో ఒకటి మించి టీవీలకు కనెక్షన్ల విషయంలోనూ నిబం ధలను ట్రాయ్ సమీక్షించింది. ఒకే ఇంట్లో

రెండో టీవీకి ఎన్‌సీఎఫ్ చార్జీలు 40 శాతం కంటే మించడానికి వీల్లేదు. రెండు టీవీలకు వేర్వేరు చానెళ్లను కోరుకునే అవకాశం కూడా వినియోగదారులకు ఉంటుంది.


ట్రాయ్ తీసుకున్న ఈ నిర్ణయం మల్టీ సిస్టమ్ ఆపరేటర్లు, డీటీహెచ్ ఆపరేటర్లకు పెద్ద దెబ్బనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలావుండగా కొత్త టారిఫ్ విధానాన్ని బ్రాడ్‌కాస్టర్లు జనవరి 15 లోగా మల్టీ సిస్టమ్ ఆపరేటర్లు జనవరి 20లోగా ప్రచారం చేయాలని ట్రాయ్ సూచించింది. మార్చి 1 నుంచి ఈ టారిఫ్ అమల్లోకి రానుందని వెల్లడించింది. ఈ నిర్ణయం బ్రాడ్‌కాస్టర్స్, డిస్ట్రిబ్యూటర్స్‌పై ప్రభావం చూపించే అవకాశాలున్నాయి. కేబుల్ ధరల అంశంపై అభ్యంతరాలు, సూచనలను తెలియ జేయాలని కేబుల్ రంగ సభ్యు లతో ట్రాయ్ ఇప్పటికే రెండు సార్లు చర్చలు జరిపింది. ఆగస్టు, సెప్టెంబర్ 2019లో ఈ మేరకు చర్చలు జరిపింది. మొదటి టారిఫ్ ఆర్డర్ ప్రకారం వినియోగదా రుడు తనకు కావాల్సిన చానెళ్లను ఎంచుకుని చెల్లించాల్సి వచ్చింది. కానీ నిర్ణయం పెద్దగా ప్రయోజనం ఇవ్వలేదు. చానెళ్లు ధరలను పెంచాయి. అమలు విధానంలో పలు సమ స్యల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొనున్నారని ప్రస్తుత టారిఫ్ విధానం సరికాదని ట్రాయ్ పేర్కొంది.

TRAI
Telecom Regulatory Authority of India
(IS/ISO 9001-2008 Certified Organisation)

2020లో ప్రైవేటు ఉద్యోగాలు మస్త్

ప్రైవేటు రంగంలో కొత్తగా 7 లక్షల జాబ్స్

- మైహైరింగ్ క్లబ్ డాట్‌కామ్, సర్కారీ- నౌకరీ డాట్ ఇన్ఫో సర్వే అంచనా
- ఊతమివ్వనున్న సార్టప్‌లు
- జీతాల పెరుగుదల ఉండొచ్చని అంచనా



న్యూఢిల్లీ : కొత్త ఏడాది 2020లో వృద్ధి ఖాయమనే అంచనాలతో దేశీ య ప్రైవేటురంగం ఊపందుకునే అవకాశాలున్నాయి. కొత్తగా 7 లక్షల ఉద్యోగాల సృష్టి జరగనుందని మైహైరింగ్‌క్లబ్‌డాట్ కామ్, సర్కారీ-నౌకరీడాట్‌ఇన్ఫో ఎంప్లాయిమెంట్ ట్రెండ్ సర్వే(ఎంఎస్ఈటీఎస్) 2020 సర్వే పేర్కొంది. జీతాల పెరుగుదలలో 8 శాతం వృద్ధి ఉండొచ్చని అంచనా వేసింది. కంపెనీలు, సంస్థలు ఉద్యోగులను పెంచుకునేందుకు ప్రణాళికలతో సిద్ధంగా ఉన్నారు. 2020 క్యాలెండర్ ఇయర్‌లో కొత్తగా 7 లక్షల ఉద్యోగాల సృష్టి జరిగే అవకాశాలున్నాయి. ఉద్యోగాల సృష్టిలో స్టార్టప్‌లు ప్రధాన పాత్ర పోషిస్తాయి. ప్రతి రంగంలోనూ స్టార్టప్‌ల కారణంగా ఉద్యోగాల సృష్టి జరుగుతుందని మైహైరింగ్‌క్లబ్ డాట్‌కామ్, సర్కారీ- నౌకరీడాట్‌ఇన్ఫో సీఈవో రాజేష్ కుమార్ వెల్లడించారు. దేశంలోని 42 నగరాల్లోని 12 పారిశ్రామిక రంగాలకు చెందిన 4,278 కంపెనీల్లో ఈ సర్వేను నిర్వహించారు. బెంగళూరు, ముంబై, ఢిల్లీ, చెన్నై, కలకత్తా, హైద్రాబాద్, అహ్మదాబాద్, పుణే నగరాలు కొత్త ఉద్యోగాల సృష్టి విషయంలో ముందు వరుసలో ఉం టాయి. ఈ నగరాల్లోనే దాదాపు 5,14,90 ఉద్యోగాల కల్పన జరిగే అవకాశాలున్నాయి. మిగతా ఉద్యోగాలు ద్వితియ, తృతియ శ్రేణి నగరాల్లో సృష్టించడతాయి. మెట్రో నగరాలతో పోల్చితే ద్వితియ, తృతియ శ్రేణి నగరాల్లో మరిన్ని ఉద్యోగాలు పెరిగే అవకాశాలు కూడా ఉన్నాయి. కంపెనీలు తమ వ్యయాలను నియం త్రించుకునేందుకు ద్వితియ, తృతియ శ్రేణి నగరాల్లో కార్యకలాపాలను ప్రారంభిం చేందుకు ప్రాధాన్యత ఇవ్వడమే దీనికి కారణం. 2020లో సాంకేతిక లేదా టెక్నికల్ నైపుణ్యాలు చాలా ముఖ్యమని మైహై రింగ్‌క్లబ్‌డాట్‌కామ్, సర్కారీ-నౌకరీడాట్‌ఇన్ఫో సీఈవో రాజేష్ కుమార్ అంచనా వేశారు.

ఇదిలావుండగా 2019లో కొత్తగా 6.2 లక్షల ఉద్యోగాల సృష్టి జరిగే అవకాశం ఉందని మైహైరింగ్ క్లబ్‌డాట్‌కామ్, సర్కారీ-నౌకరీడాట్‌ఇన్ఫో అంచనా వేసింది.

అయితే 5.9 లక్షల కొత్త ఉద్యోగాలు ఏర్పడ్డా యని 2020లనో రిటైల్, ఈ-కామర్స్ రంగాల్లో ఉద్యో గాల సృష్టి ఎక్కువగా ఉంటుంది. ఈ రెండు రంగాల్లో 1,12,000 ఉద్యోగాల సృష్టిజరిగే అవకాశాలున్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో ఐటీ అండ్ ఐటీఈఎస్(1,05,500 ఉద్యోగాలు), ఎఫ్ఎంసీజీ(87,500), తయారీరంగం (68,700), బీఎఫ్ఎస్ఐ(59,700), హెల్త్‌కేర్ (98,300)గా ఉంటాయని సర్వే అంచనా వేసింది. 2020 సౌత్ జోన్‌లో ఉద్యోగాలు 2,15,400 ఏర్పడే అవకాశాలున్నాయి. నార్త్ జోన్ 1,95,700, వెస్ట్ 1,65,700, ఈస్ట్ 1,25,800 ఉద్యోగాలు అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. దేశవ్యాప్తంగా శాలరీలు, ఇంక్రిమెంట్లు సింగిల్ డిజిట్‌కే పరిమితవవుతాయి. ఇంక్రిమెంట్లు 8 శాతంగా నమోదవుతాయని సర్వే వెల్లడించింది.

బడ్జెట్ ఎదురుచూపులు

- మందగమనం నేపథ్యంలో ఫిబ్రవరి బడ్జెట్‌పై ఆసక్తి
- పన్ను మినహాయింపుపై ఆశలు
- పెద్దగా పన్ను వరాలు ఉండవంటూ విశ్లేషణలు



న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థ మందగమనంలో చిక్కుకుని బయటపడలేకపోతోంది. జీడీపీ వృద్ధి రేటు క్షీణిస్తోంది. గత 45 ఏళ్లలో ఎప్పుడూలేనంతగా నిరుద్యోగ సమస్య నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రప్రభుత్వం సెప్టెంబర్‌లో భారీ ఉద్దీపనలు ప్రకటించినప్పటికీ ఫలితం పెద్దగా కనపడలేదు. ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరిలో ప్రవేశపెట్టనున్న వార్షిక బడ్జెట్‌పైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ముఖ్యంగా పన్ను మినహాయింపు కోసం ఎదురుచూసేవారు బడ్జెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. 2019 జులై 5న ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ మందగమనాన్ని అధిగమించడానికి దోహదపడలేదనే విమర్శలు వ్యక్తమవుతున్న తరుణంలో ఫిబ్రవరిలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌కు ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఆర్థిక మందగమనం, కార్పొరేట్ పన్ను లో భారీ కోత నేపథ్యంలో ఉపశమనాలు భారీగా ఉండే అవకాశంలేదని అంచనా లున్నాయి. ఈ మేరకు విశ్లేషణలు వినిపిస్తున్నాయి. మొత్తానికి తదుపరి బడ్జెట్‌లో ప్రభుత్వం ఎలాంటి బడ్జెట్‌ను ప్రవేశపె ట్టనుందనే అంశం ఆసక్తిగా మారింది. సెప్టెంబర్‌లో మంత్రి సీతారామన్ అనూహ్యమైన నిర్ణయం తీసుకున్నారు. కార్పొరేటు పన్నును భారీగా తగ్గించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ భారీ ఉద్దీపనతో కేంద్ర ప్రభుత్వంపై రూ.1.45 లక్షల కోట్ల భారం పడింది. దీనికితోడు 2019లో జీఎస్టీ వసూళ్లు అనేకసార్లు నిరాశపరిచాయి. నవంబర్, డిసెంబర్ నెలల వసూళ్లు సంతృప్తికరంగా ఉన్నప్పటికీ మిగతా నెలల వసూళ్లు నిరాశపరిచాయి. హౌసింగ్, ఎలక్ట్రిక్ వెహికిల్, హోటల్ వసతులు, డైమండ్ జాబ్ వర్క్, ఔట్ డోర్ కేటరింగ్‌ల నుంచి వసూళ్లు తక్కువగా నమోదయ్యాయి. దేశీయంగా వినియోగం తగ్గడం కారణంగా ఈ వసూళ్లు తగ్గాయి. దీంతో లక్ష్యాలను చేరుకోవడం అసాధ్యంగా మారింది. మోడీ 2.0 ప్రభుత్వం ఇవ్వాలనుకుంటున్న ఉపశమనాలు 2020-21 బడ్జెట్‌లో ప్రస్ఫూతమయ్యే అవకాశాలున్నాయని సామాన్యులు లెక్కగడుతున్నారు.

ఆన్‌లైన్‌లో డిగ్రీ అడ్మిషన్లు

● వచ్చే విద్యా సంవత్సరం నుంచి నిర్వహణ ● ప్రతి యూనివర్సిటీలో డేటాబేస్ సెంటర్ ● ప్రతి కోర్సుపై స్టూడెంట్ ఫీడ్‌బ్యాక్ మెకానిజం ● రాష్ట్రంలో క్వాలిటీ అసెస్‌మెంట్ సెల్ ● ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. హేమచంద్రారెడ్డి



అమరావతి, ఆంధ్రప్రభ: వచ్చే విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ అడ్మిషన్లను ఆన్‌లైన్‌లో నిర్వహించబోతున్నామని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. కె. హేమచంద్రారెడ్డి తెలిపారు. ఇందుకోసం అన్ని కళాశాలల వెబ్‌సైట్‌ను లింక్ చేయబోతున్నామన్నారు. తాడేపల్లిలోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. డిగ్రీ కోర్సుల్లో హాజరు శాతాన్ని పెంచడానికి, విద్యలో నాణ్యతా ప్రమాణాలు పెంచడానికి, ఎన్ఈబీ నిబంధనలను కచ్చితంగా పాటించడానికి ఈ నిర్ణయాలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రంలోని కళాశాలలన్నీ ఆయా జిల్లాల్లోని యూనివర్సిటీలకు అఫ్లియేషన్ పొందడాన్ని తప్పనిసరి చేస్తున్నట్లు తెలిపారు. అఫ్లియేషన్ లేని కళాశాలలపై చర్యలు తీసుకుంటామని, గుర్తింపు పొందని కళాశాలలు తప్పనిసరిగి గుర్తింపు పొందాల్సి ఉంటుందని అన్నారు. గుర్తింపు లేని కళాశాలల్లో చేరే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని చెప్పారు. అలాగే అక్రిడిటేషన్ లేకపోతే సదరు కళాశాలలు మూసుకోక తప్పదని సూచించారు. రాష్ట్రంలో ఆరు లక్షల డిగ్రీ సీట్లుంటే.. సగం కూడా నిండటం లేదన్నారు. ఇకపై 25 శాతం కన్నా తక్కువ సీట్లు భర్తీ అయ్యే కళాశాలలను నిలిపివేయాలని సూచించబోతున్నామని చెప్పారు. డిగ్రీ అడ్మిషన్లు తీసుకుని హాజరు కాని వారిపై పర్యవేక్షణ ఉంచేందుకు డైలీ అటెండెన్స్ మానిటరింగ్ పెట్టబోతున్నామని ప్రొ. హేమచంద్రారెడ్డి తెలిపారు.

నైపుణ్యాల కోసమే.. నాలుగో ఏడాది

మూడేళ్ల డిగ్రీని నాలుగేళ్లుగా మార్చి.. ఆనర్స్ డిగ్రీగా విద్యార్థులకు అందించనున్నారు. ఈ మేరకు ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కూడా ప్రకటన చేసిన విషయం తెలిసిందే. మూడేళ్ల డిగ్రీలు అందుకుంటున్న విద్యార్థులు ఉద్యోగ, ఉపాధిలో వెనుకబడిపోతున్నారు. ఈ నేపథ్యంలో మూడేళ్ల డిగ్రీ పూర్తయిన వెంటనే.. కొనసాగింపుగా ఇంటర్న్‌షిప్‌ను తీసుకురాబోతున్నామని ప్రొ. హేమచంద్రారెడ్డి వివరించారు. నాలుగో ఏడాదిని పూర్తిగా స్కిల్ డెవలప్‌మెంట్ కోసం కేటాయించబోతున్నామన్నారు. అగ్రికల్చర్, సెరికల్చర్, హార్టికల్చర్, ఎకనామిక్స్, కామర్స్ ఇలా ఎంచుకున్న కోర్సు ఏదైనా.. నాలుగో ఏడాదిలో ఆ కోర్సుకు సంబంధించి ఇంటర్న్‌షిప్ అందించడం ద్వారా అభ్యర్థులు డిగ్రీ పట్టా పొందగానే నేరుగా ఉద్యోగాలు పొందగలిగేలా తీర్చిదిద్దే ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఆయన వివరించారు. ఇందుకోసం ఆయా యూనివర్సిటీల పరిధిలోని పరిశ్రమలు, కంపెనీలతో ఎంవోయూలు కుదుర్చుకుంటామని చెప్పారు. ఒకవేళ వాటిలో సంబంధిత కోర్సులు లేకపోతే.. రాష్ట్రంలో ఇప్పటికే ఏర్పాటు చేస్తున్న 25 స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లలో శిక్షణనిప్పిస్తామని తెలిపారు. 2021 నుంచి స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను అమలు చేయబోతున్నామని ఆయన చెప్పారు. నాలుగేళ్ల డిగ్రీ కోసం యూజీసీకి లేఖ రాశామన్నారు.

ఉద్యోగాల కోసం.. బీఎస్సీలో ఇంజనీరింగ్

ఇంటర్మీడియట్ తర్వాత విద్యార్థులందరూ ఇంజనీరింగ్‌పై ఆసక్తి కనబరచడం ఎక్కువగా కనిపిస్తుంటుంది. అయితే నాలుగేళ్ల బీఎస్సీ ఇంజి నీరింగ్ ప్రవేశపెట్టడం ద్వారా ఉపాధి, ఉద్యోగావకాశాలు మెరుగవుతాయని ప్రొ. హేమచంద్రారెడ్డి తెలిపారు. ఇందుకోం ఇప్పటికే కరిక్యులమ్ సిద్ధం చేస్తున్నామన్నారు. బోధనపై అవగాహన కోసం ఫ్యాకల్టీకి రెండు నెలల శిక్షణ కార్యక్రమాలు నిర్వహిం చబోతున్నామన్నారు. అలాగే ప్రతి కోర్సు మీద స్టూడెంట ఫీడ్ బ్యాక్ కోసం ఒక మెకానిజానికి రూప కల్పన చేస్తున్నామని ఆయన తెలిపారు. విద్యార్థులు, టీచర్ల డేటాబేస్ రూపొందిస్తున్నామన్నారు. ఫీడ్‌బ్యాక్ ద్వారా ఆయా కోర్సుల్లో మార్పులు, ఫ్యాకల్టీలోని నైపుణ్యాలపై ఒక అంచనాకు రాగలుగుతామని తెలిపారు. సీఎంఐఎస్ వెబ్‌సైట్‌లో అడ్మిషన్లు, అందుబాటులో ఉండే ప్రోగ్రా మ్స్, ఫ్యాకల్టీ, ప్లేస్‌మెంట్స్ తదితర అన్ని వివరాలను పొందుప రుస్తామని వివరించారు. అలాగే ప్రతి యూనివర్సిటీలో ఒక డేటా బేస్ సెంటర్‌ను ఏర్పాటు చేసి అనుబంధ కళాశాలల్లోని అన్ని వివరాలను అందులో ఉంచుతామని తెలిపారు.

ప్రమాణాల పెంపు కోసం క్వాలిటీ అసెస్‌మెంట్

రాష్ట్రంలో క్వాలిటీ అసెస్‌మెంట్ సెల్‌ను ఏర్పాటు చేసి.. అన్ని కళాశాలల్లో ప్రమాణాలు పాటించేలా చూస్తామని ప్రొ. హేమచంద్రారెడ్డి తెలిపారు. జాతీయ స్థాయిలో నిర్దేశించిన అన్ని నిబంధనలు, ప్రమాణాలు కళాశాలలన్నీ కచ్చితంగా పాటించేలా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. ఒక్కో జిల్లాలోని అన్ని కళాశాలలకు ఒక్కో రోజు చొప్పున శిక్షణనివ్వబోతున్నామన్నారు. ఇప్పటికే కాకినాడ జేఎన్‌టీయూ పరిధిలో ఒక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. జిల్లాకు పదిమంది చొప్పున కళాశాలల సిబ్బందిని ఎంపిక చేసి న్యాక్ నిపుణులతో వారం రోజులపాటు శిక్షణనిప్పిస్తామనని తెలిపారు. తద్వారా జిల్లాలోని అన్ని కళాశాలలు ఒకే రీతిన ప్రమాణాలు పాటించేలా చూస్తామని చెప్పారు.

ఇది రైతు నామ సంవత్సరం


వ్యవసాయ మిషన్ ఉపాధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డి



అమరావతి, ఆంధ్రప్రభ : ఈ ఏడాది రైతు నామ సంవత్సరంగా రాష్ట్ర చరిత్రలో నిలవబోతోందని వ్యవసాయ మిషన్ ఉపాధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, ఇంతవరకూ దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేని విధంగా రాష్ట్ర బడ్జెట్‌లో 12.06 శాతం నిధులు కేటాయించిన ఏకైక ముఖ్యమంత్రిగా వైయస్ జగన్ మోహన్ రెడ్డి చిరస్థాయిగా నిలచిపోతారన్నారు. అంతేకాకుండా వ్యవసాయానికి ఉచిత విద్యుత్, వ్యవసాయ ట్రాక్టర్లకు రోడ్ టాక్స్ రద్దు, రైతు భరోసా వంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని రైతులకు అండగా నిలవడం జరిగిందన్నారు.రైతులకు ఉచిత విద్యుత్ అందించేందుకు రూ.1,700 కోట్లు కేటాయించారని, దానితో కలిపితే మొత్తం బడ్జెట్‌లో 13.4 శాతం నిధులు కేటాయించినట్లయిందన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకరూ. 28,866 కోట్లు బడ్జెట్‌లో వ్యవసాయానికి కేటాయించారని, ఇది గత ప్రభుత్వం కంటే రూ. 9,796 కోట్లు అధికమన్నారు. అంతేకాకుండా గతంలో పంటలకు భీమాను రైతులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కట్టేవారని, కానీ మొట్టమొదటి సారి రూ. 2,164 కోట్ల చెల్లించి 55 లక్షల మంది రైతు కుంటుంబాల తరపున 56 లక్షల హెక్టార్లలోని పంటలకు ఇన్సూరెన్స్ కల్పించడం జరిగిందన్నారు. అలాగే ఉచిత పశువుల భీమా కూడా అమలు చేస్తున్నామన్నారు. రైతు భరోసా కింద మరో కిస్తీ చెల్లించేందుకు రూ. 30 కోట్లు చెల్లించేందుకు సన్నద్ధమౌతోందన్నారు. ఇక అత్యంత కీలకంగా కౌలుదారు చట్టాన్ని తీసుకురావడం జరిగిందని గుర్తుచేశారు. ప్రస్తుతం ఉన్న వారి కంటే అధికంగా కౌలు రైతులను ఈ పథకం కిందకు తీసుకొచ్చే ఏర్పాట్లు జరుగు తున్నాయన్నారు. రైతుల భూములు తమ ఆధీనంలో ఉన్నప్పటికీ ఆన్‌లైన్‌లో వేరే వారి పేర్లు చూపిస్తుండటంతో రైతులు తీవ్రమైన మానసిక సంఘర్షణకులోనై ఆత్మహత్యలకు పాల్పడ్డారని, వాటి నివారణకోసం భూమి యాజమాన్య హక్కుల చట్టాన్ని తీసుకురావడం జరిగిందని, దీని ద్వారా రైతుకు భరోసా కల్పించినట్లయిందని చెప్పారు. గిట్టుబాటు ధరల్లేక నష్టాలతో అప్పులపాలైన అన్నదాలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపడుతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆత్మహత్యలు చేసుకున్న రైతన్నల్లో 546 మందికి పరిహారం చెల్లించలేదని, వారికి తమ ప్రభుత్వం పెద్దమనసు చేసుకుని చెల్లించే ప్రక్రియకు సిద్ధమౌతోం దన్నారు. అలాగే అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం కోసం ధరల స్థిరీకరణ నిధిని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నష్టపోతే ఆదుకునేందుకు ప్రకృతి విపత్తుల నిధిని, చిరు ధాన్యాలకు బోర్డు, ఆరటి పరిశోధనా కేంద్రం ఏర్పాటు, గ్రామ సచివాలయాల్లో వ్యవసాయ అధికారుల నియామకం, శీతల గిడ్డంగుల నిర్మాణం, ఎరువులు, పురుగు మందులు, ఇత్తనాల కు పరిశోధనా కేంద్రాలు, భూసార పరీక్షల నిర్వహణ ఇలా అన్నింటా రైతుకు వెన్నుదన్నుగా నిలచేందుకు ఒక రైతు బిడ్డగా ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పట్టుదలతో పనిచేస్తున్నారన్నారు. అందుకే 2020 కూడా రైతు నామ సంవత్సరంగా నిలవబోతోందన్నారు.

చౌకబారు రాజకీయాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయకండి

వైసీపీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు



అమరావతి, ఆంధ్రప్రభ: తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు తన చౌకబారు రాజకీయ ఎత్తుగడలతో లేని సమస్యలను సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వైకాపా ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు అన్నారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్టును పవన్ కళ్యాణ్ చదువుతున్నారని ఎద్దేవ చేశారు. కానీ, వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రానికి అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో తీసుకురావడం కోసం తామంతా కష్టపడి పనిచేస్తున్నామన్నారు. గ్రామస్థాయిలోని పార్టీ కార్యకర్తలతో సహ నిరంతరం పనిచేస్తూ ప్రభుత్వ ఫలాలను ప్రజలకు అందించేందుకు కృషిచేస్తున్నామన్నారు. రాష్ట్ర విభజన జరిగినప్పుడు రూ. 26వేల కోట్ల మేర లోటు బడ్జెట్ ఉన్న మాట వాస్తవమా కాదా అని ఆయన చంద్రబాబును, పవన్ కళ్యాణ్‌ను సూటిగా ప్రశ్నించార. రూ.2.26 వేల కోట్ల లోటు పూడ్చటం కోసం కేంద్రప్రభుత్వం నుంచి చంద్రబాబు ఎన్ని కోట్ల రూపాయలు తీసుకువచ్చారు అని నిలదీశారు. అవి తీసుకురాలేదు సరికదా.. వాటికి అదనంగా మరో 2.50 లక్షల కోట్ల రూపాయల అప్పులను ఆంధ్రరాష్ట్రప్రజల నెత్తిన వేశారన్నారు. ఈ రూ. 2.50 లక్షల కోట్ల అప్పులతో అమరావతి రాజదాని నిర్మాణం కోసం కేవలం ఐదువేల కోట్ల రూపాయాలు మాత్రమే ఖర్చు పెట్టారన్నారు. గ్రాఫిక్ జిమ్మిక్కులతో ఐకానిక్ టవర్స్‌లలో ఒక్క ఫ్లోర్‌నైనా నిర్మించలేకపోవడం దారుణమన్నారు. చంద్రబాబు మాయమాటలు నమ్మి 33వేల ఎకరాలు ఇచ్చిన రైతులకు ప్లాట్లను తిరిగి ఎందుకివ్వలేదని నిలదీశారు.

ఐదేళ్లలో ఆంధ్రరాష్ట్ర ప్రజానీకం ఆత్మగౌరవాన్ని పదే పదే తాకట్టు పెట్టారన్నారు. అంతటితో ఆగకుండా వారి హంగు హార్బాటాలకోసం ఆర్ధిక వ్యవస్థను సర్వనాశనం చేశారన్నారు. పదేళ్లు ఉండాల్సిన హైదరాబాద్ నుంచి ఒకటిన్నర సంవత్సరంలోనే తట్టాబుట్టా సర్దుకుని వచ్చి రాష్ట్రాన్ని, ఆర్ధిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని మండిపడ్డారు. చంద్రబాబు అమరావతిపై ఈ వల్లమాలిన ప్రేమను చూపించే క్రమంలో అమరావతిలో సొంత ఇంటి నిర్మాణాన్ని ఎందుకు చూసుకోలేకపోయారో చంద్రబాబు చెప్పాలన్నారు. అమరావతి నిర్మాణానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రాధమికంగా వ్యతిరేకంగా కాకపోయినా తాము పూర్తిగా దానికి మద్దతు పలికిన సందర్భంలో జగన్ తన స్వగృహాన్ని తాడేపల్లిలో నిర్మించుకున్నారన్నారు. చంద్రబాబు కాపురం ఎక్కడుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎందుకు ఆయన భార్య, కోడలు ఇక్కడ ఉండటం లేదని ప్రశ్నించారు. అప్పుల పాలైన రాష్ట్రాన్ని ఎలా బయటకు తీసుకురావాలని ముఖ్యమంత్రి విశ్వప్రయత్నం చేస్తున్నారన్నారు ఈ పరిస్థితుల్లో కుట్రరాజకీయాలు, అబద్దాలను ఆపేయమని సలహాఇచ్చారు. పూర్తి సౌకర్యాలు కలిగిన ఇంటికి సంబంధించి ప్లాట్లను కొంటే చదరపు అడుగుకు రూ. 5వేలతో మంచి ప్లాట్ కొనచ్చన్నారు. గత ప్రభుత్వం అసెంబ్లీ, సచివాలయంను నిర్మించడం కోసం చదరపు అడుగుకోసం రూ.10వేలను ఖర్చు పెట్టారన్నారు. ఆ నాడు భూములు ఇవ్వని రైతులకు అండగా నిలబడ్డానని చెబుతున్న పవన్ కల్యాణ్ నేడేమో ఇక్కడ నుంచి రాజధాని తరలిపోతుందని టిడిపి చేస్తున్న ప్రచారంకు మద్దతుగా రాజధాని ప్రాంతంలో పర్యటిస్తున్నారన్నారు. బాగా నటించగలుగుతారనే నమ్మకం ప్రజలకు వచ్చిందని, కాబట్టి ఆ నటించే రంగంలోకి వెళ్లి మంచి విజయాలు సాధించుకోవాలని సలహా ఇచ్చారు. స్వయంగా ప్రధాని వచ్చి ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు అవినీతిపరుడు, దొంగ, పోలవరంను ఏటిఎంలా వాడుకున్నాడని, కాంట్రాక్టర్లను మార్చి కమీషన్లు దండుకున్నారని చెప్పారన్నారు. ఇవన్నీ గాలికొదిలేసి కన్నా లక్ష్మీనారాయణ దీక్ష చేస్తున్నారన్నారు. జివిఎల్ మాత్రం రాజధాని నిర్మాణం జరగలేదని, అక్కడ అంతా మోసం జరిగిందని, తామిచ్చిన డబ్బులను దోచుకున్నారని ఆరోపిస్తున్నారన్నారు. కన్నా లక్ష్మినారాయణకు ఇక్కడి పరిస్థితులు తెలియవని జివిఎల్‌కి చెబుతున్నారన్నారు.కాని ఆయనకేమి తెలియదని చెప్పి కన్నా మాట్లాడతారని మండిపడ్డారు. అమరావతి ప్రాంత రైతులకు ఎటువంటి అన్యాయం జరగదని స్పష్టం చేశారు. రెచ్చగొట్టేవారి మాటలు నమ్మవద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సింహగిరిపై భక్తజన సందోహం

● నూతన సంవత్సరం సందర్భంగా భక్తులు రద్దీ ● మహా లఘుదర్శనం ఏర్పాటు చేసిన ఆలయ వర్గాలు



సింహాచలం (విశాఖపట్నం),ప్రభన్యూస్ బ్యూరో: నూతన సంవత్సరం సందర్భంగా సింహాచలం శ్రీ వరాహా లక్ష్మీనృసింహస్వామి ఆలయం భక్తులతో రద్దీగా మారింది. కొత్త సంవత్సరంలో స్వామిని దర్శించుకుంటే భక్తులు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలుతో కలకాలం చల్లగా ఉంటారన్నది అప్పన్న భక్తుల అపార నమ్మకం. దీంతో తెల్లవారు జాము నుంచి స్వామిని దర్శించుకోవడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి. ఇదే సమయంలో విఐపిలు భారీగానే తరలివచ్చారు. అయితే అందరికి సకాలంలో స్వామి దర్శనం కల్పించాలని సాదారణ భక్తులకు మహా లఘు దర్శనం ఏర్పాటు చేశారు. వీలైనంత తొందరగా స్వామి దర్శనం భాగ్యం భక్తులకు కల్పించారు. ఆలయంలో కప్పస్థంభంతో పాటు అన్ని విభాగాలు వద్ద రద్దీ కనిపించింది. లక్ష్మీనారాయణస్వామి ఆలయం, లక్ష్మీదేవి ఆలయం, సింహవల్లీ తాయారు సన్నిధి, కొండ దిగువన వెంకటేశ్వరస్వామి ఆలయం కూడా భక్తులతో సందడిగా కనిపించాయి. స్వామి దర్శనం చేసుకున్న భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు. స్వామిని దర్శించుకున్న వారిలో పలువురు ప్రముఖులతో పాటు అన్ని ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు కూడా ఉన్నారు. మంత్రి అవంతి శ్రీనివాసరావు దంపతులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మంత్రి , ఉత్తర నియోజకవర్గ ఎంఎల్ఏ గంటా శ్రీనివాసరావు కూడా అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఇవో ఎం.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఆలయ ఏఇవో పులి రాంబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గవర్నర్‌కు సీఎం నూతన సంవత్సర శుభాకాంక్షలు

అమరావతి, ఆంధ్రప్రభః రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్‌కు ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు బుధవారం ఉదయం ఆయన ఫోన్ ద్వారా గవర్నర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాదిలో అంతా మంచే జరగాలని ఆకాంక్షించారు. కాగా, గురువారం సాయంత్రం 4 గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో సీఎం జగన్ భేటీ కానున్నారు.

ట్రాన్స్‌టాయ్ తప్పు చేయలేదు

● రోజువారి పనులు సీఈవో శ్రీధర్‌దే బాధ్యత ● యూనియన్ బ్యాంక్ ఆడిట్ తప్పుల తడక ● సీబీఐ కేసుపై మాజీ ఎంపీ రాయపాటి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ట్రాన్స్‌టాయ్ కంపెనీపై సీబీఐ కేసు నమోదు చేయడంపై మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు స్పందించారు. యూనియన్‌బ్యాంక్, సీబీఐలు తనపై తప్పుడు కేసులు పెట్టాయన్నారు. యూనియన్ బ్యాంక్ చేయించిన ఆడిట్ రిపోర్ట్ ఆధారంగా తనపై కేసులను నమోదు చేయడం జరిగిందని, అయితే ఆ రిపోర్ట్ అంతా తప్పుల మయంగా ఉందన్నారు. ట్రాన్స్‌టాయ్ సంస్థ అప్పుల్లో కూరుకుపోయిందని, ఇది వాస్తవమన్నారు. తాము సంస్థ నిధులు ఎక్కడా దారి మళ్ళలేదని, ఎక్కడికీ బదలీ చేయలేదన్నారు. గతంలో తన భార్య సంస్థ డైరెక్టర్‌గా ఉండేదని, ఆమె మరణించిన అనంతరం బ్యాలన్స్ షీట్లపై సంతకాలు చేశానని చెప్పారు.

ఈ కేసులతో తనకెలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ట్రాన్స్‌టాయ్ సంస్థను తాను ఏర్పాటు చేసిన మాట వాస్తవమేనని అన్నారు. కానీ రాజకీయాల కారణంగా ట్రాన్స్‌టాయ్ బాధ్యతలను సీఈవో చెరుకూరి శ్రీధర్ చూసేవారన్నారు. కంపెనీ ఏర్పాటు చేశాక 14 బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నామన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల నుంచి తప్పించడంతో భారీ నష్టాలకు గురైందన్నారు. ట్రాన్స్‌టాయ్ రోజువారి కార్యకలాపాలకు తనకేమాత్రం సంబంధం లేదన్నారు. బ్యాలన్స్ షీట్‌లపై మాత్రమే తాను సంతకాలు చేశానని అన్నారు. కంపెనీలో ఏం జరుగుతుందో తనకు తెలియదన్నారు. ట్రాన్స్‌టాయ్ ఎలాంటి తప్పు చేయలేదని తాను విశ్వసిస్తున్నానని అన్నారు. సీబీఐ కేసుకు పూర్తి బాధ్యత సీఈవో శ్రీధర్ బాధ్యులవుతారన్నారు.

అక్షరాస్యత టార్గెట్ 100 శాతం!

● గ్రామస్థాయి నుంచే ప్రారంభం ● ఇప్పటికే పలు చర్యలు చేపట్టిన టీఎస్ విద్యాశాఖ ● ప్రాథమిక స్థాయితోపాటు వయోజనుల్లోనూ పెంపునకు చర్యలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో 100 శాతం అక్షరాస్యత పెంపునకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇప్పటికే విద్య శాఖ పలు చర్యలు చేపట్టినప్పటికీ.. నూతన సంవత్సరం సందర్భంగా ఈ ఏడాది 2020లో చదవుకున్న వారిలో ప్రతి ఒక్కరూ మరో వ్యక్తికి విద్యను బోధించాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు సూచించారు. అలా చేయడం ద్వారా రాష్ట్రంలో అక్షరాస్యతను పెంచడానికి వీలవుతుందని అన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు నేటి(గురువారం) నుంచి ప్రారంభం అవుతున్న పల్లె ప్రగతిలో నిరక్ష్యరాస్యులైన వయోజనులను గుర్తించి వారికి చదవడం, రాయడం నేర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్‌కుమార్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. 2021లో జనాభా లెక్కలను సేకరిస్తున్నందున అప్పటి వరకు రాష్ట్రంలో అక్షరాస్యత శాతాన్ని పెంచేలా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగానే 2020లో ఈచ్ వన్.. టీచ్ వన్ అనే కార్యక్రమాన్ని అవలంభించాలని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాష్ట్ర అక్షరాస్యత 66.54 శాతం ఉంది. దేశసరాసరి అక్షరాస్యత 73 శాతం. దేశసరాసరి కంటే 6.46 శాతం తక్కువగా ఉంది. కాబట్టి దేశ సరాసరి అక్షరాస్యత కంటే రాష్ట్ర అక్షరాస్యత ఎక్కువగా ఉండటమే కాకుండా ఉన్నత విద్యలో ఇతర రాష్ట్రాలతో పోటీ పడుతున్నందున అక్షరా స్యతలో కూడా ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువగా ఉండాలని తగిన చర్యలు తీసుకుంటోంది.

94 శాతంతో కేరళ మొదటిస్థానం

2011లో చేపట్టిన జనాభా లెక్కల ప్రకారం దేశంలో కేరళ 94 శాతంతో మొదటిస్థానంలో ఉంది. లక్షదీవులు 91.85 శాతంతో 2వ స్థానంలో, మిజోరాం 91.33 శాతంతో 3వ స్థానంలో కొనసాగుతోంది. దేవ సరాసరి అక్షరాస్యత 73 శాతంగా కొనసాగుతోంది. దేశంలో బీహార్ రాష్ట్ర 61.80 శాతంతో చివరి స్థానంలో కొనసాగుతోంది. బీహార్ కంటే పైన 65.38 శాతంతో అరుణాచల్ ప్రదేశ్ కొనసాగుతుండగా రాజస్థాన్ 66.11 శాతంతో చివరి నుంచి 3వ స్థానంలో నిలిచింది. తెలంగాణ రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 66.54 శాతం అక్షరాస్యత ఉంది.

ఇప్పటికే పలు చర్యలు తీసుకున్న విద్య శాఖ

ఇప్పటికే విద్యశాఖ రాష్ట్రసరాసరి అక్షరాస్యతపెంపుకు పలు చర్యలు ప్రారంభించింది. అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం అయిన సెప్టెంబర్ 7 నుంచి రాష్ట్రంలో ఉన్న విద్యార్థులు వారి ఇంట్లో ఉన్న చదువురాని అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యలకు చదువు చెప్పాలని నిర్ణయించారు. ఇప్పటికే ఆ కార్యక్రమం ప్రారంభం అయింది. రాష్ట్రంలోని చాలా ప్రభుత్వ స్కూల్స్‌కు చెందిన విద్యార్థులు వారి ఇంట్లో ఉన్న చదువురాని అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యలకు చదువు చెప్పే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే 5 సంవత్సరాల లోపు పిల్లలందరూ బడిలో ఉండేలాగా బడిబాట కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం స్కూల్ ప్రారంభంలో చేపడుతున్నారు. అలాగే బడిఈడు పిల్లలు బడిబయట ఉంటే వారిని తిరిగి స్కూల్‌లో చేర్పించేలా చూడటం కోసం బడి బయట కార్యక్రమం పేరుతో పాఠశాల విద్య శాఖ అక్టోబర్, నవంబర్ నెలల్లో చేపడుతోంది. ఆ రెండు నెలల్లో బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని డిసెంబర్ నెలలో స్కూల్‌లో చేర్పించేపనిని చేపడుతున్నారు. ఇలా బడికి వెళ్లి మధ్యలో డ్రాపౌట్ అవుతున్న వారిని తిరిగి పాఠశాలలో చేర్పించే కార్యక్రమాన్ని చేపడుతున్నారు.

వయోజనులకు ప్రత్యేకంగా..


అలాగే చదువురాని వయోజనుల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వయోజన విద్యలో భాగంగా అడల్ట్ ఎడ్యుకేషన్ పేరుతో ప్రత్యేకంగా వారికి రాయడం, చదవడం నేర్పిస్తున్నారు. వయోజన విద్యలో భాగంగా రాష్ట్రంలో 2010 నుంచి 2018 మార్చి 31 వరకు కేంద్ర ప్రభుత్వ పథకమైన సాక్షరా భారత్ పేరుతో వయోజన విద్యలో అక్షరాస్యతను పెంపొందించడం కోసం చర్యలు తీసుకున్నారు. మార్చి 31, 2018తో సాక్షరా భారత్ ప్రోగ్రామ్ పూర్తయింది. అయితే అప్పటి నుంచి వయోజన విద్య కొనసాగడం లేదు. దీంతో ఆలోచించిన విద్య శాఖ విద్యార్థులతో వయోజన విద్యను కొనసాగించాలని నిర్ణయించి కొనసాగిస్తోంది. అయితే 2010 నుంచి 2018 మార్చి 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 68,71,319 మందికి వయోజన విద్యను అందించింది. వారికి నేషనల్ ఓపెన్ స్కూల్(ఎన్ఓఎస్) వారు ఉత్తీర్ణత పరీక్షను నిర్వహించగా వారిలో 47,26,423 మంది ఉత్తీర్ణులయ్యారు. అంటే వారికి రాయడం, చదవడం వస్తుందని వారిని అక్షరాస్యులుగా కేంద్ర ప్రభుత్వం గుర్తించనుంది.

తక్కువ అక్షరాస్యత ఉన్న జిల్లాలపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో తక్కువ అక్షరాస్యత శాతం ఉన్న జిల్లాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలోని జోగలాంబ గద్వాల జిల్లాలో అతి తక్కువగా 49.87 శాతం అక్షరాస్యత ఉంది. తరువాత స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లా 54.38 శాతం వనపర్తి జిల్లా 55.67 శాతంతో ఉంది. రాష్ట్రంలో 83.25 శాతంతో హైదరాబాద్ జిల్లా మొదటిస్థానంలో ఉండగా మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా 82.48 శాతంతో రెండోస్థానంలో కొనసాగుతోంది. 76.17 శాతంతో వరంగల్ అర్బన్ జిల్లా ఉండగా 71.88 శాతంతో రంగారెడ్డి జిల్లా నాలుగో స్థానంలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో తక్కువ అక్షరాస్యత ఉన్న జిల్లాల్లో అక్షరాస్యతను పెంచడం కోసం ప్రత్యేకంగా అన్ని శాఖలు తగిన ప్రాధాన్యతతో పనిచేయాలని సర్కార్ భావిస్తోంది. ఈ జిల్లాల్లో పల్లెప్రగతిలో ప్రధానంగా ఇదే అంశంపై దృష్టిపెట్టనున్నారు. 2021లో జరిగే జనాభా లెక్కలసేకరణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర అక్షరాస్యత దేశ సరాసరి అక్షరాస్యతను అధిగమించి ఇతర కొన్ని రాష్ట్రా ల కంటే ముందుండేలాగా రాష్ట్ర సర్కార్ చర్యలు తీసుకుంటోంది.

తాను కన్నుమూసి...

అవయవదానంతో తొమ్మిది మందిని బతికించిన చరితారెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: అమెరికాలోని మిచిగన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్ అయిన హైదరాబాద్‌కు చెందిన చరితారెడ్డి (25) మృతి చెందారు. మిచిగన్‌లోని లాన్‌సింగ్‌లో నివాసం ఉంటున్న చరితారెడ్డి గత నెల 27 న కారు ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్‌కు గురవగా మరో ముగ్గురు కూడా గాయపడ్డ విషయం తెలిసిందే. సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తున్న చరితారెడ్డి తోటి మిత్రులతో కలిసి టయోటా కామ్రీ కారులో ప్రయాణిస్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. కారులో వెనక సీట్లో కూర్చున్న చరితారెడ్డి తీవ్రంగా గాయపడి బ్రెయిన్‌డెడ్‌కు గురైంది. వెంటనే ఆమెను ముస్కేగాన్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు బ్రెయిన్‌డెడ్ అయిందని తెలిపారు. ఆ తర్వాత చికిత్స పొందుతూ మరణించారు. చరితారెడ్డి కారును ఢీకొట్టిన వాహనం డ్రైవర్ మద్యం సేవించినట్లు నిర్ధారించారు.ప్రమాద ఘటన తెలిసిన వెంటనే చరితారెడ్డి కుటుంబసభ్యులు మిచిగాన్‌కు వెళ్ళారు. చరితారెడ్డి మృతదేహాన్ని హైదరాబాద్‌కు తీసుకువచ్చేందుకు ప్రవాసీయులు దాదాపు 50 వేల డాలర్ల సహాయాన్ని అందించారు.

తొమ్మిది మందికి అవయవదానం

చరితారెడ్డి మృతి చెందినా తొమ్మిది మంది జీవితాల్లో వెలుగులు నింపారు. మిచిగన్‌లోని యూనివర్సిటీలో చేరిన సమయంలోనే చరితారెడ్డి తన అవయవాలను దానం చేశారు. దీంతో ఆమె మృతి చెందిన వెంటనే అక్కడి వైద్యులు ఆమె శరీరంలోని కిడ్నీలు, లివర్, హార్ట్‌వేవ్స్, కళ్ళు తీసి అవసరం ఉన్న వారికి అందించారు. ఈ విషయాన్ని అక్కడి వైద్యులు అధికారికంగా ప్రకటించారు.



రాజ్‌భవన్‌లో
న్యూ ఇయర్ వేడుకలు

• గవర్నర్ ఆశీస్సులు తీసుకున్న చిన్నారులు

అమరావతి, ఆంధ్రప్రభ: నూతన సంవత్సర ఆగమన శుభవేళ రాష్ట్ర అభివృద్ధి పథంలో ముందడుగు వేయాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ఆకాంక్షించారు. అభివృద్ధిలో అగ్రగామి రాష్ట్రంగా వెలుగొందాలని, ప్రతి ఇంటా శుఖశాంతులు వెల్లివిరియాలని అభిలషించారు. విజయవాడ రాజ్ భవన్‌లో నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. స్నేహపూర్వక వాతావరణంలో ఉన్నతాధికారులు, ప్రముఖులు, పెద్దలు, చిన్నారులు రాష్ట్రప్రథమ పౌరునికి తమ శుభాకాంక్షలను అందించారు. గవర్నర్ కార్యదర్శి ముఖేస్ కుమార్ మీనా ఈ కార్యక్రమాన్ని అధ్యక్షత వహించారు. తొలుత శ్రీ దుర్గామల్లేశ్వర దేవస్దానం పండితులు వేద మంత్రోచ్చారణ నడుమ గవర్నర్ దంపతులను ఆశీర్వదించారు. ఆలయ పురోహితులతో పాటు దేవాదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్‌లు పాల్గొని గవర్నర్‌కి అమ్మవారి తీర్ధ ప్రసాదాలు అందచేసారు. రాజ్ భవన్ అదికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఓపెన్ హౌస్ కార్యక్రమంలో గవర్నర్ హరిచందన్‌ను అమాత్యులు, సామాన్య ప్రజలు, పౌర సమాజ ప్రతినిధులు, సీనియర్ అధికారులు కలుసుకుని వారితో ఆహ్లాదకరమైన సమయాన్ని పంచుకున్నారు. ప్రత్యేక అవసరాల పిల్లల కేంద్రం నుండి చిన్నారులు, అనాధ గృహాల పిల్లలు గవర్నర్‌ను కలుసుకుని ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్ధానం నుండి వచ్చిన వేద పండితులు గవర్నర్ దంపతులను ఆశీర్వదించగా, టిటిడి దేవస్ధానం నుండి వచ్చిన వేద పండితులు గవర్నర్ దంపతులను ఆశీర్వదించగా, టిటిడి ఛైర్మన్ సుబ్బారెడ్డి స్వామి వారి ప్రసాందను అందించారు. అనంతరం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో రవాణా, సమాచార శాఖ మంత్రి పేర్ని నాని గవర్నర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో స్ధానిక శాసన సభ్యుడు మల్లాది విష్ణు, డిజిపి గౌతమ్ సావాంగ్, పోలీసు కమిషనర్ ద్వరకా తిరుమలరావు, నీరబ్ కుమార్ ప్రసాద్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ కారికల్ వలవన్, స్టాంపులు, రిజిస్ట్రేషన్స్ శాఖ కమీషనర్ సిద్దార్ధజైన్, గృహ నిర్మాణ శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్, జిఎడి కార్యదర్శి శశి భూషణ్ కుమార్, ప్రోటోకాల్ డైరెక్టర్ కిషోర్‌కుమార్, చేనేత జౌళి శాఖ సంచాలకులు హిమాన్షుశుక్లా, సమాచార కమీషనర్లు బివి రమణ కుమార్, జిల్లా కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, సంయుక్త కలెక్టర్ మాధవి లత, విజయవాడ నగర పాలక సంస్ధ కమిషనర్ ప్రసన్న వెంకటేష్, రాష్ట్ర రెడ్ క్రాస్ ఛైర్మన్ శ్రీధర్ రెడ్డి, కృష్ణా జిల్లా ఛైర్మన్ డాక్టర్ సమరం, గవర్నర్ సంయుక్త కార్యదర్శులు అర్జున్ రావు, నాగమణి, పలువురు ప్రముఖులు గవర్నర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గవర్నర్‌కు డీజీపీ శుభాకాంక్షలు

గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌కు డిజిపి గౌతమ్ సవాంగ్ కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడ లోని రాజ్‌భవన్‌కు బుధవారం వెళ్లిన డిజిపి సవాంగ్ గవర్నర్‌కు మొక్కను ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

అవినీతి తిమింగలాల నుంచి
కోట్ల ఆస్తులు స్వాధీనం

• 96 ట్రాప్ కేసుల నమోదు
• రెవెన్యూలోనే ఎక్కువ అవినీతి
• వెల్లడించిన ఏసీబీ డీజీ కుమార విశ్వజిత్

అమరావతి ఆంధ్రప్రభ: అవినీతి నిరోధకశాఖ (ఏసిబి) రాష్ట్రంలోని లంచావతారాలపై గత ఏడాది విరుచుకు పడింది. ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించిన అవినీతి తిమింగలాల నుంచి కోట్లాది రూపాయల విలువైన ఆస్తులను ఏసిబి స్వాధీనం చేసుకుంది. ప్రభుత్వ శాఖల్లో ముఖ్యంగా రెవెన్యూలో అవినీతి మేటలు వేసింది. రెవెన్యూలో 36 కేసులు అత్యధికంగా నమోదు కాగా ఆ తర్వాతి స్ధానంలో హోంశాఖ నిలిచింది. హోంశాఖలో 11 కేసులు నమోదు అయ్యాయి. గత ఏడాది మొత్తం 96 ట్రాప్ కేసులు నమోదు చేశామని, ఇందుకు సంబంధించి 85.37 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామని, అనేక కేసుల్లో అవినీతి అధికారులకు జైలుశిక్షలు పడ్డాయని ఏసిబి డిజి కుమార విశ్వజిత్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కేసుల వివరాలను ఆయన బుధవారం వెల్లడించారు. విశాఖపట్టణంలో సహకార శాఖ అధికారి బోయిన మోషా లంచంగా 40 లక్షల విలువైన స్ధలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకోవడం, కర్నూలు జిల్లా గూడూరు తహసీల్‌దారు హసీనాబీ రెవెన్యూ క్లియరెన్స్ కు నాలుగు లక్షలు లంచం తీసుకుంటు ఏసిబికి దొరికారు. పార్వతీపురం మునిసిపాలిటీ ఆర్ఐ పతిరెడ్డి శంకర ఆస్తిపన్ను తగ్గించేందుకు గాను 2లక్షల 80వేలు లంచం తీసుకున్నాడు. నంద్యాల సబ్ డివిజన్ ఏఇ రాజశేఖర్ కాంట్రాక్టర్ నుంచి రెండు లక్షలు, ఉరవకొండలో సీనియర్



అసిస్టెంట్ శంకర్ భూమికి సంబంధించిన పత్రాలకు గాను రెండు లక్షలు లంచం తీసుకుని అరెస్టయ్యాడు. లక్ష రూపాయలు లంచం తీసుకుంటు బాపట్ల తహసీల్దార్ రాఘవయ్యను అరెస్టు చేశారు. విశాఖలో ఆర్ఐ హరగోపాల్, బిల్ కలెక్టర్ మహేష్ లక్ష లంచం సొమ్ముతో దొరికారు. మచిలీపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ సిఇఒ రంగబాబు ప్రింటర్ నుంచి లక్ష తీసుకుంటు అధికారులకు పట్టుబడ్డాడు.20 లక్షల బిల్లులు మంజూరు చేసేందుకు గాను గుంటూరు జిల్లా కో ఆర్డినేటర్ ప్రసన్నకుమార్ లక్ష లంచం తీసుకుంటు అరెస్టయ్యాడు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో కర్నూలు ఎంవిఐ అక్కిరాజు శివప్రసాద్, అనంతపురం పిఆర్ ఏఇఇ సురేష్‌రెడ్డి, టూరిజం ఎస్టేట్ ఆఫీసర్ రాచూరి శివరావు, నాగార్జున వర్శిటీ సీనియర్ అసిస్టెంట్ జవ్వాజి శ్రీనివాసరావు, తెలుగుగంగ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మన్నం లక్ష్మీనరసింహం, ధవళేశ్వరం ఎస్ఇ నల్లం కృష్ణారావు, కర్నూలు జిల్లా దేవాలయాల ఇఒ చిరంజీవి రామ్‌ప్రసాద్, కడప వాణిజ్య పన్నులశాఖ డిప్యూటీ కమిషనర్ జాగంటి లార్దయ్య, రాజమండ్రి ఎఎస్ఐ సత్యనారాయణ చౌదరి, అనకాపల్లి ఏడి జి శివాజీ అరెస్టయ్యారు.

ట్రాప్ కేసుల్లో 33 మందికి, ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో ముగ్గురికి శిక్షలు విధించారు. మొత్తం 40 ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా లెక్కల్లో చూపని లక్షలాది రూపాయలను ఏసిబి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అవినీతిని సమూలంగా నిర్మూలించేందుకు గాను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్పందన, టోల్‌ఫ్రీ నెంబర్ల ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయని డిజి తెలిపారు. అవినీతి నిర్మూలనకు గాను ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు గాను అనేక కార్యక్రమాలు చేపట్టి కొనసాగిస్తున్నామని ఆయన తెలిపారు.

సీఎం జగన్‌కు
తితిదే అర్చకుల ఆశీర్వాదం



అమరావతి, ఆంధ్రప్రభ: నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డికి తిరుమల తిరుపతి దేవస్థాన అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. తాడేపల్లిలోని ఆయన నివాసంలో వేదపండితులు ఆశీర్వచనాలు ఇచ్చి శ్రీవారి తీర్ధప్రసాదాలు, శేష వస్త్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి మాట్లాడుతూ, ఈ ఆంగ్ల నామ సంవత్సరం అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని కోరుకుం టున్నట్లు చెప్పారు. తలపెట్టే ప్రతి కార్యక్రమానికి ఆ దేవుని చిత్తం ఉంటుందని, అందుకే మంచి మనసుతో. మంచి కార్యక్రమాలు చేపట్టి పదిమందికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, దేవాదాయ శాఖా మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి కానుకగా
రెండో విడత రైతు భరోసా

అమరావతి, ఆంధ్రప్రభ: 'పిఎం కిసాన్ వైఎస్ఆర్ రైతు భరోసా' రెండవ విడత నిధులను సంక్రాంతి కానుకగా అందచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 5300 కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులు లబ్దిదారులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నారు. ఈనెల 2 గురువారం నుంచి బ్యాంకు ఖాతాల్లో జమచేసే ప్రక్రియ ప్రారంభం కానున్నట్టు సమాచారం. వైఎస్ఆర్ రైతు భరోసా కింద ఏడాదికి 12500 రూపాయల ఆర్ధిక సాయాన్ని తొలుత ప్రకటించిన ప్రభుత్వం ఆ తరువాత పిఎం కిసాన్ సమ్మాన్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను కూడా కలిపి మొత్తం 13500 రూపాయలను అందించాలని నిర్ణయించింది. ఇప్పటికే తొలి విడత ఆర్ధిక సాయాన్ని అందించిన ప్రభుత్వం ఇపుడు రెండో విడతకు శ్రీకారం చుడుతోంది. తొలి విడత లబ్దిదారుల ఎంపికపైనా, ఆ తరువాత ఆర్ధిక సాయం జమపైనా చెప్పుకోదగ్గ ఫిర్యాదులేమీ రాకపోవటంతో రాష్ట్ర ప్రభుత్వం రెండవ విడత పంపిణీలోనూ అదే విధానాన్ని అనుసరిస్తోంది. సంక్రాంతి కానుకగా రైతు భరోసా అర్హుల జాబితాలో ఉన్న ప్రతి ఒక్కరికి రెండు వేల రూపాయలు జమ చేయనున్నట్టు వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి తెలిపారు.

ఎన్‌సీసీ డిప్యూటీ డీజీగా కృష్ణన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల ఎన్‌సీసీ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా టీఎస్ఎస్ కృష్ణన్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. 1991లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఫ్లైయింగ్ బ్రాంచ్‌లో విధులలో చేరిన కృష్ణన్ పలు విభాగాల్లో సమర్ధవంతంగా సేవలను అందించారు. ఢిల్లీలోని ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్‌గా పని చేశారు.

తిరుమలలో
సామాన్య భక్తులకే పెద్దపీట

• తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

అమరావతి, ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా కలకాలం కొనసాగాలని తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆకాంక్షించారు. బుధవారం ఆయన గవర్నర్‌ను బిశ్వభూషన్ హరిచందన్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా స్వామివారి నూతన క్యాలెండర్, ప్రసాదాలను అందజేసి వేదపండితులచే ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, తిరుమలలో సామాన్య భక్తులకే అధిక ప్రాధాన్యమిస్తామని స్పష్టంచేశారు. ప్రతి ఒక్కరికి త్వరితగతిన స్వామివారి దర్శన భాగ్యం కలిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. నూతన సంవత్సరంలో సకాలంలో వర్షాలు పడి దేశ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అలాగే వైకుంఠ ఏకాదని నుండి తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడికీ స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని ఉచితంగా అందించబోతున్నట్లు వెల్లడించారు. సంక్షేమ పథకాలతో సీఎం జగన్‌కు వస్తున్న జనాదరణను చూసి టీడీపీ ఓర్వలేకపోతోందన్నారు. అందుకే రైతుల పేరుతో రాజధాని డ్రామా ఆడుతోందని విమర్శించారు. అమరావతిలో బినామీ పేర్లతో కొన్న భూములకు విలువ పడిపోతుందన్న భయంతో కుట్ర



రాజకీయాలు చేస్తోందని సుబ్బారెడ్డి మండిపడ్డారు. రాష్ట్రాన్ని రెండు లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టిన ఘనుడు చంద్రబాబు అని ధ్వజమెత్తారు. ఆయన, ఆయన వంది మాగధులకు చెందిన తెదేపా భూములకోసం లక్ష కోట్లు పెట్టి అభివృద్ధి చేయాలా అని ప్రశ్నించారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి భావిస్తోంటే, ఒక్క ప్రాంతానికే పరిమితం చేయాలని ప్రయత్నిస్తున్నారన్నారు. రాష్ట్రంలో రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పెద్దపీట వేశారన్నారు. రాజధాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కచ్చితంగా న్యా యం చేస్తామన్నారు. కమిటీ నివేదిక వచ్చాక అందరికీ న్యాయం జరిగేలా నిర్ణయం ఉంటుందని వెల్లడించారు.

ప్రభుత్వ పథకాలకు
విస్తృత ప్రచారం చేయాలి

సమాచార కమిషనర్ విజయకుమార్‌రెడ్డి

అమరావతి, ఆంధ్రప్రభ: ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు విస్తృత ప్రచారం కలిపించి అర్హులకు చేరేలా కృషి చేయాలని రాష్ట్ర సమాచారశాఖ కమిషనర్ టి.విజయకుమార్ రెడ్డి ఉద్యోగులకు సూచించారు. తద్వారా రాష్ట్రం అభివృద్ధి పథంలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలన్నారు. ఆంగ్ల సంవత్సర ఆగమన వేడుకలు బుధవారం విజయవాడలోని ఎన్‌టిఆర్ పరిపాలనా భవనంలోని సమాచార శాఖ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. నూతన సంవత్సర కేకును విజయ కుమార్ రెడ్డి కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాల అమలులో భాగంగా బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన రెడ్డి పలు వినూత్న కార్యక్రమాలు చేడుతున్నట్లు తెలిపారు. వాటికి విస్తృత ప్రచారం కలిపించాల్సిన బాధ్యత సమాచారశాఖపై ఉందన్నారు. అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పని చేసినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కమిషనర్ కార్యాలయంలో డెప్యూటీడైరెక్టర్‌గా పని చేస్తూ జాయింట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న టి.కస్తూరి బాయికి కమిషనర్, అధికారులు, సిబ్బంది అభినందలు తెలిపారు. కార్యక్రమంలో సమాచారశాఖ అదనపు డైరెక్టర్ దాసరి శ్రీనివాస్, జాయింట్ డైరెక్టర్లు టి.కిరణ్‌కుమార్, ఎన్.వెంకటేష్, చీఫ్ ఇంజనీరు ఓ.మాధవరావు, ఆర్ఐఇ టి.కృష్ణారెడ్డి, అకౌంట్స్ అధికారి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో
చంద్రబాబు నాయుడు

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంగ్ల సంవత్సరం మొదటి రోజైన బుధవారం శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం భక్తులు, ప్రముఖులతో కిటకిటలాడింది. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పార్లమెంటు సభ్యులు కేశినేని శ్రీనివాస్(నాని), ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నతో కలిసి ఆలయానికి చేరుకున్న చంద్రబాబు నాయుడుకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత వేదపండితులు ఆశీర్వచనం అందజేయగా, కార్యనిర్వహణాధికారి ఎంవీ సురేష్‌బాబు శేషవస్త్రము, అమ్మవారి ప్రసాదములు, చిత్రపటం అందజేశారు.



వెలంపల్లి ప్రత్యేక పూజలు

రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు బుధవారమ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైకాపా నాయకులు దేవినేని అవినాష్‌తో కలిసి ఆలయానికి వచ్చిన ఆయనకు అధికారులు సాదరస్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేదపండితులు ఆశీర్వచనం అందజేయగా, కార్యనిర్వహణాధికారి ఎంవీ సురేష్‌బాబు శేషవస్త్రం, అమ్మవారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

సర్వేజనానాం... దేశ భవితవ్యం!

• తెలంగాణ విధానాలు, పథకాలపై నీతి ఆయోగ్ నేతృత్వంలో అధ్యయనం
• రాష్ట్ర పథకాలకిచ్చే ప్రత్యేక నిధులకు ఈ సర్వే కొలమానం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఏ కోణంలో చూసినా.. అభివృద్ధిలో అగ్రభాగాన నిలిచిన తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం ఆరా తీస్తోంది. ప్రజల నాడిని గుర్తించి, వారి అవసరాలు తీర్చడంలో, ఏళ్ళ తరబడి నానుతున్న సామాజిక సమస్యలను పరిష్కరించడంలో అనుసరిస్తున్న విధానంపై ఇప్పటికే ఓ ప్రత్యేక బృందాన్ని పంపి సర్వే చేసింది. అలాగే దేశంలోనే ప్రప్రథమంగా మొదలుపెట్టిన కొన్ని సంక్షేమ పథకాలు, జాతికి ఆదర్శంగా మారిన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్యేక నిధులు ఇవ్వాలన్న ప్రతిపాదనలపై వివరాలు సేకరించింది. అన్ని వర్గాల ప్రజల అవసరాలు తీర్చే క్రమంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ఫలితాలు, గరిష్ఠ కాల వ్యవధి, ప్రజాభిప్రాయం, అధికార యంత్రాంగం విధుల నిర్వహణ, ఖర్చు చేస్తున్న నిధులు, ప్రభుత్వానికి వచ్చే ఆదాయ, వ్యయాలపై సంక్షిప్త సమాచారాన్ని సేకరిస్తోంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అనతికాలంలోనే కొన్ని రంగాల్లో లక్ష్యాలను చేరుకోవడం, అందుకు అనుసరించిన వ్యూహంపైనా కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ దృష్టి కేంద్రీకరించింది.

ఐదు రంగాలపై దృష్టి

సమాజాన్ని ఆకట్టుకునే తాగునీరు, సాగునీరు, విద్య, వైద్యం, గృహ నిర్మాణ రంగాలకు ఇస్తున్న ప్రాధాన్యతలు గుర్తించి దేశవ్యాప్తంగా అమలుకు శ్రీకారం చుట్టాలన్న ఆలోచనతోనే ఈ సర్వే నిర్వహించినట్టు తెలుస్తోంది. తెలంగాణలో అమలు చేస్తున్న ప్రతి పథకంలోనూ పారదర్శక విధానాన్ని ప్రవేశపెట్టి ప్రభుత్వం విడుదలచేసే ప్రతిపైసా లబ్ధిదారుడికి చేరాలన్న ఆలోచన అత్యంత ప్రాముఖ్యతగల అంశంగా కేంద్రం గుర్తించింది. అయితే ఆ విధానానికిగల ఉద్దేశాలు, లక్ష్యాలు, అనుకూలించిన క్షేత్ర పరిస్థితులు, అధికారుల విధులు-నిధులపై ప్రభుత్వంలో ఆవిష్కరించిన వ్యవస్థ ఎలా ఉందన్న కోణంలో గత సంవత్సరం (2019)లోనే అధికారులు కొంత సమాచారాన్ని సమీకరించారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ ఏడాది (2020) మరో రెండు విడతలుగా కేంద్ర అధికారుల బృందాలు రాష్ట్రంలో పర్యటించ నున్నాయి. ఆర్థికపరమైన అంశాలపై ఒక బృందం, సామాజిక సమస్యలు, ప్రజల అవసరాలపై మరో బృందం, పథకాల రూపకల్పన, వాటి అమలుపై ఇంకో బృందం దశల వారీగా పర్యటించి తెలంగాణ సామాజిక, భౌగోళిక పరిస్థితులపై సంపూర్ణ అవగాహన కల్పించుకునే ప్రయత్నం చేయనున్నారు.

రంగంలోకి నీతిఆయోగ్

ప్రధానమంత్రి సూచనల మేరకు నీతి ఆయోగ్ నేతృత్వంలో ఈ సర్వే జరుగుతోంది. గతంలో ఉన్న సాంప్రదాయం మేరకు ఏ రాష్ట్రంలో సమాజానికి అత్యంత మేలు చేసే పథకం ప్రారంభించినా, కొన్ని తరాలకు ఉపయోగపడే ప్రాజెక్టులు మొదలుపెట్టినా వాటికి ప్రత్యేక నిధులిచ్చి కేంద్రం ప్రోత్సహిస్తుంది. కానీ గత కొన్నేళ్ళుగా ఈ కోణంలో రాష్ట్రానికి ఎలాంటి నిధులు అందలేదు. అత్యంత ప్రతిష్టాత్మకమైన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి అనేక పర్యాయాలు ప్రతిపాదనలు పంపినా, స్వయంగా ముఖ్యమంత్రి వెళ్ళి ప్రధాని, ఆర్థిక మంత్రులను కలిసి విజ్ఞప్తి చేసినా స్పెషల్ గ్రాంట్ విడుదల కాలేదు. అలాగే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక మొదటి మూడేళ్ళ పాలనలోనే ఆవిష్కరించిన అద్భుతమైన పథకాలు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయలకు నిధులు ఇవ్వాలన్న ప్రతిపాదన కూడా నేటికీ పెండింగ్‌లోనే ఉంది. ఇందుకు సంబంధించి రూ.24వేల కోట్లు ఇవ్వాలని నీతి ఆయోగ్ కేంద్రానికి సిఫారసు చేసినా.. ఫలితం దక్కలేదు. అయితే, ఈ అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకుని జాతికి ఆదర్శప్రాయంగా నిలిచిన పథకాలతో పాటు మెజారిటీ ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తున్న రైతుబంధు, రైతుబీమా, సామాజిక భద్రత పెన్షన్లు, పౌర సరఫరాల వ్యవస్థపై కేంద్రం



అధ్యయనం మొదలుపెట్టింది. ప్రజల మెప్పు పొందే పరిపాలనకు ప్రధాన కారణమవుతున్న ఈ సంక్షేమ కార్యక్రమాలు ఏ విధంగా అమలవుతున్నాయి, వాటికి నిధులను ఏ రూపంలో సమీకరిస్తున్నారనే అంశాలపై కేంద్ర బృందాలు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాయి.

ప్రధాని సారథ్యంలో ప్రత్యేక కమిటీ

ఈ కోణంలో సర్వేను పూర్తిచేసి నివేదిక ఇచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా అమలుకుగల అవకాశాలపై ప్రధాని నరేంద్రమోడీ నీతి ఆయోగ్ నేతృత్వంలో ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తారని కేంద్రవర్గాలు చెబుతున్నాయి. అలాగే రాష్ట్రం నుంచి స్పెషల్ గ్రాంట్ కోసం అందిన ప్రతిపాదనలన్నింటినీ ఈ కమిటీ పరిశీలించనుంది. ఏ పథకానికి ఎంత నిధులు ఇవ్వాలి, ఆ పథకం ప్రయోజనం గరిష్ఠ పరిమితి ఎంత అనే అంశాలపైనా కమిటీ నివేదిక ఇవ్వనుంది. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ తక్కువ సమయంలో విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి తదితర రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన విధానంపట్ల సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ అంశంపై ఇప్పటికే పూర్తయిన అధ్యయనానికి నీతి ఆయోగ్ గౌరవ సలహాదారు కార్తీ మురళీధరన్ నేతృత్వం వహించారు. 'సెంటర్ ఫర్ ఎఫెక్టివ్ గవర్నెన్స్ ఆఫ్ ఇండియన్ స్టేట్స్' అనే ప్రాతిపదికతో కేంద్రం మొదలుపెట్టిన కసరత్తుతో తెలంగాణ ఆదర్శం కావడం గర్వకారణమని ఇక్కడి ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. గత ఏడాది అక్టోబర్ 16న రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికశాఖ ఆధ్వర్యంలో మురళీధరన్ కమిటీ ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుని కీలక సమాచారం సేకరించింది. విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, ఉపాధి రంగాల్లో ఎన్ని పథకాలు ఉన్నాయి? వాటి పనితీరు ఎలా ఉంది? ప్రారంభం మొదలుకొని గరిష్టంగా ఎన్నేళ్ళలో ఫలితాలు సాధించారు? క్షేత్రస్థాయిలో వాటికున్న ప్రజాదరణ, అందుతున్న ఫలాలపై త్వరలో జరగనున్న సర్వేలో సమాచారాన్ని సేకరించను న్నారు. కార్తీ మురళీధరన్ నేతృత్వంలోని బృందం తన తొలి పర్యటనలో భాగంగా ఆర్థిక మంత్రి హరీష్‌రావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, పీఆర్‌సీ కమిషన్‌లతో పాటు ఆర్థికశాఖ ఉన్నతాధికారు లతో వేర్వేరుగా సమావేశమై వివరాలు సేకరించింది.

క్షేత్రస్థాయిలో కేంద్రబృందాల సర్వే

రాష్ట్రస్థాయిలో అధికార యంత్రాంగం ద్వారా సేకరించే సమాచారం తర్వాత క్షేత్రస్థాయి సర్వేకు కూడా కేంద్ర బృందాలు సిద్ధమవుతున్నా యి. ఒక్కో జిల్లాల్లో కొన్ని గ్రామాలను ఎంపికచేసి స్వయంగా ప్రజలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించనున్నారు. కొన్ని అభివృద్ధి పథకాలకు సంబంధించి గోప్యంగా ప్రజాభిప్రాయం సేకరించనున్నారు. ప్రత్యక్ష ఉపాధి కల్పిస్తున్న కొన్ని పథకాల్లో లబ్ధిదారులను గుర్తించి వారి అభిప్రాయాన్ని కూడా తెలుసుకోనున్నారు. కేజీ టు పీజీ విద్యా విధానంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం రికార్డు స్థాయిలో 550కిపైగా రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలను ఆవిష్కరించిన విషయాన్ని కూడా నీతి ఆయోగ్ తమ అజెండాలో పొందుపరిచింది. అయితే వీటి ద్వారా రాష్ట్రానికి జరుగుతున్న సామాజిక ప్రయోజనంపట్ల కూడా కేంద్ర బృందాల్లోని అధికారులు విద్యార్థులతో నేరుగా ముఖాముఖి కానున్నారు. పేద వర్గాలకు చెందిన పిల్లలకు పూర్తి ఉచితంగా నాణ్యమైన కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు ఇక్కడ నెలకొల్పిన గురుకుల పాఠశాలల వ్యవస్థను కూడా దేశవ్యాప్తంగా అమలుచేస్తే బాగుంటుందన్న కోణంలో ఈ సర్వే జరుగుతోంది.

ఆ పథకాలపై ఆసక్తి

ప్రభుత్వ వైద్య విధానాన్ని మెరుగుపరుస్తూ ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్, అమ్మ ఒడి పథకాల ద్వారా పొందుతున్న ప్రయోజనాన్ని కూడా కేంద్రం అంచనా వేస్తోంది. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా ఈ పథకాల ద్వారా ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నందున 60 శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరుగుతున్న విషయాన్ని మొదటి సర్వేలోనే గుర్తించారు. పేద వర్గాల్లోని మెజారిటీ ప్రజలకు సామాజిక భద్రతను కల్పిస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై కూడా కేంద్రం ఆరా తీస్తోంది. బాల్య వివాహాలు పూర్తిగా నిర్మూలించేందుక దోహదపడే ఈ తరహా పథకాలను జాతీయ స్థాయిలో అమలుచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చునన్న అభిప్రాయాన్ని ఇప్పటికే నీతిఆయోగ్ ధృవీకరించింది. ముఖ్యంగా బాలికలకు మెరుగైన విద్య, భద్రతను కల్పించే అంశంపై తెలంగాణలో అవలంబిస్తున్న విధానం ఆకర్షించింది. సెంటర్ ఫర్ ఎఫెక్టివ్ గవర్నెన్స్ సర్వేలో భాగంగా రాష్ట్ర ప్రణాళికశాఖ ఆధీనంలోని స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ కూడా కొంత స్వచ్ఛంద భాగస్వామ్యాన్ని పంచుకుంటోంది. రాష్ట్ర ప్రతిష్టను మరిన్ని రెట్లు పెంచేందుకు దోహదపడే ఈ సర్వేకు 33 జిల్లాల నుంచి సమాచారాన్ని సేకరించి ఇచ్చేందుకు అంగీకరించింది. ఆ దిశగా క్షేత్రస్థాయి సమాచారం సమీకరించి నివేదికలు అందించేందుకు గత ఏడాది డిసెంబర్‌లోనే ప్లానింగ్ సొసైటీ ఏజెన్సీలను ఆహ్వానించింది.

జననేత వరాలు!



(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమంలో చివరి విడత డబ్బులు చెల్లింపు, అదే రోజు నుండి ఇసుక డోర్ డెలివరీ కార్యక్రమాలను అమలు చేయనున్నారు. ఇక మూడో తేదీన కొత్త ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేయనున్నారు. 4 నుండి 9వ తేదీ వరకూ పాఠశాల రంగంలో తీసుకున్న విప్లవాత్మకమైన మార్పుల గురించి నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించనున్నారు. ఇక దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందిన వైయస్సార్ అమ్మ ఒడి కార్యక్రమాన్ని 9వ తేదీ ప్రారంభించనున్నారు. అలాగే నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన కోసం క్యాలెండర్ తయారు చేసేందుకు అన్ని శాఖల్లోని ఖాళీల వివరాలను సేకరిస్తున్నారు. ఇలా జనవరి నెల మొత్తం ప్రజలకు వరాల జల్లు కురిపించేలా ముఖ్యమంత్రి వైయస్ జగన్ తన కార్యాచరణను సిద్ధం చేసుకున్నారు. ఇది ఒకవైపు సిద్ధం చేసుకుంటూనే ఫిబ్రవరి నెలలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, నిధుల సేకరణ, అందుకు అవసరమైన ఏర్పాట్లను మరోవైపు సిద్ధం చేసుకుంటూ పరిపాలనలో వేగం పెంచుతున్నారు. తన వేగాన్ని అందుకునేలా అటు అధికారులను ఇటు మంత్రివర్గ సభ్యులను సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే రాజధాని అమరావతిపై జరుగుతున్న ఆందోళన నేపథ్యంలో జగన్ 'జన'వరాలతో ప్రతిపక్షాలు బెంబేలెత్తే పరిస్థితులు నెలకొన్నాయి. సగటు మానవుడికి అవసరమైన అన్ని కార్యక్రమాలను ఆయన దగ్గరుండి పర్యవేక్షించడం, వాటిని సక్రమంగా వారికి అందేలా అధికారులతో నిత్యం సమీక్షలు నిర్వహించడంతో పథకాలు విజయవంతం అవుతున్నాయి. ఇదే ప్రతిపక్షాల గొంతులో పచ్చి వెలక్కాయ పడేట్లు చేస్తోంది. ఈ సూత్రాన్ని గమనించిన సీఎం జగన్ ఆ దిశగా శరవేగంగా అడుగులేస్తూ ముందుకు సాగుతున్నారు.

జనవరి 1న ఆర్టీసి విలీనంతో ప్రారంభం

నూతన సంవత్సరం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీసీలో పనిచేస్తున్న 52 వేల మంది సిబ్బందికి ఉద్యోగ భద్రత లభించింది. ఈ నిర్ణయంతో కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా సీఎం జగన్ ఫోటోకు పాలాభిషేకాలు చేశారు. పార్టీలకతీతంగా, యూనియన్లతో సంబంధం లేకుండా ఇకపై తాము కూడా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సమాజంలో గౌరవించబడుతున్నామంటూ ఆనందం వ్యక్తం చేశారు.

నేడు రైతు భరోసా చివరి విడత చెల్లింపు

ఇదిలా ఉండగా రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైయస్సార్ రైతు భరోసా - కిసాన్ సమ్మాన్ పథకం కింద చివరి విడతగా చెల్లించాల్సిన రూ. 2 వేల మొత్తాన్ని ఆయనా లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేయనున్నారు. అక్టోబరు 15న ప్రారంభించిన ఈ పథకం ద్వారా ఒక్కో లబ్దిదారుడి ఖాతాలో రాష్ట్రప్రభుత్వానికి చెందిన రూ. 7,550, కేంద్రం నుండి వచ్చిన రూ. 4 వేలు కలిపి రూ. 11,500 జమ చేశారు. ఈ పథకం ద్వారా మొత్తం ఒక్కో లబ్దిదారుడికి రూ. 13,500లో ఇప్పటికే చెల్లించిన రూ. 11,500 పోను మిగిలిన రూ. 2 వేలను ఇప్పుడు చెల్లించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. దీనిద్వారా రాష్ట్రంలోని 46,50,628 కుటుంబాలకు లబ్ది చేకూరింది. దీనికితోడు తొలిసారిగా కౌలు రైతులకు కూడా రైతు భరోసా పథకాన్ని వర్తింపజేసి మరో 1.60 లక్షల కుటుంబాలకు ఆర్థిక చేయూతనిచ్చారు. పంట చేతికొచ్చే సమయంలో ఖర్చుల నిమిత్తం ఈ రూ. 2 వేలను రైతులకు అందించనున్నారు. అయితే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఒక పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సిద్ధమౌతున్నారు. జనవరి 3న లబ్దిదారుల జాబితాను ఆయా గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించనున్నారు. లబ్దిదారుల ఇళ్లకు వాలంటీర్లు వెళ్లి రసీదు తీసుకొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే ఖరీఫ్ నాటికి ఇదే పథకాన్ని వర్తింపజేసేందుకు అవసరమైన ఏర్పాట్లను ఇప్పటి నుండే తయారు చేస్తున్నారు.

ఇసుక డోర్ డెలివరి

2వ తేదీ నుండి రాష్ట్రంలో ఇసుకను డోర్ డెలివరీ చేయనున్నారు. మొదటిగా కృష్ణా జిల్లాలో ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్టు కింద తీసుకుని తరువాతి క్రమంలో అన్ని జిల్లాలకు వర్తింపజేయనున్నారు. 10వ తేదీన విశాఖ, పశ్చిమ గోదావరి, కడప జిల్లాల్లోనూ, 20న మిగిలిన అన్ని జిల్లాల్లోనూ ఈ డోర్ డెలివరీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇసుక ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ముచేసుకునే ఇసుకాసుర ఆట కట్టించేందుకు సీసీ కెమేరాలు, చెక్ పోస్టులను ఏర్పాటుచేసి అక్రమాలను కట్టడి చేస్తున్నారు. తక్కువ ధరకు లబ్దిదారుడుకు కావల్సిన మొత్తంలో నిర్ణీత సమయంలో ఇసుకను సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి. ఇందుకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని అన్ని నియోజకవర్గాల్లో ప్రారంభించనున్నారు.

రేపు ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణి

జనవరి 3న కొత్త ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేయనున్నారు. తొలి రోజున 1.5 లక్షల మందికి ఈ కార్డులను పండుగ వాతావరణంలో పంపిణీ చేయనున్నారు. ఫిబ్రవరి చివరి నాటికి 1.42 కోట్ల మందికి ఈ కార్డులను పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఇదే రోజున 2059 రోగాలకు విస్తరింపజేసిన ఆరోగ్య శ్రీ పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. అలాగే రాష్ట్రంలోని సబ్ సెంటర్ల నిర్మాణానికి జనవరి చివరి నాటికి టెండర్లు పిలవాలని నిర్ణయించారు. గ్రామాల మధ్యలోనే సబ్ సెంటర్లు ఉంటే ఆరోగ్య సేవలను ప్రజలకు మరింతగా అందజేయవచ్చని ప్రభుత్వం భావించిన మీదట ఈ పనులను సత్వరమే చేపట్టాలని నిర్ణయించింది.

4 నుండి 9 వరకూ నాడు-నేడుపై అవగాహన

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహించనున్న నాడు-నేడు కార్యక్రమానికి, అమ్మ ఒడి కార్యక్రమాలకు సంబంధించి ఈనెల 4వ తేదీ నుండి 9వ తేదీ వరకూ విస్తృతస్థాయిలో ప్రచారం కల్పించాలని నిర్ణయించారు. ముఖ్యంగా నాలుగు అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నారు. వీటిలో అమ్మ ఒడి, సంక్రాంతి తరువాత మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యమైన ఆహారం అందించేందుకు తీసుకుంటున్న చర్యలపైన, ఇంగ్లీషు బోధన, పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పన అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల విద్యా కమిటీలను కూడా భాగస్వామ్యం చేయనున్నారు.

9న అమ్మ ఒడి ప్రారంభం

దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందిన అమ్మ ఒడి కార్యక్రమాన్ని 9వ తేదీ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లల్ని పాఠశాలలకు పంపే ప్రతి తల్లి బ్యాంకు అకౌంట్లోకి రూ. 15 వేల వంతున జమ చేయనున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం ఈనెల 2న తుది జాబితాను ప్రదర్శించనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమానికి సంబంధించి ఒకటి నుండి ఇంటర్మీడియట్ వరకూ చదువుతున్న విద్యార్థులకు సంబంధించి 81,72,224 మంది విద్యార్థుల జాబితాలను పరిశీలించారు. వీరిలో 46,78,361 మంది తల్లులు దరఖాస్తు చేసుకోగా వారిలో 42,80,823 మంది తల్లులు అర్హులుగా తేలారు. రీ వెరిఫికేషన్‌లో మరో 3,97,538 మందికి సంబంధించిన దరఖాస్తులను పరిశీలిస్తున్నారు.

ఉద్యోగాల క్యాలెండర్

ఇటీవలే 1.40 లక్షల ఉద్యోగాలను భర్తీచేసిన రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ముందుకు సాగుతోంది. ప్రతి ఏడాది జనవరిలోనే ఉద్యోగాల క్యాలెండర్‌ను విడుదల చేస్తామని చెప్పిన మాటను నిజం చేస్తూ ఉద్యోగాల క్యాలెండర్ విడుదలకు రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే ఈ అంశంపై సీఎస్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి ఆయా శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను సేకరిస్తున్నారు. సంక్రాంతి తరువాత ఈ క్యాలెండర్‌ను విడుదల చేసేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది.

32 ఇసుక లారీలు సీజ్



- ఎటువంటి బిల్లులు లేకుండా లోడింగ్
- మామూళ్ల మత్తులో రెవెన్యూ, మైనింగ్, ఏపీఎండీసీ అధికారులు

రాజమహేంద్రవరం, ప్రభన్యూస్ : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అవినీతిని రూపుమాపేందుకు ఎన్ని సంస్కరణలు చేసినా దిగువ స్థాయి అధికారుల మామూళ్ల మత్తులో జోగడంతో ఆ సంస్కరణ ఫలాలు గోదాట్లో కలిసిపోతున్నాయి. దీనికి నిదర్శనమే రాజమహేంద్రవరం గోదావరి తీరంలోని ఇసుక మాఫియా తీరు తెన్నులు. ఇటు అధికారులు లంచావతారాలుగా మారినా స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఇసుక మాఫియా రెచ్చిపోతుంది. రాజమహేంద్రవరంలో జిల్లా కలెక్టర్ మురళీధర్ రెడ్డి అధికారులు సమావేశం నిర్వహించే



సమయంలోనే అక్రమంగా తరలిపోతున్న 32 ఇసు క లారీలను అధికారులు గుర్తించారంటే, కలెక్టర్ రాజమండ్రిలో లేని రోజుల్లో ఏ స్థాయిలో ఇసుక మాఫియా అక్రమాలు సాగిస్తున్నారో ఊహించుకోవచ్చు. ఇసుక మాఫియా పూర్తిగా రూపుమాపామని, ప్రభుత్వం ఏర్పాటుచేసిన స్టాక్ పాయింట్ వద్దే ఇసుక లభ్యం అవుతుందని ప్రకటించినప్పటికీ ఇసుక తవ్వే రేవు వద్దే అక్రమంగా ఇసుక రెవెన్యూ అధికారులు, ఎపి ఎండిసి అధికారులు సాక్షిగా తరలిపోతున్నా ఏదో మొక్కుబడిగా దాడులు, వాహనాలు సీజ్ చేయడం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్థాయి అధికారులు దీనిపై దృష్టిసారించకపోతే మళ్ళీ ఇసుక మాఫియాతో స్థానిక సంస్థల ఎన్నికల్లో మూల్యం చెల్లించకతప్పేట్టులేదని రాజకీయ నాయకులు భావిస్తున్నారు. వివరాల్లోకి వెళితే...

స్థానిక కోటిలింగాల ఘాట్ సమీపంలో ఉన్న 3వ నంబరు ఇసుక ర్యాంపులో ఎటువంటి లోడింగ్ పత్రాలు లేకుండా ఇసుక లోడ్ చేస్తున్నట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందాయి. దీంతో ఉన్నతాధికారులు దాడులు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. ఈ సమయంలో ఎటువంటి రికార్డులు లేకుండా అనధికారికంగా లోడ్ చేస్తున్న 32 లారీలను సీజ్‌చేసి సబ్‌కలెక్టర్ మహేష్‌కుమార్‌కు సమర్పించే నిమిత్తం వెంట తీసుకెళ్ళారు. నిత్యం నిఘా పెట్టాల్సిన రెవెన్యూ, మైనింగ్, ఎపీఎండిసి అధికారులు మాఫియాతో కలిసి అవినీతి చేయడంతో అక్రమ రవాణా పరిస్థితి నెలకొందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోజువారీ ఇటువంటి అక్రమ రవాణా జరుగుతున్నప్పటికీ ప్రజాప్రతినిధులు ఒత్తిడి కారణంగా మొక్కుబడి దాడులుగా మారిపోతున్నాయి. అక్రమ రవాణా చేస్తూ ఇసుక లారీలో దాడుల్లో దొరికితే ఆయా లారీలను లోడింగ్ చేసిన సొసైటీలు, సంబంధిత ర్యాంపుల్లో విధులు నిర్వహిస్తున్న మైనింగ్, ఎపీఎండిసి, రెవెన్యూ ఉద్యోగులపైనా, లారీ యజమాని, డ్రైవర్, క్లీనర్‌పైనా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కాని జిల్లాలో ఎక్కడా లేని విధంగా ధవళేశ్వరంలోని గాయత్రి, రాజమహేంద్రవరంలోని కోటిలింగాల ఘాట్ - 1,2,3 ఇసుక ర్యాంపుల్లో గతంలో పట్టుబడిన 8లారీల విషయంలో కూడా కేవలం లారీ యజమానులపై మొక్కుబడి కేసులు నమోదు చేసి అధికారులు చేతులు దులుపేసు కున్నారు.దీంతో ఇసుక మాఫియాకు భయం లేకుండా పోతుంది. దీనికి ప్రధాన కారణం లేకపోలేదు. ఎందుకంటే ఇసుకను తవ్వే బోట్స్ సొసైటీల నుండి లారీలు వరకు అన్నింటిలోనూ ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం ఉండటంతో ఇసుక మాఫియా తెరపైకి రాకుండా గుట్టుచప్పుడు కాకుండా జరుగుతుందనేది బహిరంగ రహస్యం. కేవలం ఒక లారీని సీజ్‌చేస్తేనే అధికారులు పాత్రికేయులు సమావేశం పెట్టి బహిర్గతం చేస్తారు. అటువంటిది 32 లారీలను సీజ్‌చేసినా ఎక్కడా బహిర్గతం చేయలేదంటే అటు రెవెన్యూ, ఇటు ఎంపిఎండిసి శాఖలతో పాటు పోలీసులు వ్యవహారశైలిపైనా పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇసుక ర్యాంపుల్లో పనిచేసే విఆర్‌వోలు, రెవెన్యూ అధికారులతో పాటు మైనింగ్, ఏపీఎండీసీ శాఖల చిరుద్యోగులు అనధికారికంగా తరలిపోతున్న ఇసుక లారీల వద్ద నుండి వేలాది రూపాయలు అనధికారికంగా వసూలు చేస్తున్నట్లు పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కోట్ల రూపాయలు వృధా

- తుప్పుపడుతున్న వాహనాలు
- నీరుగారిపోతున్న స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్
- పట్టించుకోని అధికారులు



కాకినాడ, ప్రభన్యూస్ : స్వచ్ఛభారత్ స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్, సంపూర్ణ పారిశుద్ధ్యం అమలు చేస్తున్న రాష్ట్రం, ఇలా పలు రకాల పేరిట ప్రజల సొమ్మును ప్రభుత్వాలు దుర్వినియోగం చేస్తున్నాయి. రంపచోడవరం నియోజవర్గంలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించకుండానే లక్షలాది రూపాయలు డ్రా చేసిన విషయం ఇటీవల వెలుగులోకి వచ్చింది. అది మరిచిపోకముందే మరో అవినీతి స్వచ్ఛత బయటపడింది. కోట్ల రూపాయల విలువచేసే వాహనాలు 13 జిల్లాల్లో కొనుగోలు చేసి మూలన పెట్టేసారు. జిల్లాలోనూ అదే పరిస్థితి .

జిల్లాలో 1072 గ్రామపంచాయతీలు, రెండు నగరపాలక సంస్థలు, 7 పురపాలక సంఘాలు ,రెండు నగర పంచాయతీలు ఉన్నాయి. ప్రతి చోట చెత్త సమస్య అధికంగా ఉంది. టన్నులకు టన్నులు చెత్త పెరిగిపోతోంది. డంపింగ్ యార్డుకు స్థలాలు లేవు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని పంచాయతీలలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ (చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం)లు నిర్మించారు.తడి చెత్త, పొడి చెత్త సేకరించి వీటిని ఆయా కేంద్రాలకు తరలించి బయో కంపోస్ట్ తయారు చేస్తారు. దీనికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. రసాయన ఎరువులు బదులు చెత్త నుంచి తయారు చేసిన ఎరువులు వినియోగిస్తే నాణ్యమైన మేలురకం ఉత్పత్తులు పండుతాయి. చెరకు, వరి, , మిరప, కాయగూరలు పంటలకు పండ్లు ,పూల మొక్కలకు ఎరువుగా వాడతారు. పైగా గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లాలో రూ 50 లక్షల పైగా వెచ్చించి మొక్కల పెంపకాన్ని చేపట్టింది. అయితే ఈ తడి చెత్త, పొడి చెత్త సేకరణ, వాటిని సంపద తయారీ కేంద్రాలకు తీసుకెళ్లేందుకు పంచాయితీలు, పురపాలక సంఘాలు వినియోగించేందుకు వీలుగా బ్యాటరీ తో తయారు చేసిన వాహనాలను కొనుగోలు చేశారు.

జిల్లాకు దాదాపు వందకుపైగా వాహనాలు వచ్చాయి. వీటిని పంపిణీ చేయకుండా మూలన పెట్టేసారు .వాస్తవానికి ఈ వాహనాలను ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరుపేద లబ్ధిదారులకు ఇచ్చి వారికి ఉపాధి కల్పించేందుకు ఈ వాహనాలు కొనుగోలు చేసారు. వాహనాల కొనుగోలులో అక్రమాలు జరిగాయని అప్పట్లో వార్తలు వచ్చాయి. అయినప్పటికీ వాహనాలు కొనడం, అవి జిల్లాకు చేరడం జరిగిపోయాయి. వాటిని ఆయా పంచాయితీలు, పురపాలక సంఘాలకు అప్పగించకుండా సామర్లకోట మండలం అచ్చంపేట సమీపంలోని ఓ ఖాళీ స్థలంలో వదిలేసారు. కనీసం వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోలేదు. ఎండకు ఎండి ,వానకు తడుస్తూ అవి తుప్పుపడుతున్నాయి. రాత్రి వేళల్లో కొందరు సంఘవిద్రోహశక్తులు, పేకాట రాయుళ్లు, వ్యభిచారులు ఈ వాహనాలు అడ్డుగా పెట్టుకుని తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు.

అసలు ఈ వాహనాలు కొనుగోలు చేశారు, వాటిని ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పంచాయతీలు, పురపాలక సంఘాలకు అప్పగించాలన్న ఆలోచన ఏ అధికారి కి రాలేదు. ఈ వాహనాలు ఉన్న విషయం జిల్లా పంచాయతీ కార్యాలయం, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఎస్సీ కార్పొరేషన్ అధికారుల దృష్టిలో కూడా లేకపోవడం విశేషం. జిల్లా కలెక్టర్ ఈ వాహనాలను ఆకస్మిక తనిఖీ చేసి ఎన్ని లక్షల రూపాయలు జిల్లాలో దుర్వినియోగం అయ్యాయి, వాటికి బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.

పండుగలకు ప్రత్యేక రైళ్లు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సంక్రాంతి పండుగకు సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణీకులకు ఇబ్బంది కలగకుండా...రద్దీని తట్టుకునేందుకు దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. కాకినాడకు 6, నర్సాపూర్ క ు 6 చొప్పున సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైళ్లను నడపుతున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే ప్రజా సంబంధాల అధికారి సీహెచ్. రాకేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్ నుంచి 07053 నంబరు రైలు... సికింద్రాబాద్ నుంచి 12న 22.45 గంటలకు బయలు దేరి మరుసటి రోజు కాకినాడ పట్టణానికి చేరుకుంటుంది. 16న 18.15 గంటలకు కాకినాడ నుంచి బయలుదేరి... మరుసటి రోజు ఉదయం సికింద్రాబాద్ చేరుకుంటుంది. అదేవిధంగా 17న సికింద్రాబాద్ నుంచి మరో రైలు కాకినాడకు బయలుదేరుతుంది. కాకినాడ, నర్సాపూర్ వెళ్లే ప్రత్యేక రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, గుంటూరు, విజయవాడ, గుడివాడ,కైకలూరు, ఆకివీడు, భీమవరం, తణుకు, నిడుదవోలు, రాజమండ్రి, సామర్లకోట, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతాయి.

అమరావతినే కొనసాగించాలి

- ఉత్తరాంధ్ర, రాయలసీమను అభివృద్ధి చేయండి
- సీఎంకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ



అమరావతి,ఆంధ్రప్రభ: ఏపీ రాజధానిగా అమరావతినే కొనసాగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె .రామకృష్ణ కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి బుధవారం లేఖ రాశారు. నూతన సంవత్సర ప్రారంభం రోజున ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినందుకు వారంత ఆనందంగా ఉన్నారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయడంపై ఆయనకు అభినందనలు తెలిపారు. అమరావతిరాజధాని ప్రాంత రైతులు జనవరి 1న కూడా దీక్షలు చేపట్టారన్నారు. ఈ అమరావతి రాజధాని అంశంపై నూతన సంవత్సర ప్రారంభం రోజున వేలాది మంది రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ విధంగా రైతులు ఘోషించడం రాష్ట్రానికి మంచిది కాదన్నారు. అమరావతి రాజధానిగా గత ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించినప్పుడు ప్రతిపక్షనేతగా ఉన్న మీరు కూడా అంగీకారం తెలిపారన్నారు. ఆ నాడు కమ్యూనిస్టులుగా ఉన్న తాము రాజధాని కోసం అన్ని వేల ఎకరాలు అవసరం లేదని చెప్పినప్పటికీ మీరు కూడా 30 వేల ఎకరాలు అవసరం అన్నారని గుర్తు చేశారు. రాజధాని కోసం అమరావతి ప్రాంతంలో ఇప్పటికే 9 వేల కోట్ల రూపాయలు వెచ్చించారన్నారు. ఇప్పుడు రాజధానిని మారుస్తామని ప్రకటించడంతో గందరగోళం ఏర్పడిందన్నారు. ఇది సరైన వైఖరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా ఆయా ప్రాంతాలను అభివృద్ధి పరచవలసిఉందన్నారు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాలకు సక్రమంగా సాగునీరు లేదన్నారు. త్రాగునీరు అందిస్తే ఆ ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ప్రకాశం జిల్లాలో రామాయపట్నం పోర్టు, దొనకొండలో ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటు చేయడం వల్ల వలసలు ఆపడానికి, ఆ ప్రాంత అభివృద్ధికి ఎంతో అవకాశం ఉందన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతంలో ప్రత్యేకించి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో వలసల నివారణకు పలు అభివృద్ధి కార్యక్రమాలపై కేంద్రీకరణ చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా అమరావతి ప్రాంత రైతులతో చర్చించి , వారి ఆందోళనలు విరమింపజేయాలన్నారు. అదేవిధంగా అమరావతిని రాజధానిగా కొనసాగించేందుకు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికోసం చేపట్టవలసిఇన అభివృద్ధి కార్యక్రమాల అంశాలపై చర్చించడానికి తక్షణమే అఖిలపక్షసమావేశం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

- 60 జన్మలెత్తినా జగన్ మంచి సీఎం కాలేడు
- అంధకారంలో మా బిడ్డల భవిష్యత్తు
- మళ్లీ మీరే సీఎం కావాలి
- చంద్రబాబు ఎదుట వాపోయిన రాజధాని వాసులు



ఒక్క ఛాన్స్ అంటూ...
రోడ్డుపాలు చేశారు

అమరావతి, ఆంధ్రప్రభ: ఒకే ఒక్క చాన్స్ ఇచ్చి ఆశీర్వదించండంటూ ఎన్నికల్లో అడిగి.. ఆపై గెలిచి తమను రోడ్డుపాలు చేశారంటూ ముఖ్యమంత్రి జగన్‌పై రాజధాని ప్రాంత మహిళలు, రైతులు, యువకులు మండిపడ్డారు. బుధవారం అమరావతిలో పర్యటించిన టీడీపీ అధినేత చంద్రబాబు ఎదుట వీరంతా తమ గోడును వెళ్లబోసుకున్నారు. రాజధాని ఉండగా.. మళ్లీ ఇన్ని కమిటీలు అవసరమా.. ఎందుకు ఇవన్నీ అంటూ ప్రశ్నించారు. 'నా బిడ్డను ఆశీర్వదించండ'ని ఊరూవాడా తిరిగిన వైఎస్ విజయమ్మ ఆయన కొడుక్కు చెప్పుకోలేదా? తోటి మహిళలను ఎందుకు రోడ్లపాలు చేసిందని ధ్వజమెత్తారు. ఒక్క చాన్స్ ఇవ్వమంది తమ జీవితాలతో చెలగాటమాడేందుకేనా అని ప్రశ్నించారు. సీఎం జగన్ వ్యవహారశైలి చూస్తుంటే.. మరో 60 జన్మలెత్తినా మంచి ముఖ్యమంత్రి కాలేడని అనిపిస్తోందన్నారు. కళ్లుండి కబోదుల్లా నేతలు మారారని ధ్వజమెత్తారు. మూడు రాజధానులు కాదు.. మా జీవితాలను మూడు ముక్కలు చేస్తున్నారంటూ తీవ్ర ఆవేదన వెలిబుచ్చారు. అమరావతిని దేశ రెండో రాజధానిగా చేయాలని అడిగే దమ్ము వైకాపాకు చెందిన 22 మంది ఎంపీలకు లేదా అని నిలదీశారు. ప్రాణసమానమైన భూమిని రాజధానికిస్తే ఇంత అన్యాయం చేస్తారా.. ఆనాడు నీ తండ్రి రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబు మీలా వ్యవహరించి ఉంటే.. హైదరాబాద్ అంత అభివృద్ధి చెందేదా అని ప్రశ్నించారు. అమెరికా సంబంధం కాదు.. అమరావతి సంబంధం కావాలని పెళ్లి సంబంధాలకు పోటీ పడేవారని, ఇప్పుడు పరిస్థితుల్లో పిల్లనిచ్చేవారే లేరని గోడు వెళ్లగక్కారు. ముఖ్యమంత్రి నిర్ణయాల వల్ల తమ బిడ్డల భవిష్యత్తు అంధకారమైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ మీరే ముఖ్యమంత్రి కావాలంటూ చంద్రబాబు వద్ద ఆకాంక్షించారు. సమన్యాయమంటూ చంద్రబాబు సొంత సామాజికవర్గాన్ని దూరం పెట్టారని అన్నారు. అటువంటిది ఇప్పుడు కులాలు, మతాల పేరుతో విడదీసేందుకు ప్రయత్నిస్తున్నారని మండి పడ్డారు. మా ప్రాంతంలో రాజధాని ఉండాలని తాము అడగలేదని, గ్రామ సభలు పెట్టి అడిగితే భూములిచ్చి సహకరించామని రైతులు, మహిళలు చెప్పుకొచ్చారు. ఇప్పుడిలా చేయడం అన్యాయమన్నారు. అందరి ఆవేదనను సానుకూలంగా విన్న టీడీపీ అధినేత చంద్రబాబు వారికి ధైర్యం చెప్పారు. ఉమ్మడి పోరాటంతో అమరావతిని పరిరక్షించుకుందామని పిలుపునిచ్చారు.

నేడు హైకోర్టుకు
'పంచాయతీ' నివేదిక!

- రిజర్వేషన్లపై కోర్టు ఆదేశాలపైనా అందరి ఆసక్తి
- 50 శాతం దాటడంతో ఆశావహుల్లో ఉత్కంఠత



అమరావతి,ఆంధ్రప్రభ: పంచాయితీ రిజర్వేషన్ల అంకం తుది దశకు చేరింది. 2011 జనాభా ప్రాతిపదికన ఎస్సీలకు 19.8 శాతం, బీసీలకు 34 శాతంతో పాటు ఎస్టీలకు 6.77 శాతం సీట్లను స్థానిక సంస్థల ఎన్నికల్లో కేటాయించడానికి ప్రభుత్వం సూత్రప్రాయ అంగీకారానికి వచ్చింది. దీనితో అధికార యంత్రాంగం 59.85 శాతం సీట్లను రిజర్వ్ కేటగిరీకి కేటాయించనున్నది. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు రాష్ట్రం ఒక యూనిట్‌గా తుది నివేదికలను అధికారులు సిద్ధం చేశారు. గురువారం ఉదయం ఈ నివేదికలను హైకోర్టుకు సమర్పించనున్నారు. ఇప్పటికే పంచాయితీ ఎన్నికల నిర్వహణ ఆలస్యానికి సంబంధించి కోర్టు జోక్యం చేసుకున్న నేపథ్యంలో గురువారం ప్రభుత్వం సమర్పించిన నివేదికను పరిశీలించిన అనంతరం హైకోర్టు కీలక నిర్ణయం తీసుకోనున్నది. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న పంచాయితీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి కీలకమైన రిజర్వేషన్ల అంశం కావడంతో అధికార వైసీపీ నాయకులతో సహా అన్ని రాజకీయ పార్టీలు జరుగుతున్న పరిణామాలను ఎంతో ఆసక్తిగా గమనిస్తున్నాయి. హైకోర్టు జారీ చేసే ఆదేశాలకోసం అందరూ ఉత్కంఠతతో ఎదురు చూస్తున్నారు. మరోవైపు రిజర్వేషన్లు 50 శాతంపైబడిన నేపథ్యంలో న్యాయ పరమైన చిక్కులు వచ్చే అవకాశం ఉండటంతో ఎన్నికలు సజావుగా సాగేందుకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా రాష్ట్రం ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. అయితే తాజాగా జరిగిన తెలంగాణ ఎన్నికల్లోనూ అక్కడి ప్రభుత్వం కూడా కేవలం 50 శాతం రిజర్వేషన్లను మాత్రమే అమలు చేసింది. ఏపీలో సుమారు 59.85 శాతం రిజర్వేషన్లు ప్రకటించబోతున్న రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. దీనితో ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న పరిణామాలను తెలంగాణాతో పాటు చుట్టుపక్కల రాష్ట్రాల వారూ ఆసక్తిగా గమనిస్తున్నారు. మరోవైపు కొత్త పంచాయితీలపై నిషేధం ఎత్తివేసిన తరువాత వివిధ జిల్లాల యంత్రాంగం నుంచి ఇప్పటి వరకు 400 పంచాయితీలకు ప్రతిపాదనలు వచ్చినా కేవలం 200 పంచాయితీలకు మాత్రమే ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. ఇందులో ఇప్పటి వరకు సుమారు 100 పంచాయితీలను అధికారికంగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

అడ్డంకి దాటేనా..!

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు 13,000పైగా పంచాయితీలకు సుమారు 2018 ఆగస్టు నాటికే పదవీ కాలం అయిపోవడంతో వివిధ కారణాల వల్ల ఇప్పటి వరకు వాయిదా పడుతూ వచ్చాయి. కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ఎన్నికల నిర్వహించడానికి రంగం సిద్ధం చేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన ఘన విజయం స్ఫూర్తితో పంచాయితీలను క్లీన్ స్వీప్ చేయడానికి అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్సాహంగా ఉంది. ఈ నేపథ్యంలోనే రిజర్వేషన్ల తుది నివేదికను హైకోర్టుకు సమర్పిస్తున్నారు. అయితే హైకోర్టుకు సమర్పించే నివేదికలో రిజర్వేషన్లు 50 శాతం దాటడంతో కొంతమంది ఆశావహులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరి కొంతమంది న్యాయ వివాదాలంటూ అనుమానాలూ వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్ని వర్గాల వారికీ సమన్యాయం చేసే ఉద్దేశంతోనే రిజర్వేషన్లశాతాన్ని పెంచారని వైసీపీ శ్రేణులు గ్రామస్థాయిలో ఇప్పటికే ప్రచారం చేసుకుంటున్నారు. అందులోనూ మహిళలకు ప్రాధాన్యత ఇస్తుండటంపైనా సాధ్యమైనంత సానుభూతి పొందేందుకు వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు న్యాయ పరమైన వివాదాలకు తావులేకుండా ఉంటే ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు అనంతరం పంచాయితీలకు ఆ తరువాత కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలోని అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ చేస్తోంది.

విమర్శలకు.. రాకెట్‌తో బదులిస్తా..!



- ఒత్తిళ్లతో ఆటపై ప్రభావం ఉండదు
- టోక్యోలో 'బంగారం' గెలుస్తా..!
- ఆడిన అన్నీ మ్యాచుల్లో గెలవలేం..
- పీబీఎల్‌తో ఆట మరింత మెరుగు
- తప్పుల నుంచే చాలా నేర్చుకున్నా
- పెట్టుకున్న ఆశలు వమ్ము చేయను..
- బ్యాడ్మింటన్ ఛాంపియన్ పీవీ సింధు



న్యూఢిల్లీ : దశాబ్ద కాలంలో ఇండియా బ్యాడ్మింటన్ ఎంతో ఎత్తుకు చేరుకుంది. సైనా నెహ్వాల్ ఈ ఆటకు ఊపు తీసుకొస్తే.. సింధు ఆ క్రేజ్‌ను ఎన్నో రెట్లు పెంచింది. రియో ఒలింపిక్స్‌లో రజతం సాధించిన అతి పిన్న వయస్కురాలు, తొలి భారత మహిళా క్రీడాకారిణిగా రికార్డు సృష్టించింది. గతేడాది వరల్డ్ ఛాంపియన్ షిప్ టైటిల్‌తో ఓ కలను నెరవేర్చుకున్న సింధు.. ఇప్పుడు ఒలింపిక్ గోల్డ్‌పై కన్నేసింది. అయితే 2019లో చోటు చేసుకున్న పరిణామాలు, విమర్శలు తనను ప్రభావితం చేయలేవని స్పష్టం చేసింది. ఇప్పుడంతా రెండో సారి పాల్గొనబోయే టోక్యో ఒలింపిక్‌లో బంగారు పతకం సాధించడంపైనే దృష్టంతా కేంద్రీకరించినట్టు వివరించారు. "ప్రపంచ ఛాంపియన్ షిప్ నాకు ఎంతో పేరు, గౌరవం తెచ్చిపెట్టింది. కానీ ఆ తరువాత జరిగిన టోర్నీ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాను. కానీ నేను దాన్ని సానుకూలంగానే తీసుకున్నాను. ఆడిన మ్యాచులన్నింటిలో విజయబావుట ఎగురవేయడం సాధ్యం కాదు. కొన్ని సార్లు ఎంతో బాగా ఆడుతాం. మరికొన్ని సార్లు తప్పు చేస్తాం. నా ముందు ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ ఉంది" అని పీవీ సింధు చెప్పుకొచ్చింది. "నేను చేసిన తప్పుల నుంచి చాలా నేర్చుకున్నాను. ఇవి నన్ను నేను పాజిటివ్‌గా ఉంచుకునేందుకు ఎంతో దోహదం చేస్తాయి. అదేవిధంగా మరింత శక్తిశాలిగా ఎదిగేందుకు తోడ్పడుతాయి. టోక్యో ఒలింపిక్స్ విషయంలో నాపై చాలా మంది ఆశలు పెట్టుకున్నారు. విమర్శలు, ఒత్తిళ్లు అనేవి నా ఆటపై ఎలాంటి ప్రభావాన్ని చూపవు. నేను ఏ టోర్నీలోకి దిగినా నేను గెలుస్తాననే నమ్మకం అందరి నుంచి వినిపిస్తుంది. ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించడమనేది నా కల" అని పీవీ సింధు తెలిపింది.

పీబీఎల్‌పై సింధు గురి

ఒలింపిక్స్‌కు ఇంకా 7 నెలల సమయం ఉంది. దీనికి ముందు దేశీయ క్రీడాభిమానులను సంతోష పర్చేందుకు ఆమె పీబీఎల్ ఆడనుంది. 5వ సీజన్ జనవరి 20 నుంచి ఫిబ్రవరి 9 వరకు ఈ టోర్నీ జరగనుంది. అన్ని జట్లు సమాన శక్తితో ఉన్నాయని, అందుకే ప్రతీ మ్యాచ్ కీలకమని, ఒక జట్టు తక్కువ.. ఒక జట్టు ఎక్కువ.. అని తాను చెప్పబోనని తెలిపింది. పీబీఎల్‌లో హైదరాబాద్ హంటర్స్ సింధును రూ.77 లక్షలకు సొంతం చేసుకుంది. సింధుతో పాటు సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్, సమీర్ వర్మ, సాత్విక్‌సాయిరాజ్ అండ్ చిరాగ్ శెట్టి (డబుల్స్ జంట) కూడా టోక్యో ఒలింపిక్స్‌లో అర్హత సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జులై 24 నుంచి ఆగస్టు 9 వరకు జరగనున్నాయి.

రెజ్లర్ సుశీల్ లాగే పేరు తెస్తా

ఒలింపిక్‌లో రెండు సార్లు పతకాలు సాధించిన రెజ్లర్ సుశీల్ కుమార్‌ను ఆదర్శంగా తీసుకోవాలని, దేశం కోసం ఎంతో కష్టపడ్డాడని, అతని లాగానే టోక్యో ఒలింపిక్స్‌లో రెండో మెడల్ సాధించి తీరుతానని సింధు స్పష్టం చేసింది. జనవరిలో మలేషియా, ఇండోనేషియా టోర్నీలు ఉండటంతో 2020లో పతకం అంత సులభం కాదన్నారు. అదేవిధంగా ఒలింపిక్స్‌లో అర్హత సాధించేందుకు మరికొన్ని టోర్నీలు ఆడాల్సి ఉంటుందని, ఇవన్నీ తనకెంతో ముఖ్యమైనవని వివరించారు.

15 ఏళ్ల కల నెరవేరింది



- తల్లిదండ్రులతో పాటు భర్త ప్రోత్సాహం
- విశ్వ విజేతగా ఆనందం వేసింది..
- ర్యాపిడ్ చెస్ ఛాంపియన్ కోనేరు హంపి

న్యూఢిల్లీ : ప్రతిష్టాత్మక ప్రపంచ మహిళల ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో విశ్వ విజేతగా నిలవడంతో తన 15 ఏళ్ల కల నెరవేరిందని, ఎంతో సంతోషంగా ఉందని భారత్ చెస్ నెంబర్ క్రీడాకారిణి, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి చెప్పుకొచ్చారు. బుధవారం విజయవాడ చేరుకున్న సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ప్రత్యర్థులతో ఎత్తుకు పై ఎత్తు వేసి మేధస్సుకు పని చెప్పానని, ఈ విజయం వెనుక తన తల్లిదండ్రులు, భర్త ప్రోత్సాహం ఉందన్నారు. బంగారు పతకం ఇస్తున్న సమయంలో జాతీయ గీతం వినగానే చాలా సంతోషంగా వేసిందన్నారు. పాప పుట్టడంతో రెండేళ్ల వరకు ఆటకు దూరంగా ఉన్నా అని, తిరిగి ఆడిన గేమ్‌లో ప్రపంచ ఛాంపియన్‌గా నిలవడం చాలా ఆనందంగా ఉందని తెలిపింది. ఆరేళ్ల వయస్సు నుంచే చెస్ ప్లేయర్‌గా రాణించానని, రెండేళ్ల బ్రేక్ తర్వాత చెస్ ఆడటం కొంచెం కష్టం అనిపించిందన్నారు. ఈ సమయంలో గెలుపు, ఓటముల ను చూశానని, మరిన్ని టోర్నీలు ఆడి దేశం గర్వించే విధంగా చేస్తానని హంపి చెప్పుకొచ్చింది. సోమవారం ముగిసిన ప్రపంచ బ్లిడ్జ్ ఛాంపియన్ షిప్‌లో హంపి నిర్ణీత 17 రౌండ్లలో 10.5 పాయింట్లు ఖాతాలో వేసుకుని 12వ స్థానంలో నిలిచింది. 17 రౌండ్ల ఈ బ్లిడ్జ్ కేటగిరీలో ఆదివారం 9 రౌండ్లు, సోమవారం 8 రౌండ్లు జరిగాయి. హంపి 17 రౌండ్ల తరువాత 10.5 పాయింట్లతో మరో పది మందితో కలిసి సంయుక్తంగా ఆరోస్థానంలో నిలిచింది. మెరుగైన టైబ్రేక్ స్కోర్ ఆధారంగా ర్యాంకును ప్రకటించగా.. హంపికి 12వ స్థానం దక్కింది. మహిళల ర్యాపిడ్ చెస్ ఛాంపియన్ షిప్‌లో మొత్తం 12 రౌండ్లుగా హంపీ 9 పాయింట్లు ఖాతాలో వేసుకుని విశ్వవిజేతగా అవతరించింది.

కేన్ విలియమ్సన్.. అద్భుతమైన ఆటగాడు





- అతని ఆట తీరు ఎంతో భిన్నం
- టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ
- 2008, అండర్-19 ప్రపంచకప్ గుర్తులు

ముంబై : కివీస్ ఆటగాడు కేన్ విలియమ్సన్‌ను టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ ప్రశంసలతో ముంచెత్తాడు. 2008, అండర్ - 19 ప్రపంచ కప్ సందర్భంగా కొన్ని విషయాలు గుర్తు చేసుకున్నాడు. అప్పుడు కేన్ ఆట అద్భుతమని కొనియాడాడు. ఇతరులతో పోలిస్తే.. కేన్ ఆట ఎంతో భిన్నంగా ఉండేదన్నాడు. కోహ్లీ సారథ్యంలోని జట్టే 2008లో విశ్వ విజేతగా నిలవడం గమనార్హం. రవీంద్ర జడేజా, ట్రెంట్ బౌల్ట్, టిమ్ సౌథీలు సైతం ఆ టోర్నీలో ఆడారు. కేన్‌ను తాను ఎదుర్కోవడం ఇప్పటికీ గుర్తుందని, కివీస్‌కు అండగా ఉండేవాడని, ఐసీసీ అండర్ - 19 ప్రపంచ కప్ తన కెరీర్‌లో ముఖ్యమైన మైలురాయి అని తెలిపాడు. తన కెరీర్‌ను నిర్మించుకునేందుకు అండర్ - 19 ప్రపంచ కప్ వేదిక ఎంతో ఉపయోగపడిందన్నారు. అందుకే తన హృదయం, మనస్సులో దానికి ప్రత్యేక చోటు ఉంటుందని, అది ఇచ్చే అవకాశాన్ని గౌరవించడం, అర్థం చేసుకోవడం ఎంతో ముఖ్యమని అభిప్రాయపడ్డాడు.

పెళ్లి పీటలెక్కనున్న పాండ్య

- సెర్బియా మోడల్ నటాషా స్టాన్‌తో నిశ్చితార్థం
- ఎంగేజ్‌మెంట్ రింగ్‌తో ఇన్‌స్టాలో ఫొటో



న్యూఢిల్లీ : నూతన సంవత్సరంలో టీమిండియా ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా తన అభిమానులకు ఊహించని షాక్ ఇచ్చాడు. సెర్బియాకు చెందిన నటాషా స్టాన్‌తో తనకు నిశ్చితార్థం అయినట్టు సోషల్ మీడియాలో ప్రకటించాడు. నటాషా చేతికి రింగ్ పెట్టుకుని ఉన్న ఫొటోలను హార్దిక్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశాడు. ఓ ప్రైవేట్ బోటుపై చిన్నపాటి పార్టీ ఏర్పాటు చేసి అతికొద్ది మంది స్నేహితుల మధ్య వీరిద్దరి ఎంగేజ్‌మెంట్ జరిగినట్టు తెలుస్తోంది. ఈ ఫొటోలను పోస్టు చేసిన పాండ్యా.. ''మే తేరా.. తూ మేరీ జాన్ సారా హిందుస్తాన్' అంటూ క్యాప్షన్ కూడా పెట్టాడు. నటాషా సైతం ఉంగరం ధరించి తన ప్రేమికుడిని చుంబిస్తున్న వీడియోను పోస్ట్ చేసింది. కొత్త జంటకు టీమిండియా సారథి విరాట్ కోహ్లీ, కుల్దీప్ యాదవ్, ధోనీ సతీమణి సాక్షి, అజయ్ జడేజా, కృనాల్ సతీమణి పంఖూరి శర్మ, సోఫీ చౌదరీ, సోనాల్ చౌహాన్, శ్రేయస్ అయ్యర్, ముంబై ఇండియన్స్, మన్‌దీప్ సింగ్, చాహల్, బాలీవుడ్ నటుడు అర్జున్ కపూర్ తదితరులు అభినందనలు తెలియజేశారు. నటాషా చాలా కాలంగా ముంబైలో నివాసం ఉంటోంది. ప్రకాష్ ఝా దర్శకత్వం వహించిన సత్యాగ్రహ చిత్రంతో తెరంగేట్రం చేసింది. బిగ్‌బాస్ (హిందీ 8)లో పోటీ పడటంతో ఆమెకు క్రేజ్ పెరిగింది.

వన్డే, టీ20 కెప్టెన్‌గా ధోనీ

- టెస్టు సారథిగా విరాట్ కోహ్లీ
- దశాబ్దపు జట్లను ప్రకటించిన ఈఎస్‌పీఎన్



న్యూఢిల్లీ : ఈఎస్‌పీఎన్ క్రిక్ ఇన్ఫో ప్రకటించిన ఈ దశాబ్దపు వన్డే, టీ20 జట్లకు మిస్టర్ కూల్ ఎంఎస్ ధోనీని ఎంపిక చేసింది. అయితే టెస్టు జట్టుకు సారథిగా విరాట్ వైపే మొగ్గు చూపింది. 23 మంది సభ్యులతో కూడిన ప్యానెల్ పలు అంశాలను పరిగణలోకి తీసుకుని టెస్టు, వన్డే, టీ20 జట్లను ప్రకటించిందని ఈఎస్‌పీఎన్ క్రిక్ ఇన్ఫో తెలిపింది. ఈ దశాబ్దంలో ఆరేళ్లకు పైగా ఆడి ఉండి.. లేక కనీసం 50 టెస్టులైనా ఆడిన ఆటగాళ్ల ప్రదర్శనను పరిగణలోకి తీసుకుని జట్టును ప్రకటించినట్టు సంస్థ వివరించింది. అదేవిధంగా కనీసం 75 వన్డేలు, 100 టీ20లు ఆడిన ఆటాళ్ల రికార్డులను దృష్టిలో పెట్టుకుని ఆటగాళ్లను ఎంపిక చేసింది. టెస్టు జట్టులో కోహ్లీతో పాటు రవిచంద్రన్ అశ్విన్ మాత్రమే ఉన్నాడు. వీరితో పాటు ఇంగ్లండ్ మాజీ ఓపెనర్ అలిస్టర్ కుక్, కీవిస్ సారథి కేన్ విలియమ్సన్‌లు ఉన్నారు. వన్డేల్లో ధోనీ, కోహ్లీలతో పాటు రోహిత్ శర్మకు అవకాశం దక్కింది. టీ20 ఫార్మాట్ విషయానికొస్తే.. వెస్టిండీస్ నుంచి ఐదుగురు ఆటగాళ్లు చోటు దక్కించుకున్నారు. యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్, డ్వేన్ బ్రావో, సునీల్ నరైన్, పొలార్డ్‌లతో పాటు ఆండ్రీ రసెల్‌లు ఉన్నారు. ఇక భారత్ నుంచి ధోనీతో పాటు కోహ్లీ, బుమ్రాలకు అవకాశం దక్కింది. మహిళల క్రికెట్‌లో మిథాలీ రాజ్, జులాన్ గోస్వామిలు ఇద్దరు వన్డే, టీ20 జట్టులో చోటు దక్కించుకోగా.. ఈ రెండు ఫార్మాట్‌లకు ఆసీస్ క్రికెటర్ మెగ్ లాన్నింగ్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశారు.

చల్లని గాలులే కీలకం

- కివీస్ పర్యటనపై అజింక్యా రహానే
- వెల్లింగ్టన్, క్రైస్ట్‌చర్చ్‌లో న్యూజిలాండ్‌తో టెస్టు



న్యూఢిల్లీ : కివీస్‌తో వెల్లింగ్టన్, క్రైస్ట్‌చర్చ్‌లో జరిగే రెండు టెస్టులు ఎంతో కీలకమని, ఇక్కడ గాలి అనేది ప్రధాన కారకంగా నిలుస్తుందని అజింక్యా రహానే అభిప్రాయపడ్డాడు. వెల్లింగ్టన్‌లో ఫిబ్రవరి 21-25, క్రైస్ట్‌చర్చ్‌లో ఫిబ్రవరి 29-మార్చి 4 మధ్య రెండు టెస్టులు ఆడనుంది. ఆ తరువాత ఐదు టీ20లు, 3 వన్డేల్లో కూడా తన అదృష్టం పరీక్షించనుంది. 2014లో అక్కడ ఆడటం జరిగిందని, గాలి వీస్తూ ఉంటుందని, ఇది వికెట్‌కు ప్రధాన కారకం అవుతుందన్నాడు. గతంలో వెల్లింగ్టన్‌లో ఆడామని, కానీ క్రైస్ట్‌చర్చ్‌లో మాత్రం చాలా రోజుల అడుగుపెడుతున్నట్టు తెలిపాడు. వాగ్నెర్ ఇటీవలి ఇంగ్లండ్ సిరీస్‌లో 4 టెస్టుల్లో 27 వికెట్లు తీసుకున్నాడని, ఇక బ్యాటింగ్‌లో మాత్రం అందరినీ గౌరవించాల్సిందే అని వివరించాడు. ఒక్కో రకం బౌలింగ్‌ను.. ఒక్కో విధంగా ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఈ విషయంలో ప్రతీ ఒక్కరికి ఓ టెక్నిక్ ఉంటుందని, కొందరు క్రీజు బయట ఉండటానికి ఇష్టపడతారని, మరికొందరు లోపల ఉంటారని తెలిపాడు. టెక్నిక్ కంటే అక్కడ మెల్లిగా వీచే గాలిపై ఎక్కువ దృష్టి పెట్టాల్సి ఉంటుందని వివరించాడు. వేగం, దిశ వేరే విధంగా ఉంటుందని అభిప్రాయపడ్డాడు. కొందరు మిడిల్ స్టంప్ గార్డ్ తీసుకుంటే కొందరు లెగ్ గార్డ్ తీసుకుంటారని, అయితే ఇక్కడ వీచే చల్లని గాలుల పరిస్థితికి తగినట్టు ఆడాలని సూచించారు. దాదా, రాహుల్ కలిసి భారత్ క్రికెట్‌ను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లారని అభిప్రాయపడ్డారు.

టీ20 లంక సారథి మలింగా

- జట్టును ప్రకటించిన శ్రీలంక
- 16 నెలల తర్వాత మాథ్యూస్ రీ ఎంట్రీ



కొలంబో : ఈనెల 5 నుంచి భారత్-శ్రీలంక జట్ల మధ్య టీ20 సిరీస్ జరగనుంది. ఈ సిరీస్ కోసం టీమిండియా జట్టును బీసీసీఐ ఇప్పటికే ప్రకటించగా.. తాజాగా శ్రీలంక బోర్డు కూడా 16 సభ్యులతో కూడిన జట్టు జాబితాను వెల్లడించింది. పేసర్ లసిత్ మలింగ టీ20 జట్టు కెప్టెన్‌గా బాధ్యతలు మోయనున్నాడు. ఆల్ రౌండర్ ఏంజిలో మాథ్యూస్ దాదాపు 16 నెలల తరువాత మళ్లీ టీ20 జట్టులోకి వచ్చాడు. ముంబై ఇండియన్స్ తరపున ఆడనున్న మలింగాకు భారత్ పిచ్‌లపై మంచి అవగాహన ఉంది. దీనికితోడు మాథ్యూస్ కూడా జట్టులో చేరాడు. ఇటీవల పాక్‌లో జరిగిన మూడు టీ20ల సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసింది. అదే జోరును భారత్‌పై కొనసాగించాలని లంక చూస్తోంది. టీమిండియా కూడా అద్భుతమైన ఫాంలో ఉంది. తాజాగా విండీస్‌పై టీ20ని కైవసం చేసుకుంది. బౌలింగ్‌లో బలహీనత లేదు. బుమ్రా రావడంతో దానికి అవకాశం లేదు.

శ్రీలంక జట్టు : లసిత్ మలింగ (కెప్టెన్), కుశాల్ పెరీరా, దనుష్ గుణతిలక, అవిష్కా ఫెర్నాండో, భనుక రాజపక్సె, ఒసాడ ఫెర్నాండో, దసున్ శనక, ఏంజిలో మాథ్యూస్, నిరోషన్ డిక్వెల్లా, కుశాల్ మెండిస్, హసనరంగ, లక్ష్యన్ సందకన్, ధనంజయ డిసిల్వా, లాహిరు కుమార, ఇసురు ఉదాన.

భారత్ జట్టు : కోహ్లీ (కెప్టెన్), ధావన్, రాహుల్, శ్రేయస్ అయ్యర్, రిషబ్ పంత్, మనీశ్ పాండే, సంజు శాంసన్, శివమ్ దూబె, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, యుజువేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్, శార్దూల్ ఠాకూర్, నవదీప్ షైనీ, జస్ప్రీత్ బుమ్రా.

టోక్యో ఫైనల్ ఆడుతాం..!



- విజయం భారత్‌దే...
- ఒలింపిక్స్‌కు అర్హత 2019లో అతి పెద్ద విజయం
- ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌లో రాణిస్తాం.. హాకీ కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్

న్యూఢిల్లీ : టోక్యో ఒలింపిక్స్ హాకీ ఫైనల్ ఆడి.. గెలిచి తీరుతామని భారత్ హాకీ జట్టు పురుషుల కెప్టెన్ మన్‌ప్రీత్ ధీమా వ్యక్తం చేశాడు. 2018, భారత్ గడ్డపై జరిగిన ప్రపంచ కప్‌లో క్వార్టర్ ఫైనల్‌లో భారత్ జట్టు ఓడిపోయింది. కొత్త ఆస్ట్రేలియన్ కోచ్ గ్రహం రైడ్ నేతృత్వంలో అందిన క్రమశిక్షణ, స్థిరత్వమే టోక్యో ఫైనల్ ఆడేందుకు ఉపయోగపడుతుందన్నాడు. 2019 హాకీకి ఎంతో బాగుండిందని, ప్రపంచ ర్యాంకింగ్‌లో ఐదో స్థానంతో ప్రారంభించి.. అదే ర్యాంకులో కొనసాగుతున్నామని తెలిపాడు. ఒలింపిక్స్‌కు అర్హత సాధించడమే 2019లో అతిపెద్ద విజయమన్నాడు. కొత్త కోచ్ నేతృత్వంలోనే ఇది సాధ్యమైందని తెలిపాడు. మెరుగైన ర్యాంకు ఎందుకు సాధించలేదన్న దానికి ఎలాంటి కారణం లేదన్నాడు. ఎఫ్ఐహెచ్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ - 2019 అవార్డును మన్‌ప్రీత్ దక్కించుకున్నాడు. రాబోయే ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌లో నెదర్లాండ్స్, ప్రపంచ ఛాంపియన్ బెల్జియం, ఆస్ట్రేలియా వంటి అగ్ర జట్లతో జరిగే పోటీలు టోక్యో ఒలింపిక్స్‌లో ఎంతో సహాయపడుతాయన్నాడు. ప్రో-లీగ్ ప్రారంభ ఎడిషన్ నుంచి వైదొలిగిన భారత్.. ఫిబ్రవరి 8, 9 తేదీల్లో బెల్జియంతో ఆడే ముందు.. జనవరి 18, 19 తేదీల్లో డచ్ జట్టుతో, తరువాత ఫిబ్రవరి 22, 23 తేదీల్లో ఆస్ట్రేలియాతో ఆడనుంది. జట్టులో చాలా మంది యువ ఆటగాళ్లకు చోటు దక్కిందని, అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన ప్రదర్శన కనబరుస్తారని మన్‌ప్రీత్ ధీమా వ్యక్తం చేశాడు.

నాలుగు రోజుల టెస్టు వద్దు

- నేను పూర్తి వ్యతిరేకిని
- ఐసీసీ నిర్ణయం హాస్యాస్పదం
- ఆస్ట్రేలియా ఆఫ్ స్పిన్నర్ నాథన్ లియోన్



సిడ్నీ : టెస్ట్ ఫార్మాట్‌కు ఆదరణ పెంచేందుకు దేశవాళీ తరహాలోనే టెస్టులను నాలుగు రోజులకు పరిమితం చేసే ఆలోచనలో ఐసీసీ ఉందని వస్తున్న వార్తలపై ఆస్ట్రేలియా ఆఫ్ స్పిన్నర్ నాథన్ లియోన్ స్పందించాడు. ప్రపంచంలోని అన్నీ పెద్ద ఆటలను, కొన్ని ఉత్తమ టెస్ట్ మ్యాచ్‌లను చూస్తే.. అవి చివరి రోజు వరకు ఆటడం జరిగిందని క్రికెట్ ఆస్ట్రేలియా వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో లియోన్ అన్నాడు. 2014లో అడిలైడ్ వేదికగా ఇండియాతో జరిగిన టెస్టును చూస్తే.. ఐదో రోజు చివరి అరగంట వరకు జరిగిందన్నాడు. అదే ఏడాది కేప్‌టౌన్ వేదికగా జరిగిన టెస్టు మ్యాచ్‌లో మరో 2 ఓవర్లు మిగిలి ఉన్న సమయంలో సఫారీ బ్యాట్స్‌మెన్ మోర్న్ మోర్కెల్‌ను రేయాన్ హ్యారిస్ బౌల్డ్ చేశాడని, ఇది కూడా ఐదో రోజు చివరి 10 నిమిషాల వరకు సాగిందని తెలిపాడు. నాలుగు రోజుల టెస్టు మ్యాచ్‌లకు తాను ఫ్యాన్‌ని కాదని, ఐసీసీ ఆలోచన హాస్యాస్పదంగా ఉందని విమర్శించాడు. ఐదో రోజు ఎంతో కీలకమని, మ్యాచ్‌లు ఎక్కువగా డ్రా అవుతాయని, గతంతో పోలిస్తే ఈ రోజుల్లో వికెట్లు చాలా ఫ్లాట్‌గా ఉంటాయని, ఫలితంగా జట్లు ఎక్కువ సేపు బ్యాటింగ్ చేయడానికి అనుకూలంగా ఉంటుందని తెలిపాడు. అదే విధంగా జట్టుపై ఒత్తిడి తెచ్చేందుకు ఐదో రోజు ఆట ఎంతో కీలకమని, పిచ్ క్షీణించి స్పిన్నర్లకు అనుకూలంగా మారేందుకు గాను ఐదో రోజు అవసరమని, నాలుగు రోజుల టెస్టు మ్యాచ్‌కు తాను పూర్తి వ్యతిరేకమని స్పష్టం చేశారు. ఐదు రోజుల టెస్టు అనేది ఓ ఛాలెంజ్ అని వివరించాడు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.